అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 15-4-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 55 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50





జాడలేని రైతు మద్దతు

ఊసేలేని నిరుద్యోగ యువత ఆకాంక్షలు

11లో..

- జమిలి ఎన్నికలు అమలు చేస్తాం
- సంకల్ప్ పత్ర్ పేర 14 అంశాలతో బీజేపీ మ్యానిఫెస్టో
- విడుదల చేసిన ప్రధాని మోడీ, అమిత్ షా, నడ్డా, రాజ్ నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్

ప్రజా సమస్యలు పట్టని ప్రధాని



కేవలం అధికారాన్ని అనుభవిస్తున్నారు

మోడీ చుట్టూ భజనపరులు..

- విపక్షాలను బద్నాం చేయటమే బీజేపీ పని : ప్రియాంక గాంధీ

జలోర్ : ప్రజలు, వారి సమస్యల నుంచి ప్రధాని మోడీ దూరమయ్యారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. మోడీ విస్తృత అధికారాలను అనుభవిస్తున్నారని, ఆయన చుట్టూ ఉన్నవారు నిజం చెప్పడానికి భయపడుతున్నారని అన్నారు. "దేశ అతిపెద్ద సమస్య ద్రవ్యోల్బణం. మోడీజీ ...11లో

బీజేపీ ఓటమి ఖాయం

2004 చరిత్ర పునరావృతం

అంబేద్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఇరవై ఏండ్ల కిందటి చరిత్ర పునరావృతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి బీజేపీ ఓడిపోతుందనీ, ఇండియా కూటమి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. 2004లో షైనింగ్ ఇండియా మ్యానిఫెస్టోతో పోటీకి దిగిన బీజేపీ...ఇప్పుడు (2024) వికసిత్ భారత్ పేరుతో అదే పాత ప్రయోగం చేస్తోందన్నారు. అప్పుడు వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్న బీజేపీ పాలనను సోనియాగాంధీ నేతృత్వంలో దేశ ప్రజలు తిరస్కరించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే పునరావృతమవుతుందన్నారు. అప్పటిలాగే వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్న బీజేపీని తిరస్కరించి, రాహుల్‌గాంధీ నేతృత్వంలో దేశ ప్రజలు కాంగ్రెస్‌ను ...11లో



తగ్గిన అప్పులు పెరిగిన రీపేమెంట్లు



వెంటాడుతున్న పాత అప్పుల భారం


- కొత్తగా తెచ్చిన రుణాలు రూ.17,618 కోట్లు
- వడ్డీలు సహా కిస్తీల చెల్లింపులకు రూ.25,911 కోట్లు
- రాష్ట్ర ఖజానా పరిస్థితి ఇదీ...
- గట్టెక్కేందుకు మార్గాలు అన్వేషిస్తున్న సర్కారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకవైపు పదేండ్ల అప్పులు.. వాటికి నెలానెలా కట్టాల్సిన వడ్డీలు.. మరోవైపు ప్రస్తుత అవసరాల కోసం తీసుకొస్తున్న రుణాలు... వెరసి రాష్ట్ర ఖజానా కిందామీదా అవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసిన సంగతి విదితమే. వాటికి చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలే ఇప్పుడు తడిసిమోపెడవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ అంటే 2023 డిసెంబర్ నుంచి ఏప్రిల్ 13 వరకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్, బడ్జెటేతర రుణాలన్నీ కలిపి రూ.17,618 కోట్ల మేర అప్పులు చేసింది. ఇదే సమయంలో రేవంత్ ప్రభుత్వం గత అప్పులకు సంబంధించిన రీపేమెంట్ల కింద (అసలు, వడ్డీలు కలిపి కిస్తీలు తిరిగి చెల్లింపులు) రూ.25,911 కోట్లను చెల్లించింది. ఆ మేరకు తెలంగాణ ప్రజలపై మోపిన రుణభారాన్ని తగ్గించామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగు నెలల్లో తెచ్చిన కొత్త ...11లో

టెన్షన్...టెన్షన్

కాన్సులేట్‌పై దాడికి ఇరాన్ ప్రతీకారం



10లో..

- ఇజ్రాయిల్‌పై డ్రోన్లు, క్షిపణులతో దాడి
- వన్ టైమ్ పనిష్మెంట్ పూర్తయింది: ఖొమేనీ
- సమర్థవంతంగా తిప్పికొట్టాం: నెతన్యాహు
- దెబ్బకు దెబ్బ పద్ధతి వద్దు : నెతన్యాహుకు బైడెన్ ఫోన్
- ఇరాన్ దాడికి పశ్చిమ దేశాల ఖండన



ఎలా ఉన్నావమ్మా..

కవితను కలిసిన కేటీఆర్

నేడు కోర్టులో హాజరుపర్చనున్న సీబీఐ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంపై సీబీఐ కస్టడీలో ఉన్న కవితను సోదరుడు కె.తారకరామారావు కలిశారు. ఢిల్లీ లోధి రోడ్ - జవహర్ లాల్ నెహ్రూ మార్గ్ లోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో కవిత భర్త అనిల్, ...11లో

బీజేపీది మతాల మధ్య చిచ్చురేపే కుట్ర

గత ఎన్నికల వాగ్దానాల మాటేమిటి?

వామపక్ష, లౌకిక శక్తుల గెలుపే ఈ దేశానికి రక్ష : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య



నవతెలంగాణ -నర్సంపేట

గత పార్లమెంటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా.. ప్రజల్లో మతాల పేర చిచ్చురేపుతున్న మతోన్మాద బీజేపీని ఓడించి వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) హన్మకొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వాసవి కళ్యాణ మండపంలో కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికితీసి పేద ప్రజల అకౌంట్లో జమ చేస్తామన్న బీజేపీ వాగ్దానం అమలుచేయలేదని విమర్శించారు. అలాగే, రూ.20 కోట్ల ఉద్యోగాలు, రైతుల పంటకు మద్దతు ధర తదితర హామీలను అమలుపరచకపోగా.. ప్రజలపై భారాలు మోపారని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయడం కోసం మూడు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చారని, వాటికి వ్యతిరేకంగా ఏడాది పాటు రైతులు చేసిన పోరాటంలో సుమారు 750 మంది రైతులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి బీజేపీ యాజమాన్యాలకు కొమ్ముకాసిందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య బద్ధంగా వివిధ రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రాంతీయ పార్టీ ప్రభుత్వాలను విచ్ఛిన్నం చేసే విధంగా ప్రయత్నాలు చేసి ఆ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి కుట్రలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పరిపాలనను ప్రశ్నించే ...11లో

కేరళలో అత్యధికం..గుజరాత్‌లో అత్యల్పం

కార్మికులు, వ్యవసాయ కూలీల ఆదాయంపై లేబర్ బ్యూరో

డేటాను విడుదల చేసిన ఏఐకేఎస్



న్యూఢిల్లీ : కార్మికులు, వ్యవసాయ కూలీల ఆదాయంలో కేరళ ముందుండగా, గుజరాత్ వెనుకబడి ఉంది. కార్మిక మంత్రిత్వ శాఖకు చెందిన లేబర్ బ్యూరో డేటాను ఏఐకేఎస్ నాయకుడొకరు బయట పెట్టారు.. కార్మికులు, వ్యవసాయ కూలీల ఆదాయాలు దేశంలోనే అతి తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో గుజరాత్ ఒకటి. గుజరాత్‌ను దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రమని, స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో అధిక వాటా కలిగివున్న రెండవ అతి పెద్ద రాష్ట్రమని (మొదటిది మహారాష్ట్ర) ఊదరగొడుతున్న బీజేపీ నాయకులు దీనికి ఏం సమాధానం చెబుతారని కిసాన్‌సభ నాయకుడు ప్రశ్నించారు. గుజరాత్ అనే కాదు, బీజేపీ పాలిత రాష్ట్రాలన్నిటా ఇదే పరిస్థితి.. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే పారిశ్రామికీకరణ బాట పట్టడం, వ్యవసాయ ఉత్పత్తి తగినంతగా ఉండడం, భౌగోళిక, నైసర్గిక పరిస్థితులు అనుకూలించడం ఇవన్నీ గుజరాత్ అభివృద్ధిలో ప్రధాన భూమిక వహించాయి. 1990ల నాటికి అంటే బీజేపీ అధికారంలోకి రాక ముందే ఆ రాష్ట్రం అభివృద్ధి మార్గంలో ఉంది. గత ఇరవై ఏండ్లకు పైగా బీజేపీ పాలన కింద ఉన్న ఈ రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలకు అత్యల్ప వేతనాలు లభిస్తున్నాయి. కేరళలో ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి మనకు కనిపిస్తుంది. వామపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉండడం వల్ల ఈ రాష్ట్రంలో కార్మికుల, వ్యవసాయ కూలీల వేతనాలు దేశంలోనే అత్యధికం. చాలా రాష్ట్రాల నుంచి కూలీలు పని కోసం కేరళకు వెళుతుంటారు.

వలసకార్మికులను అక్కడి ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అతిథి కార్మికులుగా గౌరవిస్తూ, వారికి కొన్ని ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టింది. కేరళలో వ్యవసాయ కూలీల రోజువారీ వేతనం రూ.764.30 కాగా, మధ్యప్రదేశ్‌లో రూ. 229.20 రూపాయలు, గుజరాత్‌లో రూ. 241.90 మాత్రమే. ఇది జాతీయ సగటు కన్నా తక్కువ. ఈ కష్టజీవులు సృష్టించే సంపదకు, వారికి లభించే వేతనానికి మధ్య చాలా వ్యత్యాసముంది గుజరాత్‌లో. పారిశ్రామిక రంగంలో కార్మిల పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. వీరికి కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదు. ఈజ్ డూయింగ్ ఆఫ్ బిజినెస్ పేరుతో పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారులకు అధిక రాయితీలు ఇస్తున్న బీజేపీ ప్రభుత్వం, కార్మికుల హక్కులను ...11లో



కులగణన అంశం కీలకమే

- మెరుగైన విద్య,ఆరోగ్య సంరక్షణ, లింగ సమానత్వంలో వెనుకబాటు : అమర్త్య సేన్

కోల్‌కతా : కులగణన పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశమే అని అమర్త్య సేన్ అన్నారు. అయితే అంతకంటే ముందు మెరుగైన విద్య, ఆరోగ్య సంరక్షణ, లింగ సమానత్వం వంటి అంశాల్లో వెనుకబడిన వారికి మరింత సాధికారత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి ప్రజాస్వామ్య దేశ పౌరుడినైనందుకు చాలా గర్విస్తున్నానని తెలిపారు. కానీ, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ...11లో



పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ, దాని భాగస్వామ్య పక్షాల అభ్యర్థులు ప్రచారానికి వస్తుంటే రైతన్నలు వారిని తరిమికొడుతున్నారు. ఆ దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్నాయి.

అన్నదాతల గోస ?

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వం

- హామీలు ఘనం...ఆచరణ శూన్యం
- నీటి మూటలైన ఎంఎస్‌పీ, ఆదాయం రెట్టింపు వాగ్దానాలు
- పథకాలు, బడ్జెట్లలో భారీ కోతలు
- ప్రాణాలు తీసుకుంటున్న రైతన్నలు



న్యూఢిల్లీ : రైతుల్లో ఇంత ఆగ్రహం ఎందుకు కలుగుతోంది? వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అణచివేసినందుకు మాత్రమే వారు కోపగించుకోవడం లేదు. లేదా కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేసినప్పుడు తమపై దాష్టీకాన్ని ప్రదర్శించినందుకు కూడా వారు మండిపడడం లేదు. మరి వాటికి మించిన కారణాలేమున్నాయి?

దేశంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీఇన్నీ కావు. అన్నదాతలకు ఇచ్చిన హామీలను పదేండ్ల పాలనలో మోడీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. వీటన్నింటినీ ఫైనాన్షియల్ అకౌంటబులిటీ ఇండియా (ఫ్యాన్ ఇండియా) సంస్థ రూపొందించిన 'రైతుల రిపోర్ట్ కార్డు' ఎత్తిచూపింది. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదన మేరకు రైతుల ఉత్పత్తులకు కనీసం ఒకటిన్నర రెట్లు అదనంగా కనీస మద్దతు ధర చెల్లించి వాటిని సేకరిస్తామని 2014లో నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. 2016లో ఆయన మరో హామీ కూడా ఇచ్చారు. 2022 నాటికి రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని నమ్మబలికారు. అయితే మోడీ హామీ మేరకు రైతుల ఆదాయం 2022 నాటికి నిజంగా రెట్టింపు అయిందా లేదా అనేది పరిశీలిద్దాం.

పథకాల్లో కోతలు

'2021లో వ్యవసాయ కుటుంబాల పరిస్థితిని అంచనా వేస్తూ ఓ నివేదిక విడుదలైంది. 2018-19లో రైతు కుటుంబాల నెలసరి ఆదాయాన్ని ఈ నివేదిక రూ.10,218గా అంచనా వేసింది. లక్ష్యంగా నిర్దేశించుకున్న నెలసరి ఆదాయం రూ.22,610కి ఇది కనీసం దగ్గరగా కూడా లేదు' అని ఫ్యాన్ ఇండియా రిపోర్ట్ కార్డు తెలిపింది. ప్రభుత్వ పత్రాలు, అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం-ధర ...10లో

యాంటీ ట్యాంక్ మిస్సైల్ సిస్టమ్ ప్రయోగం సక్సెస్

డీఆర్‌డీఓ దేశీయంగా అభివృద్ధి చేసిన మిస్సైల్



న్యూఢిల్లీ : దేశీయంగా అభివృద్ధి చేసిన 'మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ సిస్టమ్' (ఎంపీఏటీజీఎం)ను భారత సైన్యం విజయవంతంగా పరీక్షించింది. దీంతో సైన్యంలోకి యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థను చేర్చడానికి మార్గం సుగమమైంది. ఈ క్షిపణిని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ...11లో



గొంతులో గరగర

స్వర తంత్రులు దెబ్బతింటున్నాయి

నిరంతర ప్రచారంతో ఇబ్బంది పడుతున్న నేతలు

న్యూఢిల్లీ : దేశంలో ఎక్కడ చూసినా ఎన్నికల వేడే కన్పిస్తోంది. రాజకీయ నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. విశ్రాంతి అనేదే లేకుండా ఊరూ వాడా చుట్టేస్తున్నారు. ర్యాలీలు, సభలు, ఆత్మీయ సమావేశాలు...ఒకటేమిటి అవకాశం దొరికితే చాలు. మైకు పట్టుకొని ప్రసంగాలు దంచేస్తున్నారు. అయితే అలుపెరుగని ప్రచారంతో నేతలు, అభ్యర్థుల గొంతుకలు గరగరమంటున్నాయి. స్వర తంతువులు (ఓకల్ కార్డ్స్) దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో మన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో స్వర తంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని వాయిస్ సర్జన్లు అభిప్రాయపడుతున్నారు.

రేపు (మంగళవారం) వరల్డ్ వాయిస్ డే. వోకల్ కార్డ్స్ పాత్రను చాటిచెప్పడం, ప్రజలను జాగృతం చేయడం దీని ఉద్దేశం. రాజకీయ నాయకులు తమ గళాన్ని ఎంతో పొదుపుగా వాడుకోవాలని వాయిస్ సర్జన్లు సూచించారు. ఓకల్ కార్డ్స్ సమస్యలతో పలువురు నేతలు తనను కలుస్తుంటారని వాయిస్ సర్జన్ డాక్టర్ నుపుర్ ...11లో



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు , నెక్లెస్ రోడ్డులో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్దకు భారీగా తరలివచ్చిన సందర్శకులు

బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్నాం

- అంబేద్కర్ జయంతిలో ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో గత ప్రభుత్వాల హయాంలో విస్మరణకు గురైన వర్గాలకు, బడుగు, బలహీన వర్గాలకు కేంద్రంలోని మోడీ సర్కారు పెద్ద పీట వేస్తున్నదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంబేద్కర్ ఆశయాలను సాకారం చేయడానికి మోడీ సర్కారు కట్టుబడి ఉందన్నారు.

ఆదివాసీలకు, దళితులకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. తొలిసారి ఆదివాసీ మహిళను రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీదన్నారు. కేవలం విద్యా ఉద్యోగాలకే కాకుండా పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని మార్చడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని కొంత మంది చేస్తున్న విషప్రచారాన్ని కొట్టిపడేశారు. అంబేద్కర్‌ను రెండు సార్లు ఓడించడానికి కాంగ్రెస్ ప్రయత్నించిదని విమర్శించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం దేశానికి రక్షణగా నిలుస్తోందన్నారు. పేదరికం లేని దేశంగా మార్చడమే లక్ష్యంగా ప్రధాని మోడీ మ్యానిఫెస్టో విడుదల చేశారని కొనియాడారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

ఆప్ సదస్సులో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని దేశాన్ని రక్షించండి' అనే అంశంపై ఆప్, టీజేఎస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోకపోతే ప్రజలు ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారుతందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలను పట్టించుకోకుండా భావోద్వేగాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నదని విమర్శించారు. బీజేపీ విధానాల కారణంగా ఏ దేశంలో లేనంత అసమానతలు నెలకొన్నాయని చెప్పారు. దేశంలో రాజ్యాంగం రక్షించబడాలన్నా... ప్రజాస్వామ్యం పరిరక్షింపబడాలన్నా... ఇండియా కాపాడాబడాలన్నా బీజేపీ ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ ప్రధాన కార్యదర్శి ఎన్. రమేశ్, ఆర్థిక నిపుణులు డి.పాపారావు, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్ పర్సన్ ఒబేదుల్లా కొత్వాల్, ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డాక్టర్ అన్సారీ, ఎంఎ.మజీద్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్ యమున గౌడ్, అధికార ప్రతినిధులు ఫణిభూషణ్, జావేద్ షరీఫ్, దివ్యాంగ విభాగం కన్వీనర్ దర్శనం రమేష్, మైనారిటీ కమిటీ కన్వీనర్ అఫ్జల్, డాక్టర్స్ విభాగం కన్వీనర్ డాక్టర్ లాఖ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి -బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంబేద్కర్‌ను కాంగ్రెస్ సర్కార్ అవమానించిందనీ, అందుకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో వారు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ సచివాలంయ సమీపంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ సర్కారు ఆ విగ్రహం వద్ద అలంకరణ చేయకుండా, పూలమాల వేయకుండా అంబేద్కర్‌ను అవమానించిందని తెలిపారు. కేసీఆర్ గుర్తులను చెరిపేయాలనే కక్షతో కాళేశ్వరం నీళ్లను రైతులకు అందకుండా చేస్తున్నారని విమర్శించారు.

రాజ్యం చేతిలో సహజవనరులుండాలి

- దేశంలో ఆర్థిక, సామాజిక, మహిళా సమానత్వం రావాలి
- వీటి కోసమే జీవితాంతం పోరాడిన అంబేద్కర్
- ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వం
- ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి : అంబేద్కర్ జయంతి సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

రాజ్యం చేతిలో సహజ వనరులుండటంతో పాటు దేశంలో ఆర్థిక, సామాజిక, మహిళా సమానత్వం రావాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన జీవితాంతం పోరాడారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కొనియాడారు. కానీ, నేడు అధికారంలో ఉన్న మోడీ సర్కారు ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. అలాంటి బీజేపీ సర్కార్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ. . దేశంలోని ప్రభుత్వాస్తులను, సహజ వనరులను మోడీ సర్కారు కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతున్న తీరును కండ్లకు కట్టినట్టు వివరించారు. దేశంలో ఆర్థిక సమానత్వం రావాలని అంబేద్కర్ కోరుకుంటే, బీజేపీ పదేండ్ల పాలనా విధానాలతో దేశంలో పేదల సంఖ్య 90 శాతానికి పెరిగిందనీ, దేశ సంపద మాత్రం కొందరి చేతుల్లో పేరుకుపోయిందని చెప్పారు. దేశంలో మహిళా సమానత్వం రావాలని అంబేద్కర్ పోరాడితే బీజేపీ మాత్రం ఏదో ఘనకార్యం చేసినట్టుగా స్త్రీలపై లైంగిక దాడులకు పాల్పడిన వారికి పూలదండలేసి జైళ్ల నుంచి స్వాగతం పలుకుతున్న తీరును ఎండగట్టారు. దేశంలో మోడీ సర్కారు మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందనీ, మనుధర్మశాస్త్రాన్ని రాజ్యాంగంగా అమలు చేసే కుట్ర జరుగుతున్నదని హెచ్చరించారు. అంబేద్కర్ కోరుకున్నట్టుగా ఆర్థిక, సామాజిక, మహిళా సమానత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ..దేశంలో భూములను పేదలకు పంచాలని పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ మాట్లాడారని గుర్తుచేశారు. నేటి పాలకులు పేదలకు భూములు పంచకపోగా ఉన్నవాటిని గుంజుకుని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. పేదల కోసం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టానికి, ప్రజాపంపిణీ వ్యవస్థకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్‌నాయక్ మాట్లాడుతూ.. మోడీ సర్కారు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తోందని విమర్శించారు. నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు పోరాటం చేస్తే రైతుల డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పిన మోడీ సర్కారు మాటతప్పిందన్నారు. మళ్లీ మోడీ సర్కారు వస్తే వ్యవసాయ రంగం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదముందని హెచ్చరించారు. సీఐటీయూ సీనియర్ నేత పి.రాజారావు, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ఎస్ఆర్‌ఏ ప్రసాద్, యాటల సోమన్న, కేవీఎస్ఎస్ రాజు, పి.సుధాకర్, ఎ.సునీత, సీఐటీయూ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదేండ్లుగా రాష్ట్రానికి కేంద్రం అన్యాయం

- అమలుచేయని హామీలపై చర్చకు బీజేపీ సిద్ధమా..? మంత్రి పొన్నం ప్రభాకర్
- కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన దీక్ష

నవతెలంగాణ - కరీంనగర్



కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రానికి చేసిన అన్యాయం, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ నిరసన దీక్ష చేశారు. మొదట అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్.. కాంగ్రెస్ గ్యారంటీల గురించి అడుగుతున్నారని, తాము అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అయిందని, మీరు పదేండ్ల అధికారంలో ఉండి ఎన్ని హామీలను అమలుచేశారని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎక్కడా అమలుచేయలేదని, దానిపై బీజేపీ నాయకులు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకొచ్చారని, దానిపై ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు దీక్ష చేయగా, 1000మంది రైతులు చనిపోయారని, అయినా బీజేపీ స్పందించలేదని, ఈ రోజు ఏ ముఖం పెట్టుకొని రైతుల గురించి మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ అమరవీరుల గురించి పార్లమెంటులో మోడీ అవమానకరంగా మాట్లాడుతుంటే పార్లమెంటులో ఉండి నోరు ఎందుకు మెదపలేదని బండి సంజయ్‌ని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో తెలంగాణ విభజన హామీలు అమలు కాలేదని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమపై 12శాతం జీఎస్టీ వేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది బీజేపీ ప్రభుత్వమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తప్పించడానికి కారణం తాను చేసిన అవినీతి కాదా అని ప్రశ్నించారు. శ్రీరాముని పేరుతో ఇంటింటికి అక్షింతలు పంచుతూ దేవుడి పేరుతో ఓట్లు అడిగి రాజకీయం చేయడం ఎంతవరకు సబబు అని అన్నారు. తాను హిందువునని చెప్పుకునే బండి సంజయ్‌కు.. ముక్కా చుక్కా లేనిదే రోజు గడవదని ఆరోపించారు. దేశంలోని అన్ని దేవాలయాలకు నిధులు ఇస్తే ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం దేవాలయాలకు బండి సంజయ్ ఎందుకు నిధులు తీసుకురాలేదని ప్రశ్నించారు. ఈ నిరసన దీక్షలో మానకొండూరు ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరు సత్యనారాయణగౌడ్, జిల్లా ఇన్‌చార్జి నరసింహారెడ్డి, నాయకులు పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కులరహిత సమాజ కోసం కృషి చేయడమే నిజమైన నివాళి

అంబేద్కర్ జయంతి వేడుకల్లో టీపీఎస్‌కే కన్వీనర్ జి రాములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుల నిర్మూలన ఉద్యమాలే అంబేద్కర్‌కు నిజమైన నివాళలని టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి రాములు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ 133 వ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం రాములు మాట్లాడుతూ అణగారిన వర్గాల్లో పుట్టి , వెలివాడల బతుకులను చూసి, అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని తన చదువును కొనసాగించారన్నారు. దేశ అత్యున్నత రాజ్యాంగాన్ని రచించడానికి కారణమయ్యరని చెప్పారు. చదువుతోనే మనిషికి జ్ఞానం,, సమాజంలో గౌరవం దక్కుతాయని చెప్పారు. అంబేద్కర్ జీవితమే ఒక నిదర్శనమని చెప్పారు. మనుధర్మాన్ని తగలబెట్టి మనుషులంతా సమానమని రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. తన జీవితానంతా దళిత బలహీనవర్గాల అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. అణగారిన వర్గాలకు సమాజంలో సముచిత స్థానం దక్కాలని ఆకాంక్షించారన్నారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరిచారని తెలిపారు. అంబేద్కర్ ను కేవలం ఒక దళిత నాయకుడు గానే చిత్రీకరించడం సరైంది కాదన్నారు. కేంద్రంలో బీజేపీ సర్కార్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా రిజర్వేషన్లను తొలగించి సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగ రక్షణ ఉద్యమాల ద్వారా అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి రమణ, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్, టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, జీఎంపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉదుత రవీందర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం శోభన్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడిరాజు నరేశ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మా నాయక్ , కేవీపీఎస్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం దశరథ్, బి సుబ్బారావు, సోషల్ మీడియా ఇన్‌ఛార్జీ జగదీష్, బాలోత్సవ కమిటీ కార్యదర్శి ఎస్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంతా గోప్యతే

నోటీసు ఇవ్వరు...కారణం చెప్పరు

డిజిటల్ న్యూస్‌పై మోడీ సర్కారు ఉక్కుపాదం

ప్రభుత్వ వ్యతిరేక కథనాలపై ఆంక్షలు





ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న స్వతంత్ర జర్నలిస్టులు

న్యూఢిల్లీ : నోటీసులు ఇవ్వరు... హెచ్చరికలు జారీ చేయరు... నిబంధ నలు పాటించరు... ఐటీ చట్టంలో చేర్చిన నూతన నిబంధనలను సాకుగా చూపుతూ సామాజిక మాధ్యమాలలో కన్పించే డిజిటల్ వార్తలపై మోడీ ప్రభుత్వం అనుస రిస్తున్న కక్షపూరిత వైఖరి ఇది. ఆ వార్తలు, కథనాలు ప్రజలకు చేర కుండా సర్కారు ఉక్కుపాదం మోపు తోంది. నిషేధం విధిస్తోంది. ఆయా ఛానల్స్ యాజమాన్యాలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోంది. ఎలాంటి కారణం చూపకుండానే తమ వార్తలు, కథనాలను నిలిపివేస్తున్నారని ఫేస్‌బుక్ నుండి యూట్యూబ్ వరకూ డిజిటల్ పాత్రికేయులు గగ్గోలు పెడుతున్నారు. అయినా వారి గోడు అరణ్యరోదనే అవుతోంది.

ఇది 'బోల్తా హిందుస్థాన్' కథ

ఢిల్లీకి చెందిన వార్తా ఛానల్ 'బోల్తా హిందుస్థాన్'కు యూట్యూబ్ నుండి ఈ నెల 3వ తేదీన ఓ ఈ-మెయిల్ వచ్చింది. ఛానల్ ప్రసారాలు నిలిపివేయాలంటూ తమకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుండి నోటీసు అందిందని అందులో తెలియ జేశారు. అయితే ఇది స్పామ్ మెస్సేజ్ అయి ఉంటుందని భావించిన బోల్తా హిందుస్థాన్ ఛానల్ దానిని పెద్దగా పట్టించుకోలేదు. ఈ-మెయిల్ అందిన 12 గంటల తర్వాత... మూడు లక్షల మంది వినియోగ దారు లున్న ఈ యూట్యూబ్ ఛానల్ అదృశ్యమై పోయింది. దీంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఆ ఛానల్ యాజమాన్యం మరోసారి ఇ-మెయిల్‌ను సంప్రదించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిబంధనల్లోని (ఐటీ చట్టంలోని సెక్షన్ 69-ఏతో కలిపి) రూల్ 15 (2) ప్రకారం నోటీసు జారీ చేసినట్టు అందులో తెలిపారు. అయితే ఛానల్ న్యూస్‌రూమ్‌పై ఎందుకు ఈ చర్య తీసుకున్నదీ తెలియరాలేదు. ప్రభుత్వ నోటీసును గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఉన్నదని, కాబట్టి దానిని ఛానల్‌తో పంచుకోలేకపోతు న్నామని యూట్యూబ్ ఈ-మెయిల్ వివరించింది. ఎలాంటి కారణం తెలియజేయకుండా ఇలాంటి ఆదేశాలు ఎలా జారీ చేస్తారని బోల్తా హిందుస్థాన్ ఛానల్ సంపాదకుడు సమర్ రాజ్ ప్రశ్నించారు. 'నోటీసు ఇవ్వరు. హెచ్చరికలు జారీ చేయరు. కారణం చెప్పరు. ఓ ప్రక్రియను పాటించరు. అసలు వారి సమస్య ఏమిటో తెలుసుకోలేకపోతున్నాము' అని అన్నారు.

ఈ వేదికలపై కూడా...

డిజిటల్ న్యూస్‌పై మోడీ సర్కారు ఉక్కుపాదం మోపడం ఇదేమీ మొదటిసారి కాదు. బోల్తా హిందుస్థాన్‌కు ఈ-మెయిల్ వచ్చిన రోజే మరో డిజిటల్ సంస్థ 'నేషనల్ దాస్‌టాక్' కూడా యూట్యూబ్ నుండి ఇదే తరహా సందేశం అందుకుంది. ఈ ఛానల్‌కు 94 లక్షల మంది వినియోగదారులు ఉన్నారు. ఫిబ్రవరిలో 'ఆర్టికల్19 ఇండియా' అనే డిజిటల్ సంస్థకు మేటా నుండి ఇదే రకమైన ఈ-మెయిల్ వచ్చింది. ఈ సంస్థ ఫేస్‌బుక్ పేజీపై ఆంక్షలు విధించినట్లు అందులో తెలియజేశారు. గత నెలలో యూట్యూబ్ మన దేశంలో రెండు వీడియోలను బ్లాక్ చేసింది. వీటిని ఆస్ట్రేలియా బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఏబీసీ) రూపొందించింది. ఇవి సిక్కు వేర్పాటువాది హత్యకు సంబంధించినవి. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుండి తనకు ఆదేశాలు అందాయని, అయితే వాటిని గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఉన్నదని ఏబీసీకి మేటా తెలిపింది. మంత్రిత్వ శాఖ పంపిన నోటీసును తనతో పంచుకునేందుకు యూట్యూబ్ నిరాకరించిందని నేషనల్ దాస్‌టాక్ వ్యవస్థాపకుడు శంభు కుమార్ సింగ్ చెప్పారు. దానికి కారణం గోప్యతే. సింగ్ లోక్‌సభ ఎన్నికల్లో బీహార్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 'బహుశా మేము బహుజనులు, రైతులపై కథనాలు ఇస్తున్నందుకు ఇలా చేసి ఉండవచ్చు. కుల వ్యవస్థను మేము వ్యతిరేకిస్తున్నాము. రాజ్యాంగ హక్కులపై వార్తలు అందిస్తున్నాము. అదే మా తప్పు అయి ఉండవచ్చు. వాళ్లు కనీసం కారణం కూడా చెప్పడం లేదు. ఇప్పుడు మేము ఏం చేయాలి?' అని ఆయన వాపోయారు.

నోటిఫికేషన్లు పోవు...ఆదాయం రాదు

ఇప్పుడు మళ్లీ 'ఆర్టికల్19 ఇండియా' ఫేస్‌బుక్ పేజీ విషయానికి వద్దాం. ప్రభుత్వం ఇచ్చిన నోటీసుపై సంవత్సరం తర్వాతే అప్పీలు చేసుకోవాలని ఫేస్‌బుక్ నుండి వచ్చిన ఈ-మెయిల్‌లో స్పష్టం చేశారని ఆ పేజీ వ్యవస్థాపకుడు నవీన్ కుమార్ చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి వార్తలు, కథనాలు రాకూడదన్నదే వారి ఉద్దేశంగా కన్పిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అసలు తమపై ఫిర్యాదు చేసింది ఎవరో కూడా తెలియడం లేదని అన్నారు. ప్రభుత్వ చర్య కుమార్‌ను చాలా ఇబ్బంది పెడుతోంది.

ఫేస్‌బుక్‌లో కొత్త కథనాన్ని అప్‌లోడ్ చేస్తుంటే ఆయన పోర్టల్‌ను చూసే వారికి నోటిఫికేషన్లు పోవడం లేదు. అంతేకాదు...అప్‌లోడ్ చేసిన వీడియోల ద్వారా ఆయనకు ఎలాంటి డబ్బు అందడం లేదు. గత మూడు నెలల్లో తాను అప్‌లోడ్ చేసిన అనేక వీడియోలకు ఒక్క రూపాయి కూడా రాలేదని కుమార్ చెప్పారు. 'నేను టీవీ రంగంలో ఇరవై సంవత్సరాలు పనిచేశాను. టీవీ మీడియాలో పరిస్థితులు నచ్చక ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ఇక్కడి నుండి మేము ఎక్కడికి పోవాలి?' అని ఆవేదనతో ప్రశ్నించారు.

ఈసీ దృష్టికి వెళ్లినా...

యూట్యూబ్ ఛానల్స్‌పై నిషేధం విధిస్తున్న విషయాన్ని ఈ నెల 8న కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసికెళ్లారు. ఎన్నికల సమయంలో ఇలాంటి చర్యలకు పాల్పడే అధికారం ప్రభుత్వానికి లేదని ఆయన గుర్తు చేశారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 69, సెక్షన్ 79లను యూట్యూబ్ ఛానల్స్‌పై ప్రయోగించకూడదని ఎన్నికల కమిషన్ కూడా అభిప్రాయపడింది. ఎన్నికల సమయంలో భావ ప్రకటనా స్వేచ్ఛను నిలువరించకూడదని తెలిపింది. అయినప్పటికీ డిజిటల్ న్యూస్‌పై ఆంక్షలు ఆగడం లేదు. కాగా ప్రభుత్వ ఒత్తిడులకు లొంగేది లేదని, ప్రజలను చేరుకోవడానికి మరో ఛానల్‌ను ప్రారంభిస్తామని లేదా ఇతర మీడియా వేదికలను ఉపయోగించుకుంటామని నిషేధానికి గురైన వేదికలు స్పష్టం చేశాయి.

ఒత్తిడి తెస్తూ...

ఐటీ చట్టంలో తీసుకొచ్చిన నిబంధనలు సామాజిక మాధ్యమ వేదికలైన ఫేస్‌బుక్, యూట్యూబ్‌కు విశేషాధికారాలు కట్టబెట్టాయి. ఏ సమాచారాన్నయినా తొలగించే లేదా సవరించే లేదా నిషేధించే అధికారాలు వాటికి సంక్రమించాయి. ఈ చట్ట నిబంధనలనే ప్రభుత్వం తనకు అనుకూలంగా మార్చుకుంటూ సామాజిక మాధ్యమాలపై ఒత్తిడి తెస్తోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తున్న వార్తలు, కథనాలు, వీడియోలను తొలగించేలా చేస్తోంది.

అందరిదీ ఇదే గోస

ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో వీడియోలు అప్‌లోడ్ చేస్తున్న పలువురు స్వతంత్ర డిజిటల్ జర్నలిస్టులది కూడా ఇదే పరిస్థితి. తనకు ఒక్క రూపాయి కూడా ఆదాయం లభించకుండా మూడు నెలలు ఆంక్షలు విధించారని అంజుమ్ తెలిపారు. మంత్రిత్వ శాఖ నిర్ణయంపై అప్పీలు చేసినా ఎలాంటి ప్రయోజనం కలగలేదు. గత ఆరు నెలలుగా ప్రజలకు చేరువ కావడం కూడా కష్టమవుతోందని, ఓ సంవత్సరం క్రితం తన వీడియోలను లక్షలాది మంది చూసేవారని, ఇప్పుడు వేల సంఖ్యలో చూడడం కూడా కష్టమవుతోందని ఆయన తెలిపారు. గత నవంబర్ నుండి తనది కూడా ఇదే పరిస్థితి అని స్వతంత్ర పాత్రికేయుడు సాక్షి జోషి చెప్పుకొచ్చారు. తన సంస్థ 'గాన్ సవేరా'కు చెందిన సోషల్ మీడియా ఖాతాలను 2023 ఆగస్టులో, ఈ ఏడాది ఫిబ్రవరిలో నిలిపివేయడాన్ని సవాలు చేస్తూ జర్నలిస్ట్ మన్‌దీప్ పునియా పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి, యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమ వేదికలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మరునాడు ట్విట్టర్ ఖాతాను పునరుద్ధరించారని, అయితే ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో మాత్రం సెన్సార్‌షిప్ కొనసాగుతోందని పునియా తెలిపారు. ప్రచురించిన ఓ కథనాన్ని 24 గంటల్లోగా తొలగించాలంటూ 'ది కారవాన్' పత్రికకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఫిబ్రవరిలో ఐటీ చట్టంలోని సెక్షన్ 69-ఏ కింద నోటీసు ఇచ్చింది. దీనిని ఆ పత్రిక ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసింది.

ప్రశ్నించే గొంతుక..

- సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి : రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి



నవతెలంగాణ-నూతనకల్

పార్లమెంటులో ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుక సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్లలో బొజ్జ శ్రీను అధ్యక్షతన నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రగల్భాలు పలుకుతోందన్నారు. బీజేపీ పదేండ్ల పాలనలో మహిళలపై లైంగికదాడులు, వేధింపులు, దళితులపై దాడులు నిత్య కృత్య మయ్యాయని విమర్శించారు.

నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుల బతుకులు భారంగా మారా యన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొ రేట్లకు కట్టబెట్టి నిరుద్యోగాన్ని పెంచి పోషించిందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడిం చాలని, సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి, పులుసు సత్యం, తోట్ల లింగయ్య, శ్రీనివాస్ రెడ్డి ,శ్రీకాంత్, నడిపి లింగయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రద్దు చేసే ఉద్దేశంతో బీజేపీ

తమిళనాడు సీఎం స్టాలిన్



చెన్నై : అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని రద్దు చేసే భయంకరమైన ఉద్దేశంతో బీజేపీ ఉందని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షులు ఎంకె స్టాలిన్ విమర్శించారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా స్టాలిన్ ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. బీజేపీ తన తిరోగమనవాదంతో దేశాన్ని తీవ్రమైన ఆకలి వైపునకు, రెండు శతాబ్దాల వెనక్కి తీసుకుని వెళ్లిందని ఈ పోస్టులో ఆరోపించారు. భారత దేశం తన చరిత్రలోనే అత్యంత కీలకమైన ఎన్నికలను ఎదుర్కొంటుందని అన్నారు. అంబే ద్కర్‌ను నవయుగ బుద్ధుడుగా అభివర్ణించారు. నిజమైన సమసమాజాన్ని సాధించడానికి అంబేద్కర్ అంతులేని జ్ఞానం, స్ఫూరిని మనం అనుసరించాలని స్టాలిన్ పిలుపునిచ్చారు.

అవకాశవాదులను ఓడించండి

- బీజేపీని నిలువరించగలిగేది కమ్యూనిస్టులే
- సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించండి : సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-నాంపల్లి

పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అవకాశవాద అభ్యర్థులను ఓడించి ప్రజాగొంతుకైన సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించిన నాంపల్లి, మర్రిగూడ మండలాల విస్తృతస్థాయి సమావేశానికి జూలకంటి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాల సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జూలకంటితో పాటు నల్లగొండ జిల్లా పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. నల్లధనం మొత్తం వెలికి తీసి ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామనే మోసపూరిత వాగ్దానాలతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం వాటిని మరిచి పేదలకు అన్యాయం చేశారన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి, నిత్యావసర ధరలను పెంచి, ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తూ పన్నుల రూపంలో ప్రజలపై ఆర్థిక భారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను అదానీ, అంబానీ లాంటి కంపెనీలకు చౌకగా అప్పగించిందన్నారు. దేశంలో కుల, మతం పేరిట విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలని చూస్తుందని అన్నారు.

దేశంలో ఇప్పటికే బీజేపేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను తమ పార్టీ వైపు తిప్పుకునే ప్రయత్నంలో లొంగని వారిపై కేంద్ర నిఘా సంస్థలను తమ జేబు సంస్థలుగా వాడుకొని కేసులు పెట్టి జైలుకు పంపి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని తెలిపారు. బీజేపీ నిరంకుశత్వాన్ని, నియంతృత్వ పోకడలను నిలువరించగలిగేది కేవలం కమ్యూనిస్టు పార్టీ లేనని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసేవరకు పోరాటం చేయడంలో కమ్యూనిస్టులదే ప్రముఖ పాత్ర అని గుర్తుచేశారు.

మర్రిగూడ, నాంపల్లి మండలాల తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కారం కావాలన్నా, కిష్టారాయనిపల్లి, శివన్న గూడెం ప్రాజెక్టులు త్వరగా పూర్తి కావాలన్నా, ఈ ప్రాంత సమస్యలు పరిష్కారం కావాలన్నా.. ప్రజల తరఫున మాట్లాడగలిగే సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్ ను గెలిపించాలని కోరారు.

సమావేశంలో మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నాంపల్లి మండల కమిటీ సభ్యులు వాసిపాక ముత్తిలింగం, కొమ్ము లక్ష్మయ్య, నాగభూషణ్, పల్లేటి వెంకటయ్య, ముఖేష్, వెంకటయ్య, సైదమ్మ, మర్రిగూడ మండల కమిటీ సభ్యులు నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య, మైల సత్తయ్య, చెల్లం ముత్యాలు, గిరి వెంకటయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు నిర్మించాలి

- ఇదే అంబేద్కర్‌కు అర్పించే నివాళి : జయంతి సభలో టి.సాగర్, ఆర్.వెంకట్రాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భూ సమస్య పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలను నిర్మించడమే డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు అర్పించే నిజమైన నివాళి అని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమిని జాతీయం చేసి పేదలకు పంచాలని చట్టసభల్లో డిమాండ్ చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు.దున్నేవానికి భూమి కావాలని పోరాడి ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచేటట్టు కమ్యూనిస్టులు పోరాడితే, నేడు ఆ భూములను ఢిల్లీలో మోడీ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో పేదల చేతుల్లోని భూములను లాక్కుంటున్నదని విమర్శించారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పునరావాస ప్యాకేజీ కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అంటరానితనం, కులవివక్ష, కులాంతర వివాహాలు చేసుకున్న జంటలపై దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్ల కోసం పోరాటాలు ఉధృతం చేయాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. ఆహార భద్రతా చట్టాన్ని మోడీ సర్కారు సరిగా అమలు చేయడం లేదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదనీ, ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యం సేకరణ చేయ కుండా ఆపేసిందని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న సామాజిక ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా బలమైన పోరాటాలను చేయడమే అంబేద్కర్‌కు అర్పించే నివాళి అన్నారు.

రాజ్యాం గం స్థానంలో కులవివక్ష, అంటరానితనం అసమానతలు కొనసాగించే మన ధర్మం శాస్త్రాన్ని తీసుకురావాలని చూస్తున్న మతోన్మాద బీజేపీ అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, బొప్పని పద్మ, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్, రాష్ట్ర నాయకులు కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మాదిగలు

సీఎంతో పార్టీ నేతల భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తమకు సీఎం రేవంత్‌రెడ్డిపై పూర్తి నమ్మకముందని మాదిగ సామాజిక తరగతికి చెందిన కాంగ్రెస్ నేతలు గజ్జెల కాంతం, పిడమర్తి రవి, ఊట్ల వరప్రసాద్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో వారు సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మాదిగలకు కాంగ్రెస్‌తోనే పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో వారికి వివిధ పదవుల్లో సముచిత స్థానాన్ని కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. రాజ్యసభ, శాసనమండలితోపాటు నామినేటెడ్ పోస్టుల్లో కచ్చితంగా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామంటూ పునరుద్ఘాటించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వర్గీకరణకు అనుకూలంగా బిల్లు తీసుకొస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా 17 నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తామన్నారు. మాదిగలను ఐక్యం చేసి పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 70 లక్షల మంది మాదిగలు మొదటి నుంచి కాంగ్రెస్ వైపే ఉన్నారనీ, భవిష్యత్తులో కూడా పార్టీతోనే ఉంటారని భరోసా ఇచ్చారు. బీజేపీ నుంచి దళితులకు పెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. మరో సారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయడంతోపాటు రిజర్వేషన్లను ఎత్తివేసే ప్రమాద ముందని ఆందోళన వ్యక్తం చేశారు. నిలువరిం చడం కోసం తెలంగాణలో మాదిగలను ఏకం చేసి కాంగ్రెస్ విజయం కోసం పని చేస్తామని వారు తెలిపారు.

గీతా కార్మికులకు

అండగా ఉంటాం

మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన తాటి, ఈత వనాలతో ఉపాధి కోల్పోయిన గీత కార్మికులకు అండగా ఉంటామని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివారులో ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన ఈత, తాటి వనాలను ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన ఘటన కారణాలపై గీతా కార్మికులతో మంత్రి మాట్లాడారు. ప్రమాదవశాత్తు జరిగిందా లేక కుట్రపూరితమా.. అనేది ఎక్సైజ్, పోలీస్ అధికారులు పరిశీలించాలని ఆదేశించారు.

భవిష్యత్‌లో ఈత, తాటి వనాల మొక్కల పెంపకంపై ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి ఉపాధి హామీ కింద చెట్లు పెంచే కార్యక్రమం, నీళ్లు పోసే కార్యక్రమం చేపడుతామని తెలిపారు. ప్రకృతి ద్వారా లభ్యమయ్యే తాటి కల్లు, ఈత కల్లు కల్తీ లేకుండా ఇచ్చినట్లయితే అందరి ఆరోగ్యానికి కూడా మంచిదన్నారు. కాలిపోయిన చెట్లపై అధికారులతో మాట్లాడి బాధితులకు సహకారం అందెలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే

భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

- చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటేనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం
- ప్రజల పక్షాన పోరాడే జహంగీర్‌ను గెలిపించండి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ-చౌటుప్పల్

దేశంలో మూడవసారి మోడీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుందని, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించి కమ్యూనిస్టులను కల్పించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆ పార్టీ మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారతదేశ పరిస్థితికి అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని తయారు చేస్తే, మోడీ పరిపాలనలో అడుగడుగునా రాజ్యాంగానికి తూట్లుపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటేనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని, పేద ప్రజలకు ఉపయోగపడే ఎన్నో చట్టాలను తయారు చేస్తారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే వచ్చింద న్నారు. బీజేపీ పరిపాలనలో ప్రతిపక్ష పార్టీలను తుడిచి పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సీబీఐ, ఈడీ, ఐటీ దాడులతో ప్రతిపక్ష పార్టీలను లొంగ దీసుకుంటున్నారని ఆరోపించారు. డబ్బు సంచులతో వచ్చే రాజకీయ పార్టీల నాయకులను తరిమి కొట్టి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే కమ్యూనిస్టు లను ఆదరించి భువనగిరి పార్లమెంటు సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించా లని ప్రజలను కోరారు. ఈనెల 19న భువనగిరిలో నామి నేషన్ కార్యక్రమం ఉందని, దీనికి పార్టీ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు, రైతులు, యువకులు, మహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనూరి నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, నాయకులు రాగిరు కృష్ణయ్య తడక మోహన్, ఎంపీటీసీ చెన్నబోయిన వెంకటేశం, చీరక సంజీవరెడ్డి, పల్లె మధు కృష్ణ, బొజ్జ బాలయ్య పాల్గొన్నారు.


భారతీయ ఆంగ్ల బాల సాహిత్యంలో
హైదరాబాదీ సంతకం



భారతీయ ఆంగ్ల బాల సాహిత్యమనగానే గుర్తొచ్చే పేర్లు రస్కిన్ బాండ్, పారో ఆనంద్, సుభద్రా సేన్‌గుప్తా, అరూప్ కుమార్ దత్తా, అనూ కుమార్ మన పిల్లల అభిమాన రచయితలు. ఆర్ కె నారాయణ్, రూపా పాయ్, సుధామూర్తి, అనుష్క రవిశంకర్, శోభా విశ్వనాథ్, కామాక్షి బాలసుబ్రహ్మణ్యం వంటి అనేక మంది దక్షణాది రచయితలు సైతం తారల్లా బాల సాహిత్యాకాశంలో వెలుగులు విరజిమ్ముతున్నారు. ఈ కోవలోనే దాక్షిణాత్య భారతీయ ఆంగ్ల బాల సాహిత్యకాశంలో కనిపించే గోల్కొండ మినార్ లాంటి బాల సాహితీవేత్త 'రమేంద్ర కుమార్'.

'రమేంద్ర కుమార్' భారతీయ ఆంగ్ల బాల సాహిత్యంలో పరిచయం అక్కరలేని పేరే కాదు, ఆంగ్ల బాల సాహిత్య చదువరులందరికీ బాగా తెలిసిన పేరు. అందులోనూ మన పిల్లలకు అతి దగ్గరైన పేరు. వివిధ ప్రచురణ సంస్థల ద్వారా దశాబ్దాల కాలంగా బాలల కోసం సృజన చేస్తున్న సృజనకారుడు. రవేంద్ర కుమార్ అచ్చంగా హైదరాబాదీ. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన రమేంద్ర కుమార్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, ఎంబిఎ చదివి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం చేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. మనకు తెలిసిన రచయిత రమేంద్ర కుమార్ వేరు... క్యాన్సర్ వారియర్‌గా దానిని జయించి నిలిచిన రమేంద్ర కుమార్ వేరు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ హిందీ ఆచార్యులు డా. ఆర్.కె. ఖండేల్‌వాల్, ప్రసిద్ధ హిందీ కథా, నవలా రచయిత్రి దీప్తి ఖండేల్‌వాల్ వీరి అమ్మానాన్నలు. ప్రస్తుతం విశ్రాంత, రచనా జీవితాన్ని గడుపుతున్న రమేంద్ర కుమార్ బెంగుళూరులో నివాసముంటున్నారు.

బాల సాహిత్యకారులుగా ప్రసిద్ధులైన రమేంద్ర కుమార్ అన్ని వయసుల వారికోసం రాశాడు. 'రమేన్'గా తెలిసిన రమేంద్ర కుమార్ వ్యంగ్య కవి, కథా రచయిత, బాల సాహితీవేత్త. 1997 నుండి బాలల కోసం రాస్తున్న రమేంద్ర కుమార్ రచనలను పెంగ్విన్, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, డబ్‌బిల్ హచెట్టి, చిల్డ్రన్ బుక్ ట్రస్ట్, ప్రథమ్, మహల్, వికాస్, రూపా & కో., నవ్‌నీత్, రోడోమేనియా వంటి అనేక ప్రసిద్ధ ప్రచురణ సంస్థలు ప్రచురించాయి. 'చికెన్ సూప్ ఫర్ ది సోల్' శీర్షికన వీరి రచనలు అచ్చయ్యాయి. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును, ప్రశంసలను పొందిన రమేంద్ర కుమార్ రచనలు ఐ.సి.ఎస్.ఈ, సి.బి.ఎస్.ఇ పుస్తకాల్లో పాఠాలుగా పొందుపరచబడ్డాయి. ఒక కథ జపాన్ సంప్రదాయ కథలు చెప్పే పద్ధతైన 'కమిషిబాయి'కి ఎంపికకావడం సాధారణమైన గుర్తింపేమీ కాదు. భారతదేశంలోని బోర్డుల్లోనే కాక విదేశాల్లోని పలు పాఠశాలల బోర్డుల్లో వీరి కథలుండడం విశేషం. బాలల కోసం తపస్సుగా రచనలు చేసే రమేంద్ర కుమార్ పిల్లల కోసం ముప్పై అయిదు పుస్తకాలు రాశారు. పదిహేను భాషల్లోకి అనువాదం కాగా, మరో పద్నాలుగు ఇతర భాషల్లోకి వెళ్ళాయి. రచయితగా వీరి తొలి పుస్తకం 'మోహిని' ఆవిష్కరణ జరిగిన వారం రోజుల్లోనే ప్రతులన్నీ అయిపోవడవం ఈ పుస్తకం విశేషం.



తొలి నాన్ ఫిక్షన్ 'ఎఫెక్టివ్ పేరెంటింగ్ : ఎ న్యూ పారాడిగమ్' అశేష పాఠకుల ఆదరణను పొందింది. రమేన్ యాత్రా చరిత్రకారులుగా కూడా బాగా పరిచితుడు.

ఆరు నుండి పది సంవత్సరాల పిల్లల కోసం రమేన్ రాసిన రచనలు ఆలోచనాత్మకాలుగానే కాక పిల్లలకు ఆనందాన్ని సైతం అందిస్తాయి. ఆ కోవలో నేషనల్ బుక్ ట్రస్ట్ కోసం రాసిన 'బూంద్', 'ది రాయల్ స్వీపర్', ఎ టేల్ ఆఫ్ టేల్స్' మొదలగు కథలను 'నీటిచుక్క'-'సేవకుడైన రాజు', 'తోకల కథ' పేర్లతో డా.పత్తిపాక మోహన్ తెలుగులోకి అనువాదం చేయగా 'ది కాక్టస్'ను 'నాగజెముడు'గా ఎం.నారాయణశర్మ అనువదించారు. మరో కథ 'బెటర్‌దెన్ ది బెస్ట్' కథ 'గురువును మించిన శిష్యుడు'గా తూఫ్రాన్ సంపత్ కుమార్ తెలుగు చేశారు. మరో మంచి కథ 'వి ఆర్ డిఫరెంట్'. దీనిని సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత చైతన్య పింగళి 'స్నేహబంధం'గా పిల్లల కోసం అదించింది. ఇంతకు ముందే చెప్పినట్టు రమేన్ కథలు పిల్లలను ఆకర్షించడమేకాక ఆనందపరుస్తాయి కూడా! 'తోకల కథ' వివిధ జంతువుల తోకల గురించిన చిన్న పుస్తకం. ఎలుక, పిల్లి మొదలు సమీపంలోని అన్ని జంతువుల తోకల గురించి ఇందులో మనం చదవచ్చు. ఒక సాధారణ అంశాన్ని ఎంత సులభంగా చెప్పొచ్చో రమేంద్రకు తెలిసినంతగా ఇతరులకు తెలియదని చెప్పొచ్చు. బూంద్ అటువంటి కథే. చైతన్య అనువాదం చేసిన 'వి ఆర్ డిఫరెంట్' పిల్లలందరూ చదవాల్సిన కథ. ఒక అడవిలో ఒక కుందేలు, ఒంటె నేస్తాలు. కొంత కాలం తర్వాత మరో కుందేలు ఆ అడవికి వస్తుంది. కుందేలు, ఒంటెల మధ్య స్నేహం ఏమిటని, రెండింటి జాతులు వేరువేరని విడదీసే ప్రయత్నం చేస్తుంది. అయితే కుందేలు, ఒంటెల మధ్య ఎలా స్నేహబంధం గట్టిగా నిలిచిపోయిందో ఈ కథ చక్కగా చెబుతుంది.

హాస్య కథలు, జానపద కథలు, ఫాంటసీలు, వాస్తవ సంఘటనల కథా రూపాలు, ఆటల కథలు, హర్రర్ కథలు, జీవిత చరిత్రలు మొదలుకుని ఫోక్సో చట్టం, జువైనల్ యాక్ట్ ఆధారంగా గ్రాఫిక్ కథలు, ఇతర రచనలు, నవలను సైతం రాశారు రమేంద్ర కుమార్. రమేంద్ర కుమార్ రచనలన్నీ కేవలం బాలల బాధలు, సమస్యలను ఏకరువు పెట్టి ఊరుకోవు. రచనలన్నీ పరిపూర్ణమైన వికాసం, ఆనందాల గురించి చర్చిస్తాయి, దారి చూపిస్తాయి, ఆలోచింపజేస్తాయి. అంతేకాదు, తన రచనలను కేవలం బోధనలుగా, నీతుల గీతలుగా ఎప్పుడూ మలచలేదు రమేన్. ఒక్కో రచన ఒక్కో అంశాన్ని, లేదా సంఘటనను మన కళ్ళ ముందు ఉంచుతుంది. అనేక రచనల్లో వివిధ అంశాలు రమేన్ స్పృశించినప్పటికీ ఆనందం, వినోదం, హాస్యం పిల్లలకు ప్రధానమని నమ్మి రచనలు చేశారు. వీరి రచనలన్నీ అత్యంత ఆదరణ పోందడమే కాక కొన్ని రచనలు ఐదారు లక్షల ప్రతులకుపైగా అమ్ముడుపోవడం ఆయన రచనల పట్లగల ఆకర్షణన, ఆదరణను తెలుపుతోంది.

'జస్ట్ ఎ సెకండ్ అండ్ అథర్ స్టోరీస్' 1997లో అచ్చయ్యింది. 'ద మ్యాసిక్ పిల్స్ అండ్ అథర్ స్టోరీస్', 'ద విల్ టూ విన్' సంపుటాలను వికాస్ ప్రచురించింది. ఇంకా 'ది మ్యాడ్ సైంటిస్ట్ అండ్ అథర్ స్టోరీస్', 'చెక్ అండ్ మేట్ అండ్ అథర్ స్టోరీస్', 'ది మిరాకిల్ పార్క్' పుస్తకాలు ఎక్కువగా ఖ్యాతి గాంచిన రచనల్లో కొన్ని. ఇవేకాక 'ది బ్రేవ్ ఫ్రెండ్స్ అండ్ అదర్ స్టోరీస్, టెర్రర్ ఇన్ ఫన్నీ సిటి, నౌ ఆర్ నెవర్, బ్రేవ్ నిర్మల్, మోహినీ, ది పర్‌ఫెక్ట్ మ్యాచ్, ఎ సునామి కాల్డ్ నాని' వంటి పుస్తకాలు రచయితగానే కాక వ్యక్తిత్వ వికాస నిపుణులుగా మనకు కనిపిస్తారు. జువైనల్ ఆక్ట్ నేపథ్యంలో వ్రాసిన పుస్తకం 'జువైనల్ జస్టిస్ ఆక్ట్' గ్రాఫిక్ పుస్తకం 2010లో ఢిల్లీకి చెందిన బట్టర్‌ఫ్లై తీసుకువచ్చిది. వీళ్ళకోసం రాసిన మరో అవగాహన రచనా 'వాట్, వై అండ్ హౌ – ఎ గ్రాఫిక్ బుక్ ఆన్ డయాబిటిస్'.

రచయితగా రమేంద్ర కుమార్ దేశ విదేశాలలో జరిగిన అనేక జాతీయ అంతార్జాతీయ సదస్సుల్లో, సమావేశాల్లో పాల్గొన్నారు. వాటిలో షార్జా చిల్డ్రన్స్ రీడింగ్ ఫెస్టివల్, జైపూర్ లిటరరీ ఫెస్టివల్, హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్, భువనేశ్వర్ ఫెస్టివల్ ఆఫ్ స్టోరీటెల్లింగ్, చండీగర్ చిల్డ్రన్స్ లిటరరీ ఫెస్టివల్ మొదలైనవి ఉన్నాయి. ఇవేకాక సాహిత్య అకాడమి, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యునివర్సిటి వంటి జాతీయ సంస్థల కార్యశాలలు, సదస్సులోనూ పత్రసమర్పణ చేశారు. 2008లో డెన్మార్క్‌లో జరిగిన 31వ ప్రపంచ ప్రచురణ కర్తల ఐ.బి.బి.వై వరల్డ్ కాంగ్రెస్‌లో పాల్గొని రెండు సదస్సులకు అధ్యక్షత వహించారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి, రమేన్ రచన నార్వే దేశపు తొమ్మిదవ గ్రేడ్ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపికైంది. మన దేశంలోనూ వీరి రచనలు ఆరింటిని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వివిధ స్థాయిల్లో పాఠ్యాంశాలుగా ఎంపికచేసింది. రమేన్ రీడ్ ఎలౌడ్ పుస్తకం 'పప్పూ ది జెయింట్'కు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా అరుదైన గౌరవం లభించింది. సెప్టెంబర్ 7, 2013న ఈ కథ భారతదేశంతో పాటు పలు విదేశాల్లో 22 భాషల్లో, 27 రాష్ట్రాల్లో కథ చెప్పడంలో భాగంగా నిలిచింది.

రచయితగా పలు సత్కారాలు, గౌరవాలు అందుకున్న రమేంద్ర కుమార్ 2016లో చిల్డ్రన్స్ బుక్ ట్రస్ట్ నిర్వహించిన పోటీలో బహుమతిని గెలుచుకున్నాడు. అంతేకాదు, 2027లో శ్రీలంకలో జరిగిన రచయితలు, ప్రచురణకర్తల సదస్సులో బాల సాహిత్య రచన, సేవలకు గుర్తింపుగా విశేష గౌరవ సత్కారం అందుకున్నారు. మార్చి 2020లో పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారి 'హాల్ ఆఫ్ ఫేమ్' సత్కారాన్ని అందుకున్నారు. 2022 సంవత్సరానికి గాను లండన్‌లోని 'టాకింగ్ స్టోరీస్' రమేంద్ర కుమార్‌ను 'ఆథర్ ఆంట్ స్టోరీ టెల్లర్ ఆఫ్ ద ఇయర్'గా గౌరవించి సత్కరించింది. ఈ సందర్భంగా ఇవాళ్ల బెంగుళూరులో దక్షిణాత్య ఆంగ్ల బాల సాహిత్యకారుడు, 'రమేన్' సాహిత్యంపైన 'రమేంద్ర కుమార్స్ యునిక్ చిల్డ్రన్స్ వరల్డ్' పేర సదస్సు జరుగుతున్న నేపథ్యంలో ఆంగ్ల బాల సాహిత్యంలో అచ్చమైన హైదరాబాదీ సంతకానికి దిల్‌సే ముబార్‌బాద్!



- డా॥ పత్తిపాక మోహన్
9966229548

> **తన రచనలను కేవలం బోధనలుగా, నీతుల గీతలుగా ఎప్పుడూ మలచలేదు రమేన్. ఒక్కో రచన ఒక్కో అంశాన్ని, లేదా సంఘటనను మన కళ్ళ ముందు ఉంచుతుంది. అనేక రచనల్లో వివిధ అంశాలు రమేన్ స్పృశించినప్పటికీ ఆనందం, వినోదం, హాస్యం పిల్లలకు ప్రధానమని నమ్మి రచనలు చేశారు. వీరి రచనలన్నీ అత్యంత ఆదరణ పోందడమే కాక కొన్ని రచనలు ఐదారు లక్షల ప్రతులకుపైగా అమ్ముడుపోవడం ఆయన రచనల పట్లగల ఆకర్షణన, ఆదరణను తెలుపుతోంది.**

పెద్ద సమయం పట్టదు

అంతా కనిపిస్తూనే వుంటారు అందరూ వినిపిస్తూనే వుంటారు
కానీ.. కలిసివుండటానికీ కలిసిపోవడానికీ అందరినడుమా అడ్డంగా
కళ్ళముందే మొలుస్తున్న గోడలు
ఎవరికి వారు నిర్మించుకుంటున్న దడీలు
భ్రమాలోకపు గడీలు తవ్వి తలకెత్తుకుంటున్న కందకాలు
చుట్టూరా ఖాళీలు కొలతలకందని దూరాలు
ఎవరి లెక్క వారిది ఎవరి కుహరం వాళ్ళది
నేనే.. ఇన్నాళ్లూ ఇన్నేళ్లూ కాళ్ళరిగేలా కలియదిరిగాను
ప్రవాహంలా పరుగులుపెట్టాను ప్రయాణ కాలంలో అనేక దశలు దిశలు
అలసట వొచ్చినప్పుడల్లా 'అల్లమురబ్బా' నోట్లో వేసుకుని
పైత్యాన్ని వదిలించుకున్నాను
ఇవ్వాళ ఖాళీల్ని పూరించడానికి మౌనాన్ని శబ్దమయం చేయడానికి
కొత్త పదాల్ని పదబంధాల్నీ నేర్చుకుంటున్నాను
బంధాలకు కొత్త రూపునూ అనుబంధాలకు నవ్యదారుల్నీ రూపొందిస్తున్నాను
మబ్బుల అంతరాయాల్ని తొలగిస్తూ అస్తమయం కానీ జీవితాన్ని అవలోకిస్తూ
మనుషుల సమూహంలోకి మమతల జాతరలోకి
నడక సాగిస్తున్నాను
అస్తమయం తర్వాత సూర్యోదయానికి పెద్ద సమయం పట్టదు
కొంచెం ఓపికుండాలి ఒకింత విశ్వాసముండాలి
ఎంతయినా అందరమూ మనుషులమే కదా!

- వారాల ఆనంద్, 9440501281

ఆత్మీయ సభ

ప్రముఖ కవి, రచయిత బుర్రా లక్ష్మీనారాయణ సంస్మరణార్థం ఆత్మీయ సభ ఏప్రిల్ 15న తేదీ సాయంత్రం 6.00 గంటలకు సుందరయ్య కళా నిలయంలోని షోయబ్ హాల్‌లో జరుగుతుంది. ఈ సభలో డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్, కె.వి.ఎస్. వర్మ, ఏనుగు నరసింహారెడ్డి, ఎం. నారాయణశర్మ, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, గుడిపాటి ప్రసంగిస్తారు.

'అనుమంద్రం' ఆవిష్కరణ సభ

రాళ్లబండి శశిశ్రీ కవితాసంపుటి 'అనుమంద్రం' ఆవిష్కరణ సభ ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి తల్లావజ్ఝల శివాజీ, కవి యాకూబ్, అనిల్ డ్యాని, మామిడి హరికృష్ణ, అంబటి సురేంద్రరాజు, ఘంటశాల నిర్మల, కవివాగ్గేయ సిద్ధార్థ, సత్యవాణి హాజరవుతారు.

'హోరుగాలి' పుస్తకావిష్కరణ

కె.శాంతారావు 'హోరుగాలి' పుస్తకావిష్కరణ ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞానకేంద్రం, బాగ్‌లింగంపల్లిలో జరుగుతుంది. ఈ సభలో కె.ఆనందాచారి, నిఖిలేశ్వర్, ఎన్.వేణుగోపాల్, ఆర్.సుధాభాస్కర్, కె.శాంతారావు పాల్గొంటారు.

డా॥ ఏనుగు నరసింహా రెడ్డి సాహిత్యంపై సమాలోచన

ఈనెల14 న నల్లగొండలోని NG కళాశాలలో డా॥ ఏనుగు నరసింహా రెడ్డి సాహిత్యంపై సమాలోచన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. మూడు సెషన్లుగా జరిగే ఈ సభలో 'తెరిపిలేని వాన' వ్యాస సంకలన పుస్తకావిష్కరణ, 'ఏనుగు నరసింహారెడ్డి కవిత్వానుశీలనం, ఏనుగు నరసింహా రెడ్డి అనువాదాలు – పరిశీలన, 'ఏనుగు నరసింహారెడ్డి విమర్శ దృక్పథం' అనే అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయి. వక్తలుగా డా.పోరెడ్డి రంగయ్య, ఎలికట్టె శంకర్‌రావు, గుడిపాటి, డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా. యం.పురుషోత్తమాచార్య, డా.ఎస్. రఘు, మేరెడ్డి యాదగిరి రెడ్డి, డా.తండు కృష్ణ కౌండిన్య పాల్గొంటారు.


సృజన సాహితి – నల్లగొండ

అస్తిత్వం తాత్వికతల జమిలీగానం

"మనిషోకపద్యం" అంటూ గతంలో కవిత్వ పాఠకుల్ని అలరించిన మెట్టా నాగేశ్వరరావు ఇప్పుడు మరోసారి నిలువెల్లా మనిషైన పద్యాన్ని 'నేను కొన్ని సూఫీ సమయాలు' అంటూ మనల్ని పలకరించడానికి ముందుకొచ్చాడు. అయితే ఈ కవి ఎక్కడా ఆగలేదు. ఆగడానికి ఇతను నిలువ నీరు కాదు. ఊటబావి. నీటి బుగ్గ. ప్రకృతిలో ఉన్న ప్రతి అణువు ఈ కవికి సిలబస్. ఈ కవి వాక్యాలు ప్రకృతి చుట్టే వలయాలు వలయాలుగా పరిభ్రమిస్తున్నాయి. తాను చూసిన జీవితాల నుండి తాత్వికతను వడకట్టాడు. కవిత్వానికి తాత్వికతను అద్దడం కొత్తేమి కాదు. ఆ తాత్వికతను ప్రకటించడంలో కవి చూపిన సృజన ఏమిటీ? వాటికి అతను ఇస్తున్న ఆకరాలు ఏమిటి? అనేది ఈ కవితా సంపుటిని నిలబెడుతుంది.

"నేను సూఫీనవుతున్నాను/ హృదయాన్ని కన్నులుగా చూస్తున్నాను/ భ్రమలెప్పుడూ నా దృశ్యాలు కావడం లేదు/ నేను నిశ్చింతగా సాగిపోతున్నాను/ లోకం జోలెలోకి నన్ను/ దుఃఖం కాల్చని ఉపాయంగా ఇస్తున్నాను"... ఇక్కడ సాక్ష్యంగా ఉన్న ఈ ఆరు వాక్యాలు, ఈ కవి చూస్తున్న మనకు చూపుతున్న, వాగ్దానం చేస్తున్న తన ప్రస్తుత స్థానం. అయితే ఇలాంటి స్ఫూర్తిని అతను ఎక్కడి నుంచి పొంది ఉంటాడు? అనే ప్రశ్న వేసుకుంటే ఎప్పుడూ ప్రయాణించమని చెప్పే నది, ఆకలి తీర్చుకోవడానికి గూడు వదిలి భూగోళాన్ని గాల్లోనుండి అన్వేషించే పక్షి, సముద్రాల్లో విశ్రాంత గదుల్లేని చేప, కన్నీటి యుద్ధంలో గెలిచే ఉపాయం చెప్పే ఒక వాక్యం, ఎప్పుడు ముగిసిపోని ప్రయాణం చేసే జీవితం ఇతరుల గుండెల్లో నిలిపిన జ్ఞాపకాలు ఇవ్వన్నీ ఈ కవికి స్ఫూర్తి.

నీడ బొమ్మల్లో తోలుబొమ్మలాట చూడటం, చెట్టు బొమ్మ గీస్తున్నప్పుడు నీడ చిత్రం గీయడం, ఎవరి నీడ వారికే ఉండాలని, ఒకరి నీడలా మనం మారకూడదని, ఒరిజినాలిటీ అంటే మన నీడను మనమే అణువణువు పూరించుకోవాలని నీడ తాత్వికతను తెలిపాడు. కవికి దర్శనం ఒకటి ఉంటుంది. "మెట్టా"లో దర్శన సౌభాగ్యం బాగుంది. మనం రోజు చూసే వస్తువులు, లేదా అంతకుముందే కవిత్వం అయినా వస్తువుల గురించి మెట్ట కొన్ని కవితలు రాశాడు. అయినప్పటికీ దర్శనంలో ఉన్న విభిన్నత కారణంగా అవి కొత్తగా ఉన్నాయి. ఈ దర్శనం కేవలం ప్రదర్శనమైతే కవిత కూలిపోతుంది. ఆ దర్శన గుణం ఈ కవిలో అడుగడుగునా మనల్ని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. 'రాళ్లు' శీర్షికతో రాసిన కవిత ఇందుకు చక్కని ఉదాహరణ. అసలు నాగరికత మొదలైంది రాయి రాయి రాసుకున్నప్పుడే అని మొదలుపెడతాడు. రాతి గుహలోనే కళలకు ప్రసవం జరిగిందని అంటాడు. అలా మొదలైన రాళ్లు అనే కవిత జీవితంలోని అనేక పార్శ్వాలను తడుముతుంది. చీమలు, గాయం చుట్టూ, మార్మికం ఇలా అనేక కవితల్లో కవి చేసిన దర్శనం మనకు కొత్తగా అనిపిస్తుంది. సాధారణవైపు నుంచి కాక అసాధారణ వైపుగా కవితల్ని నిర్వహిస్తున్నాడు.



అకారణంగా అనవసరంగా జైలు శిక్ష అనుభవిస్తున్న మానవ హక్కుల కార్యకర్తల గురించి, అక్రమ అరెస్టుల నేపథ్యంలో రాసిన కవిత జైలుగీతం. అయితే ఎక్కడాఎవరు పేర్లు ఉండవు. కానీ కవిత చదువుతున్నంతసేపు వాళ్లే మనకు గుర్తుకొస్తుంటారు. దోషులందరూ జైల్లోనే ఉండాలని, అలా అయితే లోకమే పెద్దజైలని, ఎందుకంటే దోషులు ఎక్కువగా బయటే ఉన్నారని అంటాడు.


"కేదీలకు బేడీలు వేయాల్సి వస్తే ,ఆత్మను మోసగించుకునే ప్రతొకడూ కేదీనే/ వాళ్ళ కారాగారం పేరు పశ్చాత్తాపమే/ కాల సాక్ష్యాన్ని ఎవరు చెరిపేయగలరు/ చట్టాల ముందు కన్నా ఒక్క కాలం ముందు/ దొంగలందరూ దొంగలే నేరగాళ్లందరూ నేరగాళ్లే" అనడం ద్వారా పాలకులు, అధికారులు లోపలకి చూసుకోవాల్సిన అవసరం గురించి చెప్పాడు. బహుజన జీవితాలను, బహుళ తాత్విక దృక్పథాన్ని కవి ఆవిష్కరించడం ఇందులో మరో కోణంగా కనిపిస్తుంది. పల్లె జీవితం తెలిసినవాడు. బహుజన బతుకుల్లో మెలిగినవాడు, స్వయంగా వృత్తి అనుభవాలు, వ్యథలు వున్నవాడు. బహుజన కులాల సంగమాన్ని కోరుకుంటున్నాడు. రాజ్యాధికారం వైపు బహుజనుల్ని అప్డేట్ కమ్మని పిలుపునిస్తున్నాడు. మనకు బాగా తెలిసిన పదాల్లోని ఒక్క అక్షరాన్ని తీసేసి, మరో కొత్త అక్షరాన్ని పెట్టడం ద్వారా ఓ కొత్త అర్థాన్ని స్ఫురింప చేసే టెక్నిక్ కూడా ఇతనిలో బలంగా ఉంది. అలాంటిదే బతుకమ్మల్ని ఉతుకమ్మలు చేయడం. తన సొంత జీవిత సౌందర్యాన్ని అద్భుతంగా చిత్రీకరించిన కవిత ఉతుకమ్మలు.

కుమ్మరి కుంటలోనుంచీ, గీత కత్తి చివర్ల నుంచి, ఉప్పరి గోతుల నుంచి, కంసాలి కుంపటి వెలుగుల నుంచి, చిత్రిక పట్టే వడ్రంగి చేతుల నుంచి, వాక్యాలను తెచ్చుకొని ఊరు ఊరంతా బహుజనల పునాది మీద నిలబడిన నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటాడు. పొట్టకూటికి కూడా మిగలరని వృత్తులన్నీ ఏకమై **"ఒకరు ఒకరుగా మిగిలిపోవడమే తీసివేత/ఒకరు ఇంకొకరుగా మారిపోవడమే కూడిక"** అంటూ బహు జనాన్ని ఏకమవుదామంటున్నాడు. శ్రమ పాటల్లో ఉండే చెమట చరణాలను చెవి ఒగ్గి వినలంటాడు. యుద్ధాల గురించి చెబుతూ అక్కడ కూడా బహుజన పనిముట్లను చక్కగా వాడుకున్నాడు. ముగింపు వాక్యాలలో... **"రక్త సముద్రంలో దొరికిన అమృతం/ కళింగ ప్రదేశం/ అక్కడ ఖడ్గాల్లోంచి కరుణపుట్టింది/ అక్కడ పనిముట్టు/ హృదయాన్ని కొత్తవేకువగా మార్చేసింది/ నాకు దొరికిన పనిముట్టు కలం/ దాంతో నేను నిత్యం/ ప్రేమ మనిషి బొమ్మ చెక్కుతున్నాను"** అనడం ద్వారా తన మార్గమేంటో కవి తెలుపుతున్నాడు. జీవితం జీవిస్తున్న వాళ్ల జీవితం మీద ప్రేమ ఉన్న వాళ్ళు మాత్రమే ఇలాంటి వాక్యాలు ఇవ్వగలరు.

"జీవిత సంద్రపు అల్లకల్లోలంలోంచి/ భద్రంగా ఆవల తీరానికి చేర్చే లైట్ హౌస్/ ఎప్పుడూ, ఎప్పటికీ కవిత్వమే/ సమాధి అయిన తర్వాత/ జీవితాన్ని హైకు సీతాకోకచిలుకలై/ ఈ నేలకు వినిపించేది కవిత్వమే"... కవిత్వాన్ని ఆరని దీపంగా భావిస్తూ, నిత్యం కవితమై మనల్ని పలకరించే మెట్టా 24 గంటలు కవిత్వంగా బతుకుతున్నాడు. మనిషిని ప్రకృతికమంటున్నాడు. మనిషిని పసిబిడ్డ కావాలంటున్నాడు. మనిషిలో ఉన్న సాంస్కృతిక సమైక్యతను కోరుకుంటున్నాడు. మనిషి ఒక నిరాడంబర జీవితం గడుపుతూ, జీవిత రహస్యాలను తెలుసుకుంటూ ఆనందంగా బతకాలని, ఆత్మను శుభ్రం చేసుకోవాల్సిన అవసరాన్ని గురించి సూఫీగా పాడుతున్నాడు. విశాలమైన ఛాతీతో తలెత్తుకునే విశ్వమానవుణ్ణి స్వప్నిస్తున్నాడు.

"ఎవరి అస్తిత్వాన్ని వాళ్లే బలంగా నోళ్లెత్తుతారు/ కండగలిగిన వారందరూ యుద్ధం చేయలేరు/ చీమలు కూడా ఒకసారి వాటి కొండేల మీద నిలబడి/ విజయదుందుభి మోగించగలవు".

చీకటి పూట చీకటేకాదు పాలపుంతలు ఉంటాయి. ఇలాంటి వాక్యాలు అతను జీవితాన్ని ఎలా చూస్తున్నాడో, మనము ఎలా చూడాలో తెలుపుతాయి. స్త్రీనాన్న, వాగు, తెల్లంగీ మా కల, యుద్ధమూ–పిల్లలు చాలా మంచి కవితలు. మెట్టా వాక్యం సాధారణంగా ఉంటూనే మెలిపెడుతుంది. ఇప్పుడు తాత్వికత కూడా యాడ్ ఐయింది. నేను కొన్ని సూఫీ సమయాలు, తన గత కవిత సంపుటికన్నా పరిణితితో సాగింది. ఊహలు బాగున్నాయి. మెట్టా ఒక కవిత్వపు చలివేంద్రం. అయితే ప్రతి విషయాన్ని కవిత్వం చేయడంలో కూడా కొంత తడబాటు ఉంటుంది. తన కవిత ద్వారా తనకు తెలిసిన విషయం అంతా చెప్పేయాలని తపన కూడా ఉంది. మూడు నాలుగు వాక్యాలతో రాసిన చిట్టికవనాలు, పాపాయి లోకాలు, ప్రపంచకాలు ఇవి కూడా కవితా సంపుటి స్థాయిని పెంచాయి. సాంద్రవాక్యాలు, మనసుపెట్టెలో దాచుకోదగ్గ వాక్యాలున్నాయి. ఇప్పుడు మెట్టా సూఫీ సమయాలు, నా కవిత్వసమయాలుగా మారిపోయాయి. విశ్వమంత కవికన్ను మెట్టాకు నిండుగా అభినందనలు.



- డా॥ సుంకర గోపాల్,
9492638547

క్షుద్బాధ



వర్తమాన చరిత్ర అంచులపై
వికటాట్టహాసం చేస్తున్న మతోన్మాదం
అంతర్గత ద్వేషంతో అధికార క్రౌర్యం
మృత్యు భేరీలు మోగిస్తుంటే
ఆశల్ని ఆకాంక్షల్ని కర్కశంగా
నేల రాస్తూ రక్త చరిత్రను
లిఖిస్తున్న యుద్ధోన్మాదం
బతుకే నరకమై క్షణమొక యుగమై
గుండెల్ని మెలిపెట్టే దుర్భర వేదన
సాయుధ ఘర్షణల నరమేధానికి
గాలిలో దీపమైన ప్రాణాలు
కుటిల నాయకత్వం అగ్గిని రాజేస్తూ
పంతాల పట్టింపుల్లో విశ్రమించని
మతోన్మాద అస్తిత్వ నిరూపణకు
రోజుకో ఆత్మఘోష
నిప్పుల గుండంలో దేశాల దాడుల ధమనకాండకు
ఆకలిమంటల చితిమంటలు యుద్ధ జ్వాలలై
ఎగుస్తుంటే
నిర్వాసితులై నిస్సహాయులుగా
ఆకులు తిని కడుపు నింపుకుంటున్న దైన్యం
క్షుద్బాధను తట్టుకోలేని నడిచే
జీవచ్ఛాలైన వృద్ధులు
ముక్కు పచ్చలారని పసిపిల్లల
హాహాకారాల ఆర్త నాదాలు
మూగజీవుల మూగరోధనలతో
పోరాడుతున్న జీవనకాంక్షలు
దారుణ దృశ్యాల్ని ఘోషిస్తుంటే
మృత్యు ఘాతంలో పీనుగుల కుప్పలు
ఓ కాలమా ఈ యుద్ధం
ఆత్మహననమా విస్తాపితమా జాతిహననమా
భవిష్యత్ పురోగమనానికి దారేది
మృత్యు భేరీలు మోగిస్తున్న
రాజ్య కాంక్ష ఇప్పట్లో చల్లారేనా
విశ్వ మానవాళి హితవును కాంక్షించి
యుద్ధం విరమించి
సుస్థిర శాంతి సౌభాగ్యాలకు బాటలు వేసేనా

- సునీత నెల్లుట్ల, 7989460657

హెూటళ్లు, లాడ్జీలలో పోలీసుల విస్తృత తనిఖీలు

నవతెలంగాణ- ఖమ్మం

పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఖమ్మం హెూటళ్ళు, లాడ్జీల్లో తనిఖీలు చేపడు తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఎన్నికల ముందు తీసుకునే చర్యల్లో భాగంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. ఇందులో భాగంగా ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని అన్ని హెూటళ్లు, లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులు, సరైన పత్రాలు లేకుండా బస చేసే వారిని గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. హెూటళ్లు, లాడ్జీలు బస చేసే వ్యక్తులు, ఆధార్ కార్డులు , ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్ నిర్వహించాలని హెూటల్, లాడ్జీలు యాజమానులకు సూచించారు. రిసెప్షన్, వెలుపలి ప్రాంతంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మైనర్లకు గదులు ఇవ్వకూడదన్నారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వవద్దని, అనుమానితుల వివరాలను వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

కుల బహిష్కరణ చేశారని మహిళా ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

తమను కుల బహిష్కరణ చేశారని మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మండల పరిధిలోని నాయుడుపేటలో ఆదివారం చోటు చేసుకుంది.రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కుటుంబ పంచాయతీ విషయంలో నాయుడుపేట గ్రామానికి చెందిన చెరుకూరి మరియమ్మతో పాటు మరో ఆరు కుటుంబాల వారితో ఎవరూ మట్లాడవద్దని కుల పెద్దలు తీర్మానం చేశారు.దీనిపై ఇటీవల బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కుల పెద్దలకు కౌన్సిలింగ్ కూడా నిర్వహించారు. ఆదివారం మరియమ్మ చర్చికి వెళ్తున్న క్రమంలో ఇంటి చుట్టూ పక్కల వారిని పిలిచింది. దీనికి వారు మీతో మేము మాట్లాడవద్దని మా కుల పెద్దలు చెప్పారని వివరించారు.దీంతో మనస్తాపం చెందిన మరియమ్మ ఇంటికి వెళ్లి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు.మరియమ్మ భర్త ఉమేశ్ ఫిర్యాదు మేరకు కుల పెద్దలు రాధాకృష్ణ, అబ్రహం, వెంకటేశ్వర్లు, సురేశ్, ఇజ్రాయిల్, రాజాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామరావు తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తం

- హింస మంచిదికాదు..
- జగన్‌పై దాడిని ఖండిస్తున్నాం
- అంబేద్కర్ ఆలోచనా మార్గంలో మనందరం నడవాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ- ఖమ్మం

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థను చిన్నాభిన్నం చేశారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆదివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (సంజీవరెడ్డి భవన్)లో అంబేద్కర్ జయంతి సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావేద్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన అందిస్తోందన్నారు. అప్పులతో కూడిన రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పాలకులు తమ చేతికిచ్చినప్పటికీ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతున్నామన్నారు. ట్టామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు తలెత్తుకొని ఆత్మగౌరవంతో బతికే విధంగా అంబేద్కర్ స్ఫూర్తితో ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ మూడు నెలల ప్రజాపాలనపై, గత బీఆర్ఎస్ పరిపాలన చేసిన పదేళ్ల పాలనపై చర్చకు తాను సిద్ధమని, మరి బీఆర్ఎస్ నాయకులు సిద్ధమా అని సవాల్ విసిరారు. పది సంవత్సరాల పాలనలో బిఆర్ఎస్ పాలకులు చేసిన తప్పిదాలను అవినీతి అక్రమాలను తప్పకుండా బయటకు తీస్తామని హెచ్చరించారు.

హింస మంచిది కాదు

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై శనివారం రాత్రి జరిగిన దాడి ఘటనపై భట్టి విక్రమార్క స్పందించారు. హింసతో కూడిన కార్యక్రమాలు మంచిది కాదన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఇలాంటి ఘటనలను ఎవరూ సమర్థించరని అన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్, నగర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, రాష్ట్ర ఓబిసి సెల్ నాయకులు వడ్డేబోయిన నరసింహారావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్, ఓబిసి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాల గంగాధర్ తిలక్, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వర్లు, సైదులు నాయక్, రాపర్తి శరత్, మిక్కిలినేని నరేందర్, బొజెడ్ల సత్యనారాయణ, వెనిగండ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయాలి

- అదే అంబేడ్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి
- రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా





నవతెలంగాణ-ఖమ్మం

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య భవనంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సభలో నున్నా నాగేశ్వరరావు మాట్లడుతూ అంబెద్కర్ సమసమాజం కోసం ఉద్యమించారని, భారత జాతి గర్వించదగ్గ మేధావి, భారత రాజ్యాంగాన్ని రాసి, జాతి ప్రజలకు అంకితం చేసిన మహెూన్నత వ్యక్తి అని కొనియాడారు. అంబేద్కర్ జయంతిని పురస్కరిం చుకొని, బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం 10 ఏళ్లుగా దేశంలో అరాచక పాలన చేస్తూ, దేశాన్ని విధ్వంసం చేసే విధంగా సంస్కరణలు చేస్తున్నారని, మరో దఫా అధికారంలోకి రావడానికి కులాల పేరిట, మతాల పేరిట చిచ్చులు పెడుతూ, దేశభక్తి పేరుతో యువతను పెడదోవ పట్టించే విధంగా పాకిస్తాన్, చైనా బూచి చూపి ఉద్వేగాలు రెచ్చగొడుతూ ఓట్లు దండుకునే కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. అసలు దేశ స్వాతంత్రోద్యమంతో ఎలాంటి సంబంధం లేని ఆర్ఎస్ఎస్, బీజేపీ నేడు సినిమా రంగాన్ని తమ చేతుల్లోకి తీసుకొని అబద్ధపు కథలతో సినిమాలు తీసి, అదే నిజమైన చరిత్రగా, బ్రిటీష్ వారి బూట్లు తుడిచిన వారిని దేశభక్తులుగా చూపెడుతూ ప్రజల్ని పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. దేశంలో మోడీ, షా సాగిస్తున్న అరాచక పాలనకు వ్యతిరేకంగా అంబేద్కర్ స్ఫూర్తితో ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎర్ర శ్రీకాంత్, పిన్నింటి రమ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, ఎస్‌కె బషీరుద్దీన్, ఎం.సుబ్బారావు, టియల్.నర్సయ్య, మల్లెంపాటి వీరభద్రరావు, బండారు రమేష్, రఫీ, బోడపట్ల రవీందర్, శివన్నారాయణ, మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, నాదెండ్ల శ్రీనివాస్, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, మాచర్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం : కుల నిర్మూలన ఉద్యమాలే అంబేద్కర్‌కు నివాళులని సామాజిక, ప్రజా సంఘాల నేతలు నందిపాటి మనోహర్, భూక్య వీరభద్రం అన్నారు. ఆదివారం సుందరయ్య భవనం నుండి జడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు సామాజిక సంఘాల ఆధ్వర్యంలో సామాజిక చైతన్య బైక్ ర్యాలీ, జన జాతర, ఆటా పాటా, దూం..దాంలతో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ అద్యక్షతన జరిగిన జన జాతర సభలో సామాజిక, ప్రజా సంఘాల జిల్లా నాయకులు భూక్య వీరభద్రం (గిరిజన సంఘం), మాచర్ల భారతి (ఐద్వా), మెరుగు సత్యనారాయణ(వ్యకాస), ముత్తమాల ప్రసాద్ (కెవిపిఎస్) ఎస్.కె. బషీర్ (డివైఎఫ్ఐ), టి.ప్రవీణ్ (ఎస్ఎఫ్ఐ)లు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, పి.సంగయ్య, సిఐటియు నాయకులు ఎస్.నవీన్ రెడ్డి, రమ్య, బండారు రమేష్, విప్లవ కుమార్, ఐద్వా నాయకులు భాగం అజిత, బేగం, కేవీపీఎస్ నాయకులు పాపిట్ల సత్యనారాయణ, బోట్ల సాగర్, నాకిరకంటి చిరంజీవి, ఎస్ కె సైదులు, సిద్దేల రాజు, కిరణ్, గుమ్మడి బిక్షం, రామనాథం, అవాజ్ నాయకులు హిమామ్, సోషల్ మీడియా ఇంచార్జ్ పిట్టల రవి,ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వివిసి ట్రస్ట్ సేవలు అభినందనీయం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ- ఖమ్మం

వివిసి ట్రస్ట్ సేవలు అభినందనీయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని వివిసి గార్డెన్‌లో వెంకటరమణ ఆటోమొబైల్స్ ఫౌండర్ వంకాయలపాటి వీరయ్య చౌదరి 25వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వీరయ్య చౌదరి మొదటి నుంచి కాంగ్రెస్ వాది అని, అపరమేధావి అని కొనియాడారు. అయన స్థాపించిన ఈ వివిసి సంస్థలు తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి ఉన్నాయని అన్నారు. ఈ సంస్థను వివిసి రాజా మరింత విస్తరించి వాళ్ళ నాన్న పేరుతో ట్రస్ట్ స్థాపించి ప్రజలకు ఈ వివిసి ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. నా చేతుల మీదుగా ఈ వివిసి ట్రస్ట్ ఉచిత మంచినీరును ట్యాంకర్ల ద్వారా పంపిణికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉన్నదని అన్నారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ వివిసి సంస్థ వ్యవస్థాపకులు వంకాయలపాటి వీరయ్య చౌదరి పుట్టింది నా నియోజకవర్గం నాగులవంచ గ్రామం అని, ఆ గ్రామానికి వివిసి ట్రస్ట్ ద్వారా అన్ని ముఖ్యమైన సదుపాయాలు నా చేతుల మీదుగా వారి వివిసి ట్రస్ట్ ద్వారా అందించడం జరిగిందని అన్నారు. నాగులవంచ పంచాయతీకి వైకుంఠ రథం, ఫ్రీజర్, నాగులవంచ ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలు ఇలా చాలా ఇవ్వడం జరిగిందని తెలిపారు . ఏ చిన్న అవసరం వచ్చినా తాము ఉన్నామని వివిసి ట్రస్ట్ ద్వారా వివిసి రాజా ముందుకు రావడం అభినందనీయం అన్నారు.

వివిసి ట్రస్ట్ చైర్మన్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ (వివిసి రాజా) మాట్లాడుతూ మా నాన్న స్థాపించిన ఈ వివిసి గ్రూప్ తెలంగాణ వ్యాప్తంగా మొదటి స్థానంలో ఉన్నాదని, అయన ఆశయాలకు అనుగుణంగా సంస్థను ముందుకు తీసుకువెళుతున్నామని, అందుకు సహకరించిన ఉద్యోగులకు, మా వివిసి కస్టమర్‌లకు ఎంతో రుణపడి ఉంటామని అన్నారు. ప్రజల సేవ కోసం వివిసి ఫ్యామిలీ ఎప్పుడు ముందు ఉంటుందని అన్నారు. ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి ఎక్కువ ఉన్నదని గమనించి మా వివిసి ట్రస్ట్ ద్వారా ఖమ్మంలో సుమారు 15 లక్షల వ్యయంతో ఐదు ట్యాంకర్లు ద్వారా ఉచిత మంచినీరుని మా వివిసి ట్రస్ట్ ట్యాంకర్లు ద్వారా పంపిణి మొదలు పెట్టామని, దీనికి ఒక టోల్ ఫ్రీ నెంబరు ఇస్తామని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పినట్లు డిపార్ట్మెంట్, ప్రభుత్వ సహకారంతో ఎక్కడ అవసరం ఉంటే అక్కడ సరఫరా చేస్తామని అన్నారు. అలాగే ఈ ఉచిత నీరు పథకంను ముందు ముందు జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తామని జిల్లా ప్రజలకు అందుబాటులో మా వివిసి ట్రస్ట్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అన్నారు . అలాగే కొన్ని రోజుల క్రితం ఖమ్మం మెడికల్ కాలేజీకి ఒక అంబులెన్సు కలెక్టర్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగినదని, అప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఆ అంబులెన్సుకు సుమారు లక్షా యాభై వేల రూపాయలతో వెంటిలేటర్‌ను డిప్యూటీ సీఎం భట్టి చేతులమీదుగా మెడికల్ కాలేజీకి ఇస్తున్నామని అన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా చాల అంబులెన్సులు ఉన్నాయని, ప్రతి మనిషికీ ఎమర్జెన్సీలో గోల్డెన్ హావర్ ఉంటుందని, ఈ వెంటిలేటర్ లేక చాలామంది పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నియోజకవర్గాలలో ఉన్న ముఖ్య మున్సిపాలిటీలో ఉన్న గవర్నమెంట్ అంబులెన్సు లకు వెంటిలేటర్స్ కావాలని అంటే మేము మా వివిసి ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రతి మనిషి చివరి జర్నీలో ఊరి నుంచి వైకుంఠధామణికి వెళ్ళటానికి ప్రతి మండలానికి ఒక వైకుంఠ రథం ఇవ్వడానికి మా వివిసి ట్రస్ట్ సిద్ధంగా ఉన్నదని, ఇప్పటికే కొన్నిచోట్ల ఇచ్చామని, ఇప్పుడు మంత్రి తుమ్మల, డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా సుమారు 20 లక్షల వ్యయంతో ఖమ్మం మున్సిపాలిటీకి ఒక వైకుంఠ రథం, కొత్తగూడెం మన్సిపాలిటీకి ఒక వైకుంఠ రథం మా వివిసి ట్రస్ట్ ద్వారా ఇస్తున్నామని అన్నారు. త్వరలో ముస్తఫా నగర్‌లో నిరుద్యోగ యువతకి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సంవత్సరానికి 150 మంది వరకు ఉచితంగా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, నాగండ్ల దీపక్ చౌదరి, సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కారం చేయాలి

- సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువలు పూర్తి చేయాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు
- పెంచిన పత్తి విత్తనాల ధర తగ్గించాలి
- రైతుబంధు డబ్బులు విడుదల చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కేంద్రాల్లో మద్దతు ధర కంటే 700 రూపాయలు తక్కువకు కొనుగోలు చేస్తున్నారని, అలాగే తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలా జరగకుండా ప్రభుత్వం అని రకాల చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో జరిగిన తెలంగాణ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పత్తి విత్తనాల ధర వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో మిగిలిన రైతుబంధు డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, చింతనిప్పు చలపతిరావు, బక్కసాని గంగాధర్, ఎస్‌కె.మీరా, దగ్గి కృష్ణ, శీలం పకరిమ్మ, వైరా మాజీ ఎంపీపీ బొంతు సమత, బోనకల్ మాజీ ఎంపిపి తుళ్ళూరు రమేష్, మందా సైదులు, రావుల రాజబాబు, కొల్లేటి ఉపేందర్, మల్లెంపాటి రామారావు, శీలం సత్యనారాయణరెడ్డి, మల్లెల సన్మధరావు, తోటకూర రాజు, తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో రక్తదానం శిబిరం విజయవంతం

నవతెలంగాణ-వైరాటౌన్

అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో గన్నవరం గ్రామంలోని యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత అన్నారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత పిల్లల సహాయం కోసం వైరా మండలం గన్నవరం గ్రామంలో రక్తదానం శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం గ్రామంలోని యువతీ, యువకులు సామాజిక బాధ్యతతో స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ఒక మహిళలతో సహా మొత్తం 33 మంది రక్త దానం చేశారు.కార్యక్రమంలో కారుమంచి ప్రేమ్, కారుమంచి మనోజ్, మాగంటి సునీల్ , పెయింటర్ ప్రభాకర్, అబ్రహం, శీలం నవ్య, శీలం కృష్ణారెడ్డి, వేమిరెడ్డి సురేందర్, ఎస్‌కే మస్తాన్, వెంకట రామాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



నవతెలంగాణ-నేలకొండపల్లి

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో నిర్వహిం చిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రముఖ వైద్యులు కొల్లి అనుదీప్ (ఎండి జనరల్) 112 మంది రోగులకు షుగర్, బీపీ ఇతర వైద్య సేవలు అందించారన్నారు. ప్రముఖ చర్మవ్యాధి నిపుణురాలు చల్లగుండ్ల శ్రీలేఖ 36 మంది రోగులకు వైద్య సేవలు అందించారని, ఖమ్మంకు చెందిన శరత్ మాక్స్ విజన్ వారు 48 మందికి కంటి వైద్య సేవలు అందించారన్నారు.196 మందికి షుగర్, బీపీ ఇతర వైద్య సేవలు అందించి వంద రూపాయలకే నెలకు సరిపడా మందులు పంపిణీ చేసామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు సుగుణ బేకరీ యజమాని మాటూరి శేషగిరి- సుగుణ దంపతులు అల్పాహార వితరణ చేశారని తెలిపారు. గ్రామీణ వైద్యుల సేవా కమిటీ సభ్యులు బండి పుష్పలత, తానీష, బండారుపల్లి నాగేశ్వరరావు, వసుంధర ఒకేషనల్ ప్రిన్సిపాల్ ఈగ అనిల్ కుమార్, విద్యార్థులు, వైద్య సహకారం అందించార న్నారు. ప్రతి నెల రెండో ఆదివారం నిర్వహిస్తున్న నెల నెల వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. రానున్న కాలంలో వైద్య సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఎన్టీఆర్ సేవా కమిటీ నిర్వాహకులు కె.వి రామిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, ఏలూరి కోదండ రామారావు, కొంగర నారాయణరావు, వల్లంచెట్ల భాస్కరరావు, సామల మల్లికార్జునరావు, ధీరావత్ నాగేశ్వరరావు, మైకు బాబు, షేక్ రహీం పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-వైరాటౌన్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం వైరా నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంటరీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కులాలు, మతాలను రెచ్చగొట్టి రామ మందిరం పేరుతో రెండు సార్లు అధికారం చేపట్టిందని, వచ్చే ఎన్నికల్లో బిజెపికి చరమగీతం పాడాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని, కాంగ్రెస్ పార్టీ నేతలపై ఫోన్ టాపింగ్ సైతం పెట్టి ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. ఫోన్ టాపింగ్ చేసిన నేతలపై రాబోయే రోజుల్లో చట్టపరంగా చర్యలు ఉంటాయని, వారికి సువ్వలు లెక్కపెట్టే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా సొసైటీ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, శీలం వెంకట నర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, వడ్డే నారాయణరావు, స్వర్ణ నరేందర్, తలారి చంద్ర ప్రకాష్, మంగీలాల్ నాయక్, లేళ్ళ వెంకట రెడ్డి, పాల్గొన్నారు.

నారాయణపురం గ్రామ సమస్యలపై డిప్యూటీ సీఎంకి వినతి

నవ తెలంగాణ - బోనకల్

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు నారాయణపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు సూర్యదేవర సుధాకర్ బాబు నారాయణపురం గ్రామానికి సంబంధించి పలు సమస్యలపై ఆదివారం వినత పత్రం అందజేశారు. ఇటీవల నారాయణపురం గ్రామానికి చెందిన మురుకుట్ల సైదులుకు చెందిన దుక్కితేద్దు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా విద్యుత్ షాక్‌తో మృతి చెందిందని డిప్యూటీ సీఎంకు వివరించారు. గ్రామంలో విద్యుత్తు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, దీనివలన తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయని భట్టికి వివరించారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట నారాయణపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు నర్సింశెట్టి నరేష్ తదితరులు ఉన్నారు.



ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పుణ్య క్షేత్రంలో నిర్వహించబడుతున్న శ్రీ క్రోధీనామ సంవత్సర వసంత నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో 6వ రోజు ఆదివారంనిత్య పూజలు, అనుష్టానములు,హెూమముల అనంతరం వేడుకగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి స్నాతకం, క్రతువు నిర్వహించారు. తదనంతరం ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ తెలిపారు. స్వామివార్ల తరఫున పెండ్లి పెద్దలుగా ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ, ఉపప్రధాన అర్చకులు విజయదేవశర్మ, వేద పండితులు గణదలం అనంతశయన చార్యులు వ్యవహరించారు. అమ్మవార్ల తరపున వేద పండితులు వసంతకుమార్ శర్మ, అర్చకులు కాసులనాటి రామకృష్ణశాస్త్రి, మారుతి రఘురామకృష్ణ, మారుతి వెంకటరమణ వ్యవహ రించారు. బ్రహ్మాగా శ్రీ పురాణం రవికుమార్ శర్మ, ఉప బ్రహ్మాగా చిలుకూరి దాశరథి శర్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ పర్యవేక్షకురాలు విజయ కుమారి పర్యవేక్షించారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ 'నారపోగు' మృతి

పలువురు నివాళులు





నవతెలంగాణ- బోనకల్ (చింతకాని)

చింతకాని మండల పరిధిలోని వందనం గ్రామానికి చెందిన చింతకాని మాజీ ఎంపీపీ, ప్రస్తుత కాంగ్రెస్ నాయకుడు నారపోగు వెంకటేశ్వర్లు (62) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయనకు భార్య పుల్లమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నారపోగు వెంకటేశ్వర్లు 1995 సంవత్సరంలో సీపీఐ(ఎం) చింతకాని ఎంపీపీగా పని చేశాడు. కోదుమూరు ఎంపీటీసీ పరిధిలో వందనం, రాఘవాపురం గ్రామాలు ఉన్నాయి. ఆనాడు కోదుమూరు ఎంపీటీసీ జనరల్‌కు కేటాయించారు. జనరల్‌కు కేటాయించిన ఎంపీటీసీని ఆనాడు సిపిఎం చింతకాని మండల కమిటీ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లను ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీలో దించింది. ఎన్నికలలో నారపోగు ఎంపీటీసీగా విజయం సాధించాడు. ఎంపీపీ ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు కావడంతో అనూహ్యంగా ఎంపీపీ పదవి నారపోగు వెంకటేశ్వర్లకు దక్కింది. వందనం సహకార సంఘ డైరెక్టర్‌గా ఎన్నికయ్యాడు. అనంతరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ పదవులకు ఎన్నికలు జరిగాయి. డిసిసిబి డైరెక్టర్లగా ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఎవరూ ఎన్నిక కాకపోవటంతో అనూహ్య పరిణామాలతో నారపోగు వెంకటేశ్వర్లు ఎస్సీ సామాజిక వర్గం నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతకాని ఎంపీపీగా ఐదేళ్లపాటు పనిచేశాడు. ఈ ఐదేళ్ల కాలంలో సిపిఎం ఎంపీపీ ఎలా ఉండాలో పరిపాలన చేసి చూపించాడు. సిపిఎం ప్రజా ప్రతినిధులు ప్రజల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి కోసం ఎలా క్రమశిక్షణతో నీతి నిజాయితీగా పని చేయాలో ఆచరణలో చేసి చూపించి మండల ప్రజల చేత శభాష్ అనిపించుకున్నాడు. డిసిసిబి డైరెక్టర్‌గా ఐదేళ్లపాటు పనిచేసి వందనం పరిధిలోనే సొసైటీ రైతులకు రుణాలు అందించడంలోనూ విశేషమైన కృషి చేశాడు. ఆనాటి ఖమ్మం ఎమ్మెల్యేగా ఉన్న మంచికంటి రామ కిషన్ రావు సహాయ సహకారాలతో వందనం గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశాడు. వందనం గ్రామంలో బీసీ, ఎస్సీలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు కోసం నిర్విరామ కృషి చేశాడు. స్థలాల సేకరణలో తాను చేసిన కృషి ఇప్పటికీ వందనం గ్రామస్తులు మరువ లేకపోతున్నారు. సుమారు 120 మందికి పైగా ఇల్లు నిర్మించడంలో విశేషమైన కృషి చేశాడు.

జరిగిన రాజకీయ పరిణామాల క్రమంలో ఆనాడు ఖమ్మం ఎంపీగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్సిపిలో చేరాడు. అనంతరం పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరగా అతనితోపాటు బీఆర్ఎస్‌లో చేరాడు. శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరటంతో అతనితో పాటు కాంగ్రెస్‌లో చేరాడు.

గత కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. పరిస్థితి విషమంచి మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి సామినేని రామారావు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, సిపిఎం బోనకల్, చింతకాని మండలాల కార్యదర్శులు దొండపాటి నాగేశ్వరరావు, మడుపల్లి గోపాలరావు, సిఐటియు మండల కార్యదర్శి గడ్డం రమణ వ్యవసాయ కార్మిక సంఘం బోనకల్ మండల కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వత్సవాయి జానకిరాములు, ముష్టికుంట్ల మాజీ సర్పంచ్ కొమ్ము శంకర్రావు, సిపిఎం వందనం గ్రామ నాయకులు అంకిరెడ్డి రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లావుల వెంకటేశ్వర్లు, పలువురు ఆ గ్రామ సిపిఎం, టిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించి నివాళులర్పించారు.

నారపోగు మృతి బాధాకరం: పొంగులేటి

నారపోగు వెంకటేశ్వర్లు మృతి చెందటం చాలా బాధాకరమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి, ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, కోట రాంబాబు, తుళ్లూరు బ్రహ్మయ్య, బొర్ర రాజశేఖర్ చింతకాని ఎంపీపీ కోపూరి పూర్ణయ్య కాంగ్రెస్ చింతకాని మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు ఆ పార్టీ నాయకులు కూరపాటి కిషోర్, కిలారు మనోహర్, బోనకల్ నాయకుడు ఉమ్మనేని కృష్ణ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
ఖమ్మం
సోమవారం | ఏప్రిల్ 15, 2024 | www.navatelangana.com

చిరుమర్రిలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని చిరుమర్రి గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు పల్లపాటి కృష్ణ నివాసాన్ని ఆయన సందర్శించి ఇటీవల వివాహమైన కుమారుడు జీవన్ కుమార్, అశ్విని నూతన దంపతులను భట్టి ఆశీర్వదించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మధిర నియోజకవర్గ యువజన నాయకులు తిరుమలశెట్టి అన్వేష్ నివాసాన్ని సందర్శించి పరామర్శించారు. గతంలో అనారోగ్యంతో మృతి చెందిన అన్వేష్ తల్లి చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిడ్డింగుల సంస్థ రాష్ట్ర చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల, జిల్లా నాయకులు మహమ్మద్ జావిద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కొమ్మినేని రమేష్ బాబు, పందిరి అంజయ్య, బీసి సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, కమలాపురం, వల్లభి ఎంపీటీసీ సభ్యులు దేవరపల్లి ఆదినారాయణరెడ్డి, బిచ్చాల బిక్షం, మండల నాయకులు బుల్లెట్ బాబు, పసుపులేటి దేవేంద్రం తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయి

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని రఘునాథ్‌గూడెం గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న సందర్భంగా చేపట్టిన పూజలు గత మూడు రోజుల నుండి జరుగుతున్నాయి. ఆదివారం గ్రామంలో విగ్రహాల ప్రదర్శన జరుగుతుండగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేకు ఆలయ సాంప్రదాయం ప్రకారంగా ఘన స్వాగతం పలికారు.

నారాయణపురంలో వినతుల స్వీకరణ

మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఉదయం తన స్వగృహంలో ఎమ్మెల్యే రాగమయితో పాటు కలిసి వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. ఆ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలును కలసి వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ దయానంద్ విజయకుమార్, డీసీసీబీ మాజీ చైర్మెన్ మువ్వా విజయ్ బాబు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్ చౌదరి, కాటేపల్లి కిరణ్, తదితర మండలాల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

స్నేహితుడు కోసం తోడు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై డీ ఫార్మసీ విద్యార్థి మృతి చెందిన సంఘటన తిరుమలాయపాలెం మండల కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం దానవాయిగూడెం 59 వ డివిజన్‌కి చెందిన గుగులోతు తరుణ్ (21) తన స్నేహితుడిని ఖమ్మం నుండి శనివారం రాత్రి పది గంటల సమయంలో వరంగల్ జిల్లా తొర్రూర్‌లో ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి తొర్రూర్‌లో దింపేసి సుమారు 12 గంటల ప్రాంతంలో తిరిగి ఖమ్మం బయలుదేరిన తరుణ్ సుమారు రాత్రి రెండు గంటల సమయంలో తిరుమలాయపాలెం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కిట్టు హోటల్ దగ్గర ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొని పక్కనే ఉన్న పంట పొలాల్లో పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు తరుణ్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తరుణ్ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరుణ్ ఖమ్మంలోని ప్రైవేట్ కాలేజీలో డీ ఫార్మసీ విద్యను అభ్యసిస్తున్నాడు. తరుణ్ తండ్రి శ్రీనివాస్ పిర్యాదు మేరకు తిరుమలాయపాలెం ఎస్ఐ గిరిధర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులందరు ఉన్నత స్థాయికి ఎదగాలి

- విజ్ఞాన్ స్కూల్ ఆత్మీయ సమ్మేళనంలో బొర్రా రాజశేఖర్

నవతెలంగాణ-వైరాటౌన్

విద్యార్థులందరు ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మెన్ బొర్రా రాజశేఖర్ అన్నారు. స్థానిక విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన పేరెంట్స్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిగా పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం స్ఫూర్తితో పిల్లలందరూ మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అలాగే నవోదయ సీట్లు సాధించిన విద్యార్థులు జే.పావని, కే. వరుణ్ తేజ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కారస్పాండెంట్ జయప్రకాశ్ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి మా వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్, స్టాఫ్, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి వాసి శ్యామ్‌ప్రసాదరెడ్డికి డాక్టరేట్

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లికి చెందిన సూరం శ్యామ్‌ప్రసాదరెడ్డి ఉస్మానియా యూనివర్శిటీ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ పీఆర్ సుష్మ పర్యవేక్షణలో శ్యాంప్రసాదరెడ్డి అర్బస్కులర్ మైకోరైజల్ శిలీంద్ర భాగస్వామ్యంతో డయోస్పైరోస్ మెలనోక్సిలాన్‌లో విత్తన అంకురోత్పత్తి ప్రభావం, పత్రాలలో ఫైటో కెమికల్ విశ్లేషణ అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను ఉస్మానియా యూనివర్శిటీ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గత 20యేండ్లుగా అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్న శ్యామ్‌ప్రసాదరెడ్డి ప్రస్తుతం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఇంతకు ముందు ఈయన సత్తుపల్లిలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాల, నవభారత్, గీతమ్స్ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకునిగా పనిచేశారు. 2012లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికయి ప్రభుత్వ అధ్యాపకునిగా నియామకం పొందారు. శ్యామ్‌ప్రసాదరెడ్డికి డాక్టరేట్ రావడంపై సత్తుపల్లిలోని పలువురు విద్యావేత్తలు గాదె నరసింహారెడ్డి, జీవీ లింగారెడ్డి, ఎల్ఎస్ రెడ్డి, నర్సారెడ్డి, దొడ్డా శ్రీనివాసరెడ్డి, మాదిరాజు వాసుదేవరావు అభినందనలు తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలు

నవతెలంగాణ-మధిర

ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాలను ఆదివారం మధిర ఫైర్ స్టేషన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి గోడపత్రికలు, కరపత్రాలను ఇన్‌చార్జీ ఫైర్ ఆఫీసర్ బండారు రాంబాబు, మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

తప్పిన ముప్పు.. ఊపిరి పీల్చుకున్న రైతులు ..

నవతెలంగాణ-వేంసూరు

మండల కేంద్రంలోని పెద్దగుట్ట ప్రాంతంలో పంటచేలకు నిప్పు అంటుకుని సుమారు కిలోమీటర్ పొడవున మంట వ్యాపించి ఎగిసిపడుతుంది. ఈ సమయంలో స్థానికులు తాటి కింది రమేష్ అనే రైతు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. చుట్టుపక్కల డైరీ ఫామ్‌లు, అరటి, మామిడి, కోళ్ల ఫారాలు ఉన్నాయి. రాత్రి సమయంలో అయితే భారీ నష్టం వాటి లేదని రైతులు తెలిపారు.

విద్యా వాలంటీర్‌కి గౌరవ వేతనం అందజేత

నవతెలంగాణ-బోనకల్



బోనకల్ ఉన్నత పాఠశాలలో విద్యా వాలంటీర్‌గా మూడు నెలలపాటు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన విద్యా వాలంటీర్ త్రివేణి కి ఆదివారం కాంగ్రెస్ యువ నాయకులు బీపీ నాయక్ రెండు నెలల గౌరవ వేతనాన్ని బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అందజేశారు. ఈ వేతనాన్ని శ్రీ రక్షా హాస్పిటల్ యాజమాన్యం ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, బీపీ నాయక్ లు సంయుక్తంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి తెల్లాకుల శ్రీనివాసరావు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తెల్లూరి రమేష్, ముత్తుస్వామి, అంతోటి రవి ప్రసాద్, ఉప్పర శ్రీను, చల్లగొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి అవకాశం ఇస్తే అథ: పాతాళానికి అంబేద్కర్ ఆశయం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్

నవతెలంగాణ-ఖమ్మం



బీజేపీకి అవకాశం ఇస్తే అధ: పాతాళానికి అంబేద్కర్ ఆశయం పంపడమేనని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుల యర్రా శ్రీకాంత్ అన్నారు. నగరంలోని సీఐటీయూ ఖమ్మం 3 టౌన్ కమిటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ 133 జయంతి ని గాంధీ చౌక్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేడు కేంద్రంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా రాజ్యాంగ సవరణ చేయాలనే ప్రయత్నం చేస్తుందన్నారు. రాజ్యాంగంలో పొందుపరచబడిన సామాజిక, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర లక్ష్యాలైన అనేక అంశాలను తొలగించాలని మోడీ ప్రభుత్వం చూస్తుందన్నారు. బీజేపీని ఓడించడం ద్వారా రాజ్యాంగాన్ని రక్షించుకొని అంబేద్కర్ ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడానికి పునరంకితం అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టీ. విష్ణు, నాయకులు వై.విక్రమ్, తుషాకుల లింగయ్య, భూక్యా శ్రీను, జబ్బార్, ముదాం శ్రీనివాసరావు, పత్తిపాక నాగ సులోచన, వేల్పుల నాగేశ్వరరావు, పాశం సత్యనారాయణ, గబ్బెటి పుల్లయ్య, ఎర్రా మల్లికార్జున్, జిట్టబోయిన కాశీ, వేల్పుల మధు, సోమనబోయిన వెంకటేశ్వర్లు, శ్రీశైలం, కృష్ణ, వెంకటనారాయణ, ఉడత వెంకన్న, గుండాల సోమయ్య, మొర్రి మేకల అమరయ్య జినకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు


కల్లూరు

నవతెలంగాణ-కల్లూరు

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ నగర్‌లోని, అదేవిదంగా కల్లూరు ప్రధాన కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి పూలమాలలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, డీసీసీబీ మాజీ చైర్మెన్ మువ్వా విజయ్ బాబు, కాంగ్రెస్ మండల నాయకులు పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్ చౌదరి, ఏనుగు సత్యంబాబు, కాటేపల్లి కిరణ్, దామాల్ రాజు, పట్టణవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్ : సామాజిక విప్లవకారుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ అన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 133 వ జయంతిని పురస్కరించుకొని మండలంలోని పోలేపల్లి, పెద్దతండా పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో అంబేద్కర్ జయంతి వేడుకలను కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నందిగామ కృష్ణ, నాయకులు ఏపూరి వర కుమార్, నూకల బాలరాజు, వెలుతురు పుల్లారావు, నందిపాటి లక్ష్మయ్య, మహంకాళి నరేష్, రాంబాబు, ముకుందరావ్, నాగేశ్వరరావు, ధనమ్మ మహేష్, ఉమా తదితరులు పాల్గొన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కాచిరాజుగూడెంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుక్కల సైదులు, పొన్నం వెంకటరమణ, అద్దంకి తిరుమలయ్య, పొన్నం మురళీ, పొన్నం భాస్కర్, యల్దీ వెంకటరమణ తదిరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో....

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని పోలిశెట్టిగూడెం గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బచ్చలకూరి బాలరాజ్, గౌతమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి : మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంబేద్కర్ యువజన సంఘాలు, వివిధ పార్టీల చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...

మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ లో, పేద ప్రజల బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శీలం ఉమేష్, బోడ వెంకట్, వినోద్, నాగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ : మండల పరిధిలో పెద్దమండవ, కమలాపురం గ్రామాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మండల కమిటీ సభ్యులు కందిమళ్ల తిరుపతి, టీఎస్.కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, కమలాపురం గ్రామ శాఖ కార్యదర్శి కే.కుటుంబరావు, గ్రామ నాయకులు కుక్కల రామచంద్రం, మాదారపు సత్యనారాయణ, యడ్లపల్లి నరసింహారావు, అబ్బూరి ప్రసాద్, బొజ్జ వెంకట్, తాళ్లూరి రామనాథం, గురజాల వెంకన్న, పాతకోటి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్, బీఎస్పీ ఆధ్వర్యంలో...

మండల పరిధిలో వల్లభి, ముదిగొండ గ్రామాల్లో యువజన కాంగ్రెస్ పార్టీ, బీఎస్పీ ఆధ్వర్యంలో వేరువేరుగా అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. అనంతరం సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానశిబిరం ఏర్పాటు చేశారు. యువజన కాంగ్రెస్ పార్టీ మధిర నియోజకవర్గ నాయకులు బిచ్చాల అన్వేష్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బిచ్చాల బిక్షం, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర ఉపేందర్, సాహూ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి చెరుకుపల్లి నాగేశ్వరరావు, మిర్యాల నాగరాజు, మధిర నియోజకవర్గ నాయకులు పల్లెపొంగు విజయకుమార్, మండల అధ్యక్షులు నెమిలి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళి

మండలపరిధిలో కట్టకూరు, ముదిగొండ గ్రామాలలో కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి పీ.నాగరాజు, ఎమార్పీఎస్ నాయకులు కొలికపొంగు వెంకట్రావు, బడుగు బలహీన వర్గాల ప్రజాసంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దేవపంగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సత్తుపల్లి రూరల్ : మండలంలోని 15వ ప్రత్యేక పోలీసు పటాలము బీ.గంగారంలో ఘనంగా డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 133వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాలపు కమాండెంట్ సయ్యద్ జామీల్ భాష, ఆర్ఐలు, కేవీ.గోపాల్ జే.లెనిన్ బాబు, ఎం. సతీష్ కుమార్, సీహెచ్‌వీఎస్. రెడ్డి, భాస్కర్, ఆర్ఎస్ఐలు నాగేశ్వరావు, నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: అంబేద్కర్ చూపిన మార్గం అనుసరణీయం అని ఎస్ఐ కొండలరావు అన్నారు. అన్నారుగూడెంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

కామేపల్లి : బాసిత్ నగర్‌లో నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు బాదావత్ శ్రీను ఆధ్వర్యంలో టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వీరు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నూనవత్ శ్రీను, ఉపేందర్, వీరన్న, నరేష్, మహేష్ , శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో...

కామేపల్లి మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు దుగ్గి కృష్ణ పూలదండ వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఆన్ తోటి అచ్చయ్య, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు కోటగిరి రాము తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం : అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని బురదరాఘవపురం ప్రాంతంలో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీ.సంఘయ్య, టీ.శ్రీను, ఎస్. సీతాలు, జీ. భరత్, టీ.భద్రు, జీ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


బోనకల్

బోనకల్ : అంబేద్కర్ రాజ్యాంగాన్ని పరిరక్షించటం మన ప్రథమ కర్తవ్యంగా మారిందని కాంగ్రెస్ యువనేత బుక్య పిచ్చేశ్వర నాయక్ (బీపీ నాయక్) కోరారు. బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బోనకల్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి బీపీ నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుగులోత్ రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, సీపీఐ(ఎం) కార్యదర్శి తెల్లాకుల శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి ఎంగల ఆనందరావు, మాజీ జెడ్పిటిసి బానోతు కొండ, ఎమ్మార్పీఎస్ నాయకులు తాటికొండ వెంకటరత్నం, మాజీ వార్డు సభ్యులు ఉప్పర శ్రీను, రమేష్, పవన్, శ్రీనివాస్, అంబేద్కర్ యూత్ సభ్యులు రవి ప్రసాద్, మంద అశోక్, ముత్తుస్వామి, అచ్యుత్ పవన్, రమేష్ నాయక్, సూర్య, బాణోత్ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

మధిర : మధిర ఆర్టిసిడిపో ఎస్‌డబ్ల్యూ ఎఫ్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌డబ్ల్యూ ఎఫ్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రీజియన్ సహాయ కార్యదర్శి టీసీఎస్.రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి వెంకన్న, సుందర్‌రావు, ఇస్మాయిల్, నాగరాజు, వెంకట్రావమ్మా, ఐ. నాగేశ్వరరావు, చంద్ర నాగేశ్వరరావు, తేజ పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో

మధిర మండలం ఇల్లూరు గ్రామంలో న్యాయ సేవాధికార సంస్థ, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ, రాష్ట్ర కోఆర్డినేటర్లు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు (కేవీఆర్), గ్రామ పెద్దలు అంజయ్య, వెంకటరత్నం, పూర్ణయ్య, యూత్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

నవతెలంగాణ- మధిర



మధిర పట్టణంలోని వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ మధిర పట్టణ మరియు రూరల్ మండల ముఖ్య నాయకులతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జెడ్పీ చైర్మెన్ లింగాల కమల్‌రాజు, ఎంఎల్‌సీ తాతా మధులు మాట్లాడుతూ తెలంగాణ వాణిని జాతీయస్థాయిలో వినిపించాలి అంటే బిఆర్ఎస్ ఎంపీలు గెలవాల్సినా ఆవశ్యకత ఉందన్నారు. వంద రోజుల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన మార్పు ఏమిటి? హామీలు అమలు ఎక్కడ? అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి గోదావరి జలాలను బీడు భూములకు నీళ్ళిచిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుంది అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, జిల్లా నాయకులు తాళ్లూరి జీవన్, మొండితోక జయకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో దుక్కిటెద్దు మృతి

నవతెలంగాణ-కారేపల్లి

విద్యుద్ఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం భాగ్యనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ తక్కువ ఎత్తులో ఉంది. భగవాన్‌కు చెందిన దుక్కిటెద్దు మేతకు ట్రాన్స్‌పార్మర్ వద్దకు వెళ్ళింది. దీంతో విద్యుద్ఘాతం తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది దాని ఎత్తు పెంచాలని గ్రామస్తులు విద్యుత్ అధికారులకు అనేక సార్లు విన్నవించిన పెడచెవిన పెట్టిన ఫలితమే నేడు దుక్కిటెద్దు మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ.60వేల విలువైన దుక్కిటెద్దు మృతి చెందటంతో రైతు ను ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలోని ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్న ప్రైయివేటు పాఠశాలలు, కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 15 నుండి జిల్లా వ్యాప్తంగా 6 నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఎస్ఏ 2 పరీక్షలు నిర్వహించాల్సి ఉందని, ముందస్తుగా పాఠశాలలకు పేపర్లు అందించడంతో కొన్ని ప్రైవేటు పాఠశాలలు అత్యుత్సాహాన్ని చూపించి ప్రభుత్వం ఇచ్చిన టైం టేబుల్ ముందే ఈనెల 8 ,10 తేదీలలో పరీక్షలు నిర్వహించడం వలన పేపర్ లీకై వేరే పాఠశాలల విద్యార్థులకు కూడా పేపర్ తెల్సినట్టు తెలిపారు. దీనిపై స్పందిస్తూ డీఈఓ ఆ పాఠశాలకు షోకాజ్ నోటీసులు అందించినట్లు తెలిపారు. షోకాజ్ నోటీసులు అందించడం కాదు ఆ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా సంస్థలకు ఒక్క పూట బడులు ప్రకటించిన రెండు పూటల బడులు ప్రైవేటు విద్యాసంస్థలు నడుపుతున్నారని ,వీరి పైన కూడా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా పట్టణంలో 11 కేవీ టౌన్ వన్ ఫీడర్ మరమ్మత్తులు, చెట్లు కటింగ్ ఉన్నందు వలన పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుండి 11 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని వైరా విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణపల్లి, బోడెపుడి కాలనీ, రాజశేఖర్ నగర్, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య నగర్, మధు స్కూల్ ఏరియా, రేచర్ల బజార్, సత్రం బజార్, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, మధిర రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖ వారికి సహాకరించాలని కోరారు.

ఎమ్మెల్యే చేతులమీదుగా అన్నదానం

నవతెలంగాణ-వేంసూరు

కుంచపర్తి మారెమ్మ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవాల సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోటి స్వామి, రామకృష్ణ, కూకలకుంట శ్రీనివాసరావు, దేవస్థాన ఈవో నరసింహారావు, మధు, కర్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దమ్మపేట



రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. నారాయణపురం పర్యటనలో ఉన్న పొంగులేటిని కలిసిన మండల నాయకులు పలు అంశాలపై మాట్లాడారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు రావు గంగాధర్‌రావు, పర్వతనేని ప్రసాద్, కక్కిరాల రమేష్, తెలంగాణ ఉద్యమ నాయకుడు ముళ్ళపూడి వెంకటేశ్వరావు, శ్రీధర్, ఎర్రగొర్ల రాంబాబు, చక్రాల మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

21 కేంద్ర కమిటీ సమావేశాలు

- సెక్రటరీ జనరల్ సి.త్యాగరాజన్

నవతెలంగాణ-మణుగూరు



ఏప్రిల్ 21న గోదావరిఖనిలో జరిగే కేంద్ర కమిటీ సమావేశాలు విజయవంతం చేయాలని సెక్రటరీ జనరల్ సి.త్యాగరాజన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన బ్రాంచ్ కమిటీ సమావేశం ఏరియా ఉపాధ్యక్షులు వి.కృష్ణంరాజు అధ్యక్షతన జరిగింది. నూతన కమిటీ ఏర్పడిన తరువత మొట్ట మొదటి సమావేశంలో త్యాగరాజన్ మట్లాడుతూ యూనియన్ బలోపేతనికి కృషి చేయాలి అన్నారు. కావాల్సిన సూచనలు అడగి తెలుసుకున్నారు. మణుగూరులో గల కార్మికులందరినీ ఐఎన్‌టీయూసీ సభ్యత్వం చేయించాలన్నారు. ఈ కార్యక్రమం ఐఎన్‌టీయూసీ బ్రాంచి సెక్రటరీలు గట్టయ్య యాదవ్, షబ్బుధిన్, నాయుడు, ముస్తాన్, ప్రధాన ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరాజు, శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, బ్రాంచి ఎగ్జిక్యూటివ్ సభ్యులు, పిట్ సెక్రటరీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- జయంతి వేడుకల్లో కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



పాల్వంచ



భద్రాచలం రూరల్



పినపాక



భద్రాచలం రూరల్

అంటరాని తనం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురైనా అవమానాలకు ఆయుధంగా మలచుకుని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అయ్యారని కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. ఆదివారం అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, అబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ఒక్క రోజే కాదని ప్రతి రోజు ఆ మహనీయుని తలచుకోవాలని చెప్పారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో మనందరం నడవాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. సమాజంలో ఎవరికి ఎవరు తక్కువ కాదని సమతావాదాన్ని చాటి చెప్పిన మహా మేధావి అంబేద్కర్ అని చెప్పారు. మానవాళికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అని కొనియాడారు. మానవాళి జీవన మనుగడ ముందుకు సాగేందుకు ఆయన జీవితం ఆదర్శమని చెప్పారు. చదువే మార్పుకు మూలమని, ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకోవాలని చెప్పారు. చదువు మనిషికి మూడో నేత్రమని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి అనసూర్య, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిరా, మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారి సంజీవరావు, జిల్లా పరిపాలన అధికారి గన్యా జిల్లా అన్ని శాఖల అధికారులందరూ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

పినపాక : భారత రాజ్యాంగాన్ని, దాని మౌలిక స్వరూపాన్ని మార్చాలని తీవ్ర ప్రయత్నం జరుగుతుందని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అని కేవీపీయస్ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పినపాక మండలం ఎల్చిరెడ్డి పల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా సత్రపల్లి సాంబశివ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యానికి, పౌర హక్కులకు భంగం కలిగించే విధానాలను పాలకులు అనుసరిస్తున్నాయని అన్నారు. ఈ పది సంవత్సరాల కాలంలో అనేక తిరోగమన నిర్ణయాలు పాలకులు తీసుకుని ప్రజలను మోసం చేస్తున్నారని, ఒకపక్క అంబేద్కర్‌ను పొగుడుతూనే లక్ష్యాలకు, ఆశయాలకు తూట్లు పొడుస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యం అంటేనే అంబేద్కర్ అని అటువంటి ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇవ్వాలని ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. మంత్రులు, ముఖ్యమంత్రులు సైతం భారత రాజ్యాంగం మా ప్రామాణిక గ్రంథం కాదు అని నిస్సిగ్గుగా ప్రకటించారన్నారు. భారత రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని, మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకురావాలని కుట్రలను ఎదుర్కోవాలని అన్నారు.

ఏ సమాజమైనా ముందుకు పోవాలి అంటే పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధి కీలకమని అన్నారు. కానీ ఈ కాలంలో ఒక పరిశ్రమమైన నెలకొల్పిందా అని ప్రశ్నించారు. మరి పరిశ్రమలు స్థాపించకుండా, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా, ఉన్న పరిశ్రమలను బాగు చేయకుండా చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు ఎక్కడ నుండి వస్తాయని ప్రశ్నించారు. ఉపాధి అవకాశాలు లేక యువత చెడు మార్గాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే వ్యవసాయక అభివృద్ధి అనేది పాలకుల ఎజెండాలోనే లేదని అన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతాంగానే నట్టేట ముంచిందని విమర్శించారు. గిట్టుబాటు ధరలు అమలు చేయకుండా, నిర్బంధాల ప్రయోగించిందని అన్నారు. కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్లుగా తీసుకువచ్చి కార్మిక హక్కులను కాల రాసే నిర్ణయాలు బీజేపీ తీసుకున్నదని అన్నారు. ఈ దేశ ప్రధాని నరేంద్ర మోడీ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో 400 పార్లమెంటు సీట్లు బీజేపీకి గెలిపించాలని కోరుతున్నారని అన్నారు. పార్లమెంటులో 2/3 మెజారిటీ అవసరం ఉందని, అందుకు అనుగుణంగా 543 పార్లమెంటు స్థానాలలో 400 పార్లమెంటు స్థానాలు బీజేపీ ఇవ్వాలని కోరుతున్నారని విమర్శించారు. ఈ విషయాలను ప్రజలందరూ చైతన్యవంతంగా అర్థం చేసుకోవాలని కోరారు. చైతన్యవంతంగా బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య చారి, బీఆర్ఎస్ నాయకులు పోలిశెట్టి సత్తిబాబు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మండల కార్యదర్శి నిమ్మల వెంకన్న, బొమ్మర్ల శీను, పూజారి వెంకన్న, బోయిల వెంకటేశ్వర్లు, కామిశెట్టి రామారావు, మాల మహానాడుదాసరి రవి, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు అధ్యక్షులు కొప్పుల సాగర్, ఉపాధ్యక్షులు సత్రపల్లి సాంబశివరావు, కోశాధికారి పంతం నాగరాజు, కార్యదర్శి ఈసంపల్లి శివ, సహాయక కార్యదర్శి కొప్పుల కళ్యాణ్, సోషల్ మీడియా ఇన్చార్జ్ సత్రపల్లి సారయ్య, సహాయక కార్యదర్శి ఈసంపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి

భద్రాచలం రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం నేడు పెను ప్రమాదంలో పడిందని, రాజ్యాంగ రక్షణకు ఉద్యమించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మచ్చా మాట్లాడుతూ... దేశంలో అసమానతలు తీవ్రమవుతున్నాయని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ములు కాస్తూ కార్మికులు సామాన్య ప్రజలపై భారాల మోపుతున్నారని విమర్శించారు. అంబేద్కర్ ఆనాడే భూ సమస్యలపై కార్మిక వర్గ సమస్యలపై మహిళల సమస్యల పైన కృషి చేశారని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సీనియర్ నాయకులు బి.బి.జి తిలక్, కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, పి.సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, కోరాడ శ్రీనివాస్, సన్నా ఉపేంద్ర, ఎంవీఎస్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

భారత దేశాన్ని ప్రపంచ స్థాయిలో ఘనంగా నిలబెట్టడంలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తుదని, ఆ రాజ్యాంగాన్ని దేశం ముందుకు తేవడంలో అంబేద్కర్ విశేష కృషి చేశారని, అటువంటి రాజ్యాంగానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వల్ల పెద్ద ప్రమాదం వచ్చి పడిందని, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి పోరాటాలే శరణ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్ అన్నారు. పట్టణంలో గ్రామ పంచాయతీ కార్మికుల పని ప్రాంతంలో సామాజిక ఉద్యమ వారోత్సవాల్లో భాగంగా సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ కార్యదర్శి కాపుల రవి అధ్యక్షతన జరిగిన సభలో రమేష్ మాట్లాడుతూ...కుల వ్యవస్థను పెంచి పోషిస్తున్న మనువాదం పై అంబేద్కర్ తన జీవిత కాలమంతా గొప్ప పోరాటం చేశారని కొనియాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపాలని పిలునిచ్చారు.

కేవీపీఎస్, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు ఆర్థికంగా సహకరించి, అండగా నిలబడాలని తెలిపారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షులు యం.బీ నర్సారెడ్డి మాట్లాడారు. సభకి ముందు అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి కార్మికులు నివాళిలు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు, మేస్త్రీలు గుంజా చెన్న కేశవులు, శ్రీనివాసు, రాయల సాయి, కృష్ణార్జున రావు, కాపుల ప్రేమ్, షరీఫ్, జె.స్పందన, వరద రాజులు, గుమ్మడి పెద బాబు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో

యుటిఎఫ్ భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు పి.విజయబాబు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్. విజయకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి.లక్ష్మినారాయణ, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ టీవీఎస్ ప్రసాద్, భద్రాచలం అధ్యక్షులు జె.శ్రీను, దుమ్ముగూడెం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, భద్రాచలం కోశాధికారి జి.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు : అంబేద్కర్ జయంతిని సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో బర్ల తిరుపతయ్య అధ్యక్షతన సారపాక, బూర్గంపాడు మిల్లు సెంటర్లలో ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాపినేని సరోజన, ఎస్.కె అబీద, భయ్యా రాము, మరియమ్మ, యార్లకె అప్పారావు, బత్తుల గోపాల రావు, బోళ్ల ధర్మ, ఆర్ ఏడుకొండలు, ఆదురి నరసిం హారావు, సూర్య తదితరులు పాల్గొన్నారు.



వాడవాడలా అంబేద్కర్ జయంతి వేడుకలు

మణుగూరు : శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజా భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో పాయం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మణుగూరు అంబేద్కర్ సెంటర్లో గల విగ్రహానికి ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలను వేసి వేడుక నిర్వహించారు. పగిడేరు, సింగరేణి ఆధ్వర్యంలో, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కార్మిక సంఘాల నాయకులు కార్మికులు పాల్గొని పూలమాల వేశారు. అనంతరం కమిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఉత్తమ కాంట్రాక్ట్ కార్మికులకు బహుమతులు అందజేశారు. సీపీఐ పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చారి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జడ్పీటీసీ నరసింహారావు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

సింగరేణి ఆధ్వర్యంలో....

మండలంలోని కాలనీలో సింగరేణి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలకు జీఎం దుర్గం రామచందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు ఏరియా కార్మిక సంఘాల నాయకుల అంబేద్కరీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. సింగరేణి కళాకారులు డేవిడ్ రాజు బృందం ఆలపించిన అంబేద్కర్ గీతాలు సభికులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమం చివరిలో సహపంక్తి భోజనాల కార్యక్రమంలో అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏఐటి యూసీ సంఘం నాయకులు వై.రాంగోపాల్‌తో పాటు ఐఎన్‌టీయూసీ సంఘం నాయకులు కుమార స్వామి పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..

కేవీపీఎస్, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు శ్రామిక భవనంలో నిర్వహించారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, ఉప్పతల నరసింహారావు, ములకల ఉత్తం, నరసయ్య స్వరూప రాణి, తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో...

చర్ల : సమానత్వం సామాజిక న్యాయం సమసమాజ నిర్మాణం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించి నిరుపేదల అభ్యుదయానికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చా రామారావు అన్నారు. ఆదివారం మండలంలోని కామ్రేడ్ బిఎస్ రామయ్య భవన్‌లో మండల కమిటీ సభ్యులు కారం నరేష్ అధ్యక్షతన అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.సమ్మక్క, పామర్రు బాలాజీ, హరి నాగ వర్మ, వందే నరసింహ, వరదల వరలక్ష్మి, షారోని, శ్యామల వెంకటేశ్వర్లు, కారం ముత్తయ్య, గంగరాజు, లాలయ్య, గారపు మునేశ్వరరావు, ఆనందు, హైకోర్టు అడ్వకేట్ దోమల శరత్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఏరియాలో..



ఇల్లందు : ఏరియాలోని జెకె కాలనీలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి వేడుకలలో జీఎం జాన్ ఆనంద్ పాల్గొని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు. అనంతరం కేక్‌ని కట్ చేసి, మాట్లాడారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డివి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం చైర్మెన్ మాట్లాడారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

సీపీఐ(ఎం), కేవీపీఎస్ ఆధ్వర్యంలో...

అంబేద్కర్ జయంతి సందర్భంగా సీపీఐ(ఎం), సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, ఆవాజ్‌ల ఆధ్వర్యంలో పట్టణం, మండల భూ పోరాట కేంద్రం దేవులపల్లి యాకయ్య నగర్‌లలో అంబేత్కర్ విగ్రహానికి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్ రావు, ఎస్‌కే ఖాదర్‌లు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం సందర్భంగా సీఐటీయూ సామాజిక ఉద్యమ నిధిని వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ల శంకర్, చుక్కా రాంచందర్, దారవత్ రాందాస్, హుస్సేన్ వీరభద్రం వెంకన్న, రాజు, కుమార్ విజయ, సంతోష, కౌసల్య, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు : మండల హెడ్ క్వార్టర్లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, మండల సొసైటీ పిఎసిఎస్ చైర్మెన్ లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దుద్దుకురి మధుసూదన్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, మోదుగు సుగుణ రావు, ఉద్యమకారుడు నరసింహారావు, లచ్చు, నాగరాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : స్థానిక వ్యవసాయ కళాశాలలో ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పినపాక : అంబేద్కర్ సంస్కరణలకు ఆద్యుడని ఎంపీడీవో రామకృష్ణ కొనియాడారు. అంబేద్కర్ జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు రామనాథం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ వీరభద్ర స్వామి, సూపర్డెంట్ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ సిబ్బంది బాలు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, రెవిన్యూ సిబ్బంది రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండ : అయిన పాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాపల మడుగు వెంకటేశ్వర్లు, నారపోగు మధు, చాపలముడు లక్ష్మణరావు, వారాధి సత్యనారాయణ, ప్రసాద్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో...

జయంతి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ స్టేట్ సెక్రటరీ కొదుమూరి దయాకర్ రావు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనకండ్ల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బాబు, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడు బుంగ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాములు, పుల్లయ్య, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ జయంతి పండుగ మహనీయుల జయంతి పర్వదిన మహోత్సవాలు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ కే.వి.రమణ, గౌరవ అధ్యక్షులు భూపల్లి నరసింహారావు, ఎంపీడీవో జాన్ రెడ్డి, ఎంపీడీవో ఈదయ్య, విగ్రహ దాత బోళ్ళ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి పల్లి : మండలం హమాలీ కాలనీలో అంబేద్కర్ జయంతి బేడ బుడగ జంగాలు అండ్ హమాలి కాలనీ ప్రజలు ఘనంగా నిర్వహించారు. మాజీ వార్డ్ సభ్యులు తూర్పాటి రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దళిత ఐక్య వేదిక అధ్యక్షులు జేబీ సౌరి, మండల కో ఆప్షన్ సభ్యులు జక్కుల సుందర్ రావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టేకులపల్లి : అంబేద్కర్ జయంతిని పలు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్ రావు, గోలియా తండ పంచాయతీలో సేవాలాల్ మహరాజ్ ఆలయం ఆవరణంలో అంబేద్కర్ విగ్రహానికి ఇస్లావత్ నామ నాయక్, బోడా బాలు నాయక్, రామచందర్, వీరన్న, అర్జున్ రావు, భూక్య. బాలాజీ, బోడు గ్రామంలో బీఎస్పీ నాయకులు ప్రతాప్, పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో బిక్షం, వెంకన్న, ఇస్తారు, భారత్ భీమ, వెంకటయ్య, నరసింహారావు, రంజిత్, అన్వేష్, గోవర్ధన్, లక్ష్మయ్య, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అధికారం ఇస్తే..పాలన గాలికి వదిలేస్తారా

- వ్యాపారులపై దాడులు ఖండిస్తున్నా
- రేవంత్ రెడ్డి పై విరుచుకుపడ్డ మాజీ ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ-అశ్వారావుపేట



వ్యాపారులు ఏ రాజకీయ పార్టీ సానుభూతి పరులైనప్పటికీ కక్ష సాదింపు చర్యలు సరికాదని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హితవు పలికారు. ఇటువంటి సంఘటనలు మళ్ళీ పునరావృతమైతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంక ప్రసాద్‌తో పాటు మరికొందరి వ్యాపారులపై పోలీసుల దాడులను ఆయన ఖండించారు. బెదిరింపులతో బీఆర్ఎస్ నాయకులు, ప్రజ్యాపతినిధులను లొంగదీసుకోలేరని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం వ్యాపారులను పరామర్శించిన అనంతరం 'మెచ్చా' విలేకరుల సమావేశంతో మాట్లాడారు. గత పదేండ్ల బీఆర్ఎస్ ఆధ్వర్యంలోని, మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో స్నేహపూర్వక పాలన జరిగిందే తప్ప ఎక్కడా కూడా దాడులు, బెదిరింపులకు చోటు కల్పించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ 10 ఏళ్ళు ప్రభుత్వ పాలన అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రాధాన్యతగా సాగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ఆధ్వర్యంలోని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన 4 నెలల కాంగ్రెస్ ప్రజా పాలన అంతా శూన్యమని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగునీరు, విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతు కన్నీరు పెట్టడం రాష్ట్రానికే మంచిది కాదని సూచించారు. తాను ఎన్నికల ఏడాదిలో నియోజకవర్గానికి తీసుకొచ్చిన రూ.75 కోట్ల నిధులనే ప్రజలకు పంచుతూ నాయకులు గొప్పలు పోతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు చోటు లేదని, ఏపీ సీఎం జగన్ పై దుండగుల దాడి ఆయన తీవ్రంగా ఖండించారు.

ఈ సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్ రావు, మాజీ జడ్పీటీసీ జే.కే.వీ రమణారావు, నాయకులు కాసాని చంద్రమోహన్, శీమకుర్తి వెంకటేశ్వరరావు, సత్యవరపు సంపూర్ణ, సంకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్వేరోస్ ఇంటర్నేషనల్ రక్తదాన శిబిరం

- ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ శిరీష

నవతెలంగాణ-పాల్వంచ




రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 133వ జయంతి పురస్కరించుకొని పాల్వంచలో స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షులు తాళ్లూరి హరి బాబు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక సిహెచ్సి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో 46 మంది స్వేరోస్ స్వచ్ఛందంగా రక్తదానం ఇచ్చారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా స్వేరోస్ జిల్లా అధ్యక్షులు తాళ్లూరి హరిబాబు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. స్వేరోస్ ఆధ్వర్యంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ డాక్టర్ ముఖండేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ సోమరాజు, దొర బ్రెడ్ క్యాంప్ ఇన్చార్జ్ కనకదుర్గ, స్వేరోస్ హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నవతెలంగాణ-దమ్మపేట



మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహద పడతాయని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో ఎస్ఎంజిఎం ప్రీమియర్ లీగ్-1 పోటీలను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడుతూ శారీరక ధృడత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహద పడతాయని, ప్రతీ రోజు కొంత సమయం క్రీడలకు కేటాయించాలన్నారు. ముఖ్యంగా స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం బ్యాటింగ్ చేసి ఆయన క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రీమియర్ లీగ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ పోరాట ఫలితమే ఉచిత ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-మణుగూరు

సీఐటీయూ పోరాట ఫలితమే భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారని సీఐటీయూ మండల కన్వీనర్ ఉప్పతల నరసింహారావు అన్నారు. ఆదివారం శ్రామిక భవనంలో కామన్ సర్వీస్ సెంటర్ వారి ఆధ్వర్యంలో లేబర్ ఇన్సూరెన్స్ కార్డు ఉన్నవారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

సుమారు 160 మంది కార్మికులు పాల్గొన్నారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాములు ఆరోగ్య పరీక్షలు నిర్వహణను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పారా మెడికల్ బృందం సాగర్, లక్ష్మీ ప్రసన్న, నవీన, గౌతమి, లావణ్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



అంబేద్కర్ జయంతి వేడుకలను దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ భద్రాచలం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి దిశ ప్రొటెక్షన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు పూజల లక్ష్మీ మాట్లాడుతూ... భారత దేశంలోని అందరికీ అన్ని హక్కులు కలిగేందుకు అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఫలితంగానే ఈ దేశంలో అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛ సమానత్వంతో జీవిస్తున్నారని అన్నారు. దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆశయ సాధన కోసం కషి చేస్తున్నామని స్పష్టం చేశారు. అంటరానితనం కులవివక్షత సామాజిక వివక్షతతో పాటు మహిళలపై జరుగుతున్న అగాత్యలపై దిశా ఆధ్వర్యంలో అనేక రకాల పోరాటాల రూపొందిస్తున్నామని శాశ్వతంగా కుల వివక్షతను రూపుమాపేందుకు దిశ ఎప్పుడు ముందుంటుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-చండ్రుగొండ

నేడు ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బానోత్ పార్వతి అధ్యక్షతన ప్రజా పరిషత్ కార్యాలయం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి అశోక్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పర్ణశాలలో శ్రీరామనవమి ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 17వ తేదీన జరిగే శ్రీ సీతారామ కళ్యాణ ఏర్పాట్లను భద్రాచలం ఆర్డీవో దామోదర్ పరిశీలించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి వసతి ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. నవమి పూర్తిస్థాయిలో అన్ని సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ముత్యాలరావు, ఆలయ ఉత్సవ అధికారి అనిల్ కుమార్, పంచాయతీ సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యూటిఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్ పై జిల్లా వర్క్ షాపు జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్ సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ ఎంతో ఆందోళనకరంగా పడిపోతున్నదన్నారు. ప్రస్తుతం ఉన్న వసతులు, టీచర్లతోనే విద్యార్థుల నమోదు ఎంచుకునే అవకాశాలు చూడాలని చెప్పారు. అదేవిధంగా తరగతికి ఒక గది, ఒక టీచరు, ప్రధానోపాధ్యాయుడు ఉండే విధంగా ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రజలు డిమాండ్ చేసే విధంగా ఉండాలని దానికి అవసరమైన కార్యాచరణ చేపట్టాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలను అవసరం ఉన్న చోట ఉన్నత పాఠశాలుగా అప్‌గ్రేడ్ చేయాలని, అవసరం లేని చోట ప్రాథమిక పాఠశాలగా డి-గ్రేడ్ చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో నమోదు పెరిగితే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. సామాజిక స్పృహ కలిగిన టీఎస్ యుటిఎఫ్ కార్యకర్తలుగా మీరందరూ పాల్గొని ప్రాథమిక పాఠశాలలో ఎన్‌రోల్ మెంట్‌ను పెంచుటకు విశేషమైన కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. టిఎస్ యూటిఎఫ్ జిల్లా, మండల ప్రధాన భాధ్యులతో, ఉపాధ్యాయులతో ముఖాముఖి పాల్గొని పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచడానికి అవకాశం ఉన్న మార్గాలు తెలియజేసారు. ఆ మార్గంగా టీఎస్ యూటిఎఫ్ ప్రయాణించాలని కోరారు. వర్క్ షాప్‌లో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వి.వరలక్ష్మి, జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు ఎం.పద్మా రాణి, డి.తావూరియా ఎస్.విజయ్ కుమార్, డి.దాసు, బి.బిక్కు, ఎం. రాజయ్య, టి.జయరాజు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





పర్సా జీవితం నేటి తరానికి మార్గదర్శకత్వం

- జూన్ 2, 3 తేదీలలో పర్సా శత జయంతి స్మారక సదస్సు
- సీఐటీయూ జాతీయ కోశాధికారి యం.సాయిబాబు

నవతెలంగాణ-కొత్తగూడెం

పర్సా సత్యనారాయణ జీవితం నేటి తరానికి మార్గదర్శకత్వం కావాలని, జూన్ 2, 3 తేదీలలో పర్సా శత జయంతి స్మారక సదస్సు నిర్వహించ నున్నట్టు, పర్స చేసిన పోరాట స్ఫూర్తితో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి యం.సాయిబాబు పిలుపు నిచ్చారు. శనివారం రాత్రి కొత్తగూడెంలో స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి అధ్యక్షతన పర్స శత జయంతి సదస్సు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సాయిబాబు హాజరై మాట్లాడారు. పర్సా సత్యనారాయణ జీవితం తెరచిన పుస్తకం లాంటిదని, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని, ఆరు సంవత్సరాల పాటు జైల్ శిక్ష అనుభవించారని అన్నారు. సింగరేణిలో సాధారణ కార్మికుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి సీఐటీయూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా 32 సంవత్సరాల పాటు కొనసాగారని తెలిపారు. కార్మిక, ప్రజా ఉద్యమాలలో పని చేస్తున్న కార్యకర్తలతో అత్యంత ఆత్మీయంగా ఉండే వారని, కుటుంబాలతో మమేకమయ్యారని అన్నారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో అత్యంత ప్రమాదకర ఖైదీగా నిజాం ప్రభుత్వం గుర్తించి, కనిపిస్తే కాల్చివేత అనే ఉత్తర్వులు కూడా ఇచ్చారని అన్నారు. ఉద్యమంలో పత్రికల ప్రాధాన్యతను తరచూ నొక్కి చెబుతూ ఉండే వారని అన్నారు. కొత్తగూడెంతో పర్స పేగుబంధం ఉన్నదని, రాష్ట్ర, అఖిల భారత బాధ్యతల్లోకి వెళ్ళినా కొత్తగూడెంని ఎన్నడూ మరచిపోలేని అన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురై 92 సంవత్సరాల వయస్సులో మరణించారని, మరణానికి మూడు నెలల ముందు వరకు యాక్టివ్‌గా ఉన్నారని అన్నారు. పర్స చనిపోయింది ఏలూరులో అయినప్పటికీ అంత్యక్రియలు కొత్తగూడెంలో జరపాలని వారి నిర్ణయం మేరకు కొత్తగూడెంలో అంత్యక్రియలు జరిగాయని అన్నారు. అటువంటి పర్స సత్యనారాయణ శత జయంతి కార్యక్రమాన్ని వైవిధ్యంగా నిర్వహించాలని, పర్స పోరాట స్ఫూర్తితో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశాన్ని అన్ని రంగాల్లోనూ అంతర్జాతీయ స్థాయిలో భ్రష్టు పట్టించిన బిజెపిని ఓడించడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ రెండు రోజుల సదస్సు జయప్రదానికి కృషి చేయాలని, పర్స సందేశాన్ని జిల్లాలో కార్మికలోకంలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు, సీనియర్ నాయకులు యం.యస్.రెడ్డి, యం.వి.అప్పారావు, నెల్లూరి నాగేశ్వర రావు, కెహెచ్.ప్రసాద్, కృష్ణ మూర్తి, ఉపెస్, నబీ, వెంకటేశ్వర్లు తదితరులు పర్సతో తమకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటియూ జిల్లా కార్యదర్శి ఏజె.రమేష్, కోశాధికారి జిలకర పద్మ, ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్, యస్.ఏ నబీ, సహాయ కార్యదర్శులు డి.వీరన్న, కె.సత్య, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, ఉప్పుతల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవానికి ఆధ్యాత్మిక ఆహ్వానం

- సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం
- దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్





దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలాగా అన్ని ఏర్పాట్లను చేశామని ఆలయ ఈవో ఎల్.రమాదేవి స్పష్టం చేశారు. శ్రీరామ నవమి ఏర్పాట్లపై 'నవతెలంగాణ'తో ఆలయ ఈవో రమాదేవి ముఖాముఖి.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలాగా ఏర్పాట్లు

సీతారాముల కల్యాణంను ప్రత్యక్షంగా తిలకించేందుకు దేశ నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండటంతో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడేలాగా నవమికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయం చుట్టూ చలవ పందిళ్లతో పాటు స్వాగత ద్వారాలు విద్యుత్ అలంకరణలను భక్తులు తొక్కిసలాటకు గురికాకుండా మార్కెట్లను ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ చుట్టూ పక్కల ప్రాంతాలకు రంగులను అద్ది ఆకర్షవంతంగా తీర్చిదిద్దడం జరిగింది.

రామయ్య భక్తులందరికీ తలంబ్రాలతో పాటు అందుబాటులో స్వామివారి ప్రసాదం

రామయ్య భక్తులందరికీ స్వామివారి ముత్యాల తలంబ్రాలతో పాటు లడ్డు ప్రసాదాన్ని అందించేందుకు ఆలయ అధికారులు సిద్ధం చేశారు. సుమారు 250 క్వింటాల తలంబ్రాలను సిద్ధం చేసి పట్టణ వ్యాప్తంగా 60 కౌంటర్ల ద్వారా భక్తులకు అందించేందుకు ఏర్పాటు చేశాం. అదేవిధంగా రామయ్య కల్యాణాన్ని ప్రత్యక్షంగా భద్రాచలం వచ్చి వీక్షించలేని భక్తుల కోసం పోస్టల్ ద్వారా ఆర్టీసీ కార్గో ద్వారా ఆన్లైన్లో బుక్ చేసుకుంటే నేరుగా వారింటికే స్వామివారి తలంబ్రాలను పంపించేందుకు ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన భద్రాద్రి రామయ్య లడ్డు ప్రసాదం భక్తులందరికీ చేరేలాగా సుమారు మూడు లక్షల లడ్డులను తయారు చేసి 19 కౌంటర్ల ద్వారా భక్తులకు విక్రయించేందుకు కావలసిన ఏర్పాట్లు చేశాం.

స్వచ్ఛంద సేవ సంస్థల సహకారం

కల్యాణం తిలకించేందుకు భద్రాచలం విచ్చేసిన యాత్రికులకు ఈ ప్రాంత స్వచ్ఛంద సేవా సంస్థలు సైతం అన్ని విధానాల సేవలందించేందుకు ముందుకొస్తున్నారు. ఎండల అధికంగా ఉన్న నేపథ్యంలో పట్టణవ్యాప్తంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే జల ప్రసాదం కౌంటర్లతో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ఉచితంగా వాటర్ బాటిల్లతో పాటు మజ్జిగ ప్యాకెట్లు పానకం సెంటర్లను ఏర్పాటు చేసేందుకు అనేక స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నారు. వీటితోపాటు అన్నదానాలు, అల్పాహార దానాలు చేయడంలో కూడా పలు స్వచ్ఛంద సంస్థలు యాత్రికుల పట్ల తమ ఔదార్యాన్ని చాటుకుంటున్నాయి. ఈసారి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్టాండ్ నుండి నడవలేని వికలాంగులతో పాటు వయసు పై బారిన వృద్ధుల కోసం ఆర్టీసీ వారు ఉచితంగా బస్ సర్వీసులను దేవస్థానం అతి సమీపం వరకు తీసుకొచ్చేందుకు సహకరిస్తున్నారు.

కల్యాణానికి అన్ని శాఖల సమన్వయంతో

సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు దేవదాయ శాఖతో పాటు పోలీస్, రెవిన్యూ, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఇప్పటికే పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ఇతర ప్రాంతాల నుండి వందలాది పాసింజర్ కార్మికులను భద్రాచలానికి తరలించి సుందర భద్రాద్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. రెవిన్యూ శాఖ వారు కళ్యాణానికి పూర్తి స్థాయిలో సహకారాలు అందిస్తూ భక్తులకు వసతిలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడడమే కాక భక్తులకు కావలసిన అన్ని సహాయ సహకారాలు అందించేందుకు పోలీస్ శాఖ ఇప్పటికే కావలసిన ప్రణాళికను సిద్ధం చేసి భక్తులకు అన్ని విధాల రక్షణతో పాటు సహాయ సహకారాల సమాచారాన్ని సైతం సిద్ధమయ్యారు.

మూడు రోజులపాటు భద్రాద్రికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం

స్వామి వారి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా 16వ తారీకు ఎదురుకోలు కార్యక్రమంతో పాటు 17 తారీకు స్వామివారి కల్యాణ మహోత్సవం 18వ తారీకు బ్రహ్మాండ నాయకుడి పట్టాభిషేక కార్యక్రమం ఉన్న నేపథ్యంలో మూడు రోజులపాటు దేశ నలుమూల నుండి వేలాది సంఖ్యలో యాత్రికులు భక్తులు భద్రాచలానికి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే రామయ్య దర్శనానికి భక్తుల తాకిడి పెరిగింది. రోజురోజుకీ పెరుగుతున్న భక్తుల సంఖ్య దృష్టిలో పెట్టుకొని కావలసిన ఏర్పాట్లు కూడా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేశాం.

క్షణక్షణం పర్యవేక్షిస్తున్న ఉన్నత అధికారులు

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవ కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకాలు అవరోధాలు కలగకుండా ఉండేందుకు జరుగుతున్న ఏర్పాట్లను ఎప్పటికప్పుడు దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్‌తో పాటు కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ ప్రతిక్ జైన్, ఆర్డీవో దామోదర్‌లు పరిశీలిస్తూ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కావలసిన సహాయ సహకారాలు ఎప్పటికప్పుడు అందించడమే కాక అధికారులతో సమీక్షలు నిర్వహించి కావలసిన సూచనలు సలహాలు అందిస్తూ ఉత్సవాలకు సరిపడా సిబ్బందితో పాటు అన్ని రకాల సహకారాలు అందిస్తూ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు.

భక్తుల కోసం ప్రత్యేక స్నానాల ఘాటుల ఏర్పాటు

భద్రాద్రి విచ్‌కి విచ్చేసి రామయ్య భక్తులు అత్యంత పవిత్రంగా భావించే పవిత్ర జీవనది గోదావరిలో స్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక ఘాటులను ఏర్పాటు చేయటమే కాక నదిలోకి దిగలేని భక్తుల కోసం షవర్ అవకాశాలను కూడా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశాం. గోదారి స్నానాల సందర్భంలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఉండేందుకు సీమర్లను బోటులను నది పరివాహక ప్రాంతంలో అందుబాటులో ఉంచాం.

రామయ్య భక్తులకు ఆన్‌లైన్లో అన్ని రకాల సమాచారం

కల్యాణ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అన్ని రకాల సమాచారాలను ఇప్పటికే ఆన్లైన్లో పొందుపరచడంతో పాటు సెక్టార్ టెక్ టిక్కెట్లను ఆన్లైన్లో విక్రయించడం జరుగుతుంది. అదేవిధంగా వసతిగృహాలను బుక్ చేసుకునేందుకు కూడా ఆన్లైన్లో సైట్‌ని ఓపెన్ చేసి భక్తులకి అందుబాటులోకి తీసుకురావడం వచ్చాం.

పర్ణశాలలో సైతం కల్యాణ ఉత్సవాలు

సీతారాముల కల్యాణ మహోత్సవాలు భద్రాచలం తోపాటు అనుబంధ పర్ణశాల ఆలయంలో కూడా వైభవంగా నిర్వహించేందుకు కావలసిన ఏర్పాట్లు చేశాం. సీతారాములు నడి ఆడిన ప్రాంతంగా పిలిచే పర్ణశాలలో రామయ్య కల్యాణానికి కావలసిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశాం.

కల్యాణ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఈ ప్రాంత సంప్రదాయ ఆధ్యాత్మిక ఆదిత్యం అందించేందుకు కావలసిన ఏర్పాట్లను చేయటంతో పాటు ఈ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలను దేశవ్యాప్తంగా తెలిసే విధంగా అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు కల్యాణ మహోత్సవాన్ని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఈవో రమాదేవి నవతెలంగాణకు ప్రత్యేకంగా స్పష్టం చేశారు.



అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దమ్మపేట



మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన అంబేద్కర్ 133వ జయంతి వేడుకల్లో అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జారె అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పలువురికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానాలు చిరస్మరణీయమని అవి ఎప్పటికి సజీవంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, ఎస్సీ కాలనీ యూత్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొద్దులగూడెం గ్రామంలో పాల్గొన్న మెచ్చా

మొద్దులగూడెం గ్రామంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దొడ్డ రమేష్, వేంపాటి భారత్, పర్వతనేని ప్రభాకర్ రావు, మాజీ సర్పంచ్ సున్నం రాము, దొడ్డ నాగేశ్వరరావు, బాల శ్రీను, ఏసు, నాని, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెల్ల అన్నదానం గొప్పది

నవతెలంగాణ-చర్ల



యావత్ సృష్టిలో అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్కే అన్నారు. మీకోసం మేమున్నాం టీం నిర్వహిస్తున్న వారాంతపు ప్రతీ ఆదివారం-అన్నదానం-126వ వారం కార్యక్రమంలో భాగంగా కీర్తిశేషులు శ్రీ దేవభక్తుని సాంభశివరావు జ్ఞాపకార్థం, వారి కుమారుడు దేవభక్తుని రామకృష్ణ (ఆర్కే) వారి కుటుంబ సభ్యులు పంపిన రూ.7,500 వితరణ చేయగా గాంధీబొమ్మ సెంటర్ వద్ద సుమారు 300 మందికి ఉచిత భోజనాలు, స్వీటు, అరటి పళ్ళు, పెరుగు పంపిణీ చేశారు. ఈ విధమైన అన్నదానాలతో తమతమ శుభ/జ్ఞాపకార్థ కార్యాలను పేదలతో పంచుకుంటే ఎంతో పుణ్యం లభిస్తుందని చైర్మెన్ లయన్ నీలి ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు దేవభక్తుని రామకృష్ణ, బంధు మిత్రులు, మీకోసం మేమున్నాం టీం సభ్యులు పాల్గొని తమ సేవలందించారు. అలాగే ఆదివారం అన్నదాత ఆర్కే జన్మదినం కావడం కూడా ఓ విశేషం.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

పినపాక : వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించే ఆస్కారం అధికంగా ఉంటుందని అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తతే ఆయుధమని అవగాహన ముఖ్యంగా ఉండాలని అగ్నిమాపక సిబ్బంది భాస్కర్ తెలియజేశారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గల అగ్నిమాపక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన లేకపోవడమే అన్నారు. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎంపీడీవో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విధి నిర్వహణలో అమరులైన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది డీఓపీ సలీం, హెచ్జీలు చంటి, నరేష్, ఎంపీడీవో కార్యాలయం సూపరెంటెంట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయాన్ని సద్వినియోగపరచుకోండి

నవతెలంగాణ-చర్ల



శాఖా గ్రంథాలయాన్ని విద్యార్థులు పుస్తక పఠనం, వార్తాపత్రికల పఠనం చేయువారు సద్వినియోగం పరుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీమలమర్రి మురళీకృష్ణ, దేవభక్తిని రామకృష్ణ కోరారు. ఆదివారం శాఖ గ్రంథాలయానికి సుమారు రూ.10 వేల విలువ గల కూలర్లను దేవత రామకృష్ణ వితరణగా ఇచ్చి మాట్లాడారు. శాఖా గ్రంథాలయం-చర్లకు విచ్చేస్తున్న చదువరులు, గ్రూప్స్ తదితర పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు తీవ్ర ఎండలకు ఇబ్బందులు పడుతుండడం చూసి చలించిన దేవభక్తుని రామకృష్ణ తన జన్మదిన కానుకగా చర్ల-గ్రంథాలయంకు బహూకరించడం జరిగిందని తన మిత్రబృందంతో వచ్చిన రామకృష్ణ పెద్ద మనసు చాటుకుని, ఈ వితరణ కార్యక్రమంను చేపట్టడం ఎంతో గర్వించదగిన విషయం అని పలువురు ఆర్కేను అభినందించి దీవించారు. ఈ కార్యక్రమంలో ఎం.నాగరాజు, గుండె పూడి సతీష్, గుండె పూడి భాస్కరరావు, తోట మల్ల వరప్రసాద్, సాయి, రాజా శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ చుక్కబొట్ల వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

16న మహబూబాబాద్ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశం : హరిప్రియ

ఇల్లందు : రాష్ట్రంలో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపే లక్ష్యంగా 16న ఇల్లందులో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్టు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి హరిప్రియ తెలిపారు. 3 గంటలకు పట్టణంలోని స్థానిక పాత బస్ స్టాండ్ వద్ద గల అయితా వారి ఫంక్షన్ హాల్‌లో సమావేశం జరగనున్నదని తెలిపారు. అభ్యర్థి మాలోత్ కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్, ఎమ్మెల్సీ తాత మధు, మహబూబాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ జిల్లా అధ్యక్షులు దిండిగాల రాజేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకట్ పాల్గొననున్నారని తెలిపారు. ఇల్లందు పట్టణం, మండలం, టేకులపల్లి, కామే పల్లి మండలాల, అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, నేతలు, కీలక నాయకులు, కార్యకర్తలు, యూత్ విభాగం వారు, మహిళా విభాగ నాయకురాళ్ళు, అనుబంధ సంఘాల వారు, సోషల్ మీడియా విభాగం వారు అధిక సంఖ్యలో సమావేశాన్ని విజయవంతం చేయగలరని కోరారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

విద్యుత్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఆ కుటుంబానికి మనో ధైర్యం కల్పించారు. అనంతరం ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధితు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి కణితి రాముడు, పార్టీ అధికారప్రతినిధి ఎండి జానీ పాషా, పార్టీ సీనియర్ నాయకులు సాగి శ్రీనివాసరాజు, సహాయకార్యదర్శి జుంజురి జయసింహ, ప్రచార కమిటీ అధ్యక్షులు దామెర్ల శ్రీనివాసరావు, నాయకులు తదితరులు ఉన్నారు.

బ్రిలియంట్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-బూర్గంపాడు



మండల పరిధిలోని సారపాక బ్రిలియంట్ హైస్కూల్, జూనియర్ కాలేజ్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మెన్ బీఎస్ఆర్, హెడ్ మిస్సెస్ స్వర్ణ కుమారి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసారు. అనంతరం బీఎస్ఆర్ మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచానికే గొప్ప ఆదర్శనీయుడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మెన్ బీఎస్ఆర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెళ్లిరోజు శుభాకాంక్షలు

నవతెలంగాణ-చండ్రుగొండ



మద్దుకూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పత్తిపాక చిన్న వెంకన్న మేనల్లుడు బీఆర్ఎస్ మండల నాయకులు బుడగం కృష్ణ మూర్తి - విజయలక్ష్మి దంపతుల పెండ్లి రోజు జరుపుకుంటున్న సందర్భంగా వారికి మండల బీఆర్ఎస్ కమిటీ తరపున శుభాకాంక్షలు తెలిపారు.

మురళీకృష్ణకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య మద్దతు

నవతెలంగాణ-ఇల్లందు

సీపీఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీల నుంచి మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మోకాళ్ళ మురళీకృష్ణ గెలుపును కాంక్షిస్తూ మద్దతుగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తన కళారూపాల ద్వారా ప్రచారం నిర్వహిస్తుందని అరుణోదయ జిల్లా ప్రధానకార్యదర్శి యనగంటి చిరంజీవి అన్నారు. ఆదివారం ఇల్లెందు ఐఎఫ్టియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 19న ఇల్లెందులో జరిగే జనరల్ బాడీకి కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షులు ఎట్టి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు బొగ్గారపు వెంకన్న, బొమ్మెర వీరన్న, బిక్షం, లాజర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలసిన రుక్మిణీ

నవతెలంగాణ-చండ్రుగొండ



నారాయణపురంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణీ మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో గల వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చండ్రుగొండ నుండి జూలూరుపాడు వెళ్లే రహదారి వెంబడి గల డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యకు అయిన త్వరలోనే పరిష్కారం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | ఏప్రిల్ 15, 2024 | www.navatelangana.com

పంట రుణాలను రీషెడ్యూల్ చేసి మారిటోరియం ప్రకటించాలి

• ముఖ్యమంత్రికి రైతుల విన్నపం

నవతెలంగాణ-తల్లాడ

2023-24 సంవత్సరంలో సకాలంలో వర్షాలు కురవకపోవడం, వాతావరణం అనుకూలించకపోవడం, చీడపీడల వల్ల, వర్షాధారం కింద సాగు చేసిన మిరప, పత్తి, వరి ఇతర పంటలు, చేతికి అందక తాము తీవ్రంగా నష్టపోయారని, పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి మారిటోరియం ప్రకటించాలని కోరుతూ రైతులు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వినతి పత్రంలో పంటలు సాగు చేయడానికి వివిధ బ్యాంకుల నుండి పంట రుణాలను తీసుకున్నాం. రుణాలను ఈ సంవత్సరం మరల అసలు, వడ్డీలు కట్టి రుణాలను రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది. సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయనందున, వర్షాభావ పరిస్థితుల వలన పంట రుణాలను రెన్యువల్ చేయించుకోలేకపోయామని తెలిపారు. రెన్యువల్ చేయించుకోలేకపోతే మరల బ్యాంకులు పంటలకు పెట్టుబడి రుణాలు ఇవ్వవు, తాము దళారుల నుండి అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని మరల పంటలను సాగు చేయవలసిన పరిస్థితి ఏర్పడిదని పేర్కొన్నారు. దీని వల్ల మేము రుణగ్రస్తులమై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని, కావున 2023,24 లో ఖరీఫ్, రబి కింద రైతులు తీసుకున్న పంట రుణాలను రి షెడ్యూల్ చేసి, టర్మ్ లోన్‌లుగా మార్చి, తీసుకున్న రుణాలను ఒక సంవత్సరం మారిటోరియం కల్పించి, ఆ రుణాన్ని ఏడు సంవత్సరాలలో చెల్లించే విధంగా అవకాశం కల్పించవలసిందిగా, 2024 ,25 కాలంలో సాగు చేయు పంటలకు, పంట రుణాలు ఇప్పించవలసిందిగా కోరారు. గతంలో పంటలు పండనప్పుడు ప్రభుత్వం వారి చొరవతో బ్యాంకులు ఈ అవకాశం కల్పించాయని తెలిపారు. సాగర్ ఆయకట్టు కింద ఉన్న మండలాలను కరువు మండలాలుగా ప్రకటించవలసిందిగా కోరారు. తెలంగాణ రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆదివారం వినతి పత్రం సమర్పించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు.

మైనారిటీలకు గ్రూప్-1లో ఉచిత శిక్షణ

నవతెలంగాణ-పాల్వంచ

గ్రూప్ -1, రాస్తున్న మైనారిటీ అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ వారు ఈ నెల 15 నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు భద్రాద్రి జిల్లా మైనారిటీ అధ్యక్షులు యండి. యాకూబ్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ హైదరాబాద్ లోని చార్మినార్ వద్ద గల ఉర్దూ మస్కాన్ హాల్ నందు ఇవ్వడం జరుగుతుందని, ఈ శిక్షణలో పాల్గొనే వారందరికీ ఉచిత మెటీరియల్ కూడా అందిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 040-23236112, 8520860785 కు సంప్రదించాలని కోరారు.

వరిగడ్డి దగ్ధం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

కొండాయిగూడెం గ్రామంలో ఓ రైతు వరి గడ్డి బొద్దులు ట్రాక్టర్ తో ఇంటికి తీసుకుపోతున్న సమయంలో గ్రామంలో విద్యుత్ తీగలు వరిగడ్డికి అంటుకున్నాయి. మంటలు చెలరేగడంతో గ్రామస్థులు వచ్చి నీళ్ళు పోసి ఆర్పేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. నూతన మండలానికి ఎటుచూసినా 30 కిలోమీటర్ల దూరంలో అగ్నిమాపక కేంద్రం ఉండటంతో ఫైర్ ఇంజన్ వచ్చేసరికి ఎక్కువ నష్టం జరుగుతోంది. సంబంధిత అధికారులు అగ్ని ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఎటువంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చూడాలని పలువురు మండల ప్రజలు కోరుకుంటున్నారు.

షరతులు లేకుండా ఆరు గారంటీలను రజకులకు అమలు చేయాలి

నవతెలంగాణ-పాల్వంచ

సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను ఎలాంటి షరతులు లేకుండా రజకులకు అమలు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముదిగొండ రాంబాబు, చిటికెన ముసలయ్య ప్రభుత్వాన్ని కోరారు. పాల్వంచ ఇందిరా కాలనీలో పసుపునుటి బిక్షం అధ్యక్షతన రజకుల సమస్యలపై జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు.కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం పాల్వంచ పట్టణ కమిటీ అధ్యక్షులు నంద్యాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి యాదగిరి, జిల్లా కమిటీ సభ్యురాలు రామ తులసి, బిక్షం, సిద్దుల రాంబాబు, రేణుక, కల్పన ఏకమ్మ, మంగమ్మ, అంజమ్మ, బుచ్చయ్య,ఈశ్వర్ సాయి, పాల్గొన్నారు.

జాతియ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించాలి

- జిల్లా క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి

నవతెలంగాణ-పాల్వంచ

క్రీడాకారులు జాతీయ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించాలని జిల్లా క్రీడల అధికారి ఎం.పరంథామరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగుడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్వంచ, శ్రీనివాస కాలనీ లోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్ లో ఆదివారం నిర్వహించిన జిల్లా మిడిల్, లాంగ్ డిస్టన్స్ అథ్లెటిక్స్ ఎంపికలను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి ఒలింపిక్ జండాను ఊపి పరుగుపందెం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ యుగంధరెడ్డి, అంతర్జాతియ అథ్లెట్ అన్నం వెంకటేశ్వర్లు క్రిడాకారులు తో తన అనుభవాలను వివరించారు . ఈ ఎంపికలను జిల్లా అథ్లెటిక్ కోచ్ పి .నాగేందర్ ఆధ్వర్యం లో కోచ్ లు జె .గిరిప్రసాద ,అక్బర్ ,ఎం.నరేశ్, దుర్గాప్రసాద్, నాగరాజు పర్యవక్షించారు .ఈ పోటిలనుండి 25 మంది అథ్లెట్లు ఎంపికచేసి ఈ నెల 28 వ తేదీ సూర్యాపేట లో జరగబోవు రాష్ట్ర అథ్లెటిక్స్ చంపియన్షిప్ పోటీలకు పంపుతామని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె.మహిధర్ తెలిపారు .

అసమానతలపై అలుపెరుగని పోరాటం చేద్దాం

• వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్

నవతెలంగాణ-కొత్తగూడెం

భారతదేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడుదామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి కార్యక్రమం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కొమరం భీం కాలనీలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేద్దామన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజలందరికీ రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం అందని ద్రాక్షగా మారిందన్నారు. రాజకీయాలు మతతత్వ కార్పోరేట్ల చేతిలో బంది అయ్యాయని తెలిపారు. ఈ రాజకీయ విదానాలపై ఐక్యంగా పోరాడుదామని పిలుపు నిచ్చారు. బీజేపీని రాబోయే ఎన్నికల్లో ఓడించి మతతత్వ కార్పోరేట్ల కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కోట బాలకృష్ణ, సిద్దెల రాములు, రఘు, నాగదుర్గ, భారతమ్మ, రుహీన తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన సంత ఆలయ చైర్మన్

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి(సంత) ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య ఆదివారం రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను కలిశారు. ఖమ్మంలో మంత్రిని కలిసి కారేపల్లి మండలంలో వివిధ అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకవచ్చారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా మండలంలో సస్యశ్యామలం చేయటానికి కృషి చేయాలని, ప్రాజెక్టు నీటికి బుగ్గవాగుకు అనుసంధానం చేయాలని మంత్రిని వేడుకున్నారు. మండల సమస్యలపై మంత్రి సానుకూలం స్పందించినట్లు ఐలయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో పేరుపల్లి, ఉసిరికాయలపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ లో చేరారు. ఖమ్మం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సమక్షంలో పార్టీ కండువాను కప్పుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో పేరుపల్లి బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ఎండీ.మౌలాలి, నాయకులు కాలపాక అనందరావు, బచ్చలకూరి ఉపేందర్, ఉసిరికాయలపల్లికి చెందిన బోడ రవి, పచ్చిపాల వెంకటేష్‌లు ఉన్నారు. పార్లమెంట ఎన్నికల్లో శక్తివంచలేకుండా పనిచేయాలని, వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బాటలోనే మేము సైతం

నవతెలంగాణ-దుమ్ముగూడెం



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం లేకపోవడంతో భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్పటికీ అభివృద్ధి కోసం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బాటలోనే నడిచేందుకు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు సుముఖంగా ఉన్నారు. ఆదివారం చిన్న బండిరేవు గ్రామంలోని జడ్పిటిసి సీతమ్మ ఇంటి వద్ద బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మట్ట వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చారని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఆయన అధికార పార్టీలోనే కొనసాగితేనే అది సాధ్యమవుతుందని నాయకులు తమ మనోగతాన్ని తెలిపారు. సమావేశంలో పలువురు మాజీ సర్పంచులు ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

సామాజిక జనోద్ధారకుడు అంబేద్కర్



ఖమ్మం : మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని, వారు చూపిన మార్గంలో నడవాలని కలెక్టర్ విపి.గౌతమ్ తెలిపారు. ఆదివారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి: సామాజిక జనోద్ధారకుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కొనియాడారు. అంబేద్కర్ జయంతి వేడుకను స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం బీఆర్‌ఎస్ శ్రేణులు ఆదివారం ఘనంగా జరిపారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మెన్ వనమా శ్రీనివాసుదేవరావు, నాయకులు యాగంటి శ్రీనివాసరావు, దొడ్డా శంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, మానుకోట సత్యనారాయణ, వల్లభనేని పవన్, కొడిమెల అప్పారావు, అమరవరపు కృష్ణారావు, నడ్డి ఆనందరావు, పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. అంబేద్కర్ జయంతిని ఆదివారం సత్తుపల్లిలో ఘనంగా జరిపారు. స్థానిక పోస్టాఫీస్ ముందున్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పూలమాలలేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్ విజయకుమార్, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని కాషాయిదారుల మనువాదాన్ని ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సీపీఐ(ఎం), అనుబంధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆంబేద్కర్ జయంతిని సీపీఐ(ఎం), అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ(ఎం), వ్యకాస, రైతుసంఘం, సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడారు.

ముదిగొండ : మండలపరిధిలోని పమ్మి, ముత్తారం గ్రామాల్లో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 500 మందికి అన్నదానాన్ని నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ యూత్ విగ్రహ కమిటీ సభ్యులు ఆవుల శ్రీకాంత్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. అంబేద్కర్ వాది నారపొంగు కిరణ్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల, దళిత బహుజనల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప మేధావి అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో పమ్మి ఎంపీటీసీ సభ్యులు కోయ రమేష్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వడ్డే మాధవరావు, ముత్తారం, పమ్మి అంబేద్కర్ యూత్ సభ్యులు ఎల్ వెంకటేశ్వర్లు, అడపా నాగేందర్, నారపొంగు జాని, ఆవుల స్వామి, ఆర్.నవీన్, ఆర్.నాగరాజు, గోపి, శేఖర్, రాయబారకు లక్ష్మణరావు, రాయబారపు శ్రీను పాల్గొన్నారు.



ఖమ్మం:ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, సామాజిక న్యాయాన్ని, ఫెడరలిజాన్ని, ఆర్థిక స్వావలంభనను కాపాడు కోవాలని కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ప్రజాసంఘాల జిల్లా కార్యాలయం వద్ద అంబేద్కర్ జయంతి సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ముత్తమాల ప్రసాద్, రెండవ నగర కార్యదర్శి బొట్ల సాగర్, నాయకులు ఆర్.ప్రకాష్, కిరణ్, రామనాథం, మద్రి బాబురావు, నాదెండ్ల శ్రీనివాస్, బాబు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మధిర: : మధిర పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ కార్యదర్శి మందా సైదులు, పడకంటి మురళి, తెలప్రోలు రాధాకృష్ణ, మద్దాల ప్రభాకర్, వడ్రానపు మధు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : మండల వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ చావా వేణుగోపాలకృష్ణ, కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ నాయకులు చావా శివరామకృష్ణ, జడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, నాయకులు గుంతేటి వెంకటేశ్వర్లు, గుంటేటి చిరంజీవి, దామల్ల పాపారావు, మాజీ జెడ్పిటిసి కొప్పుల అశోక్, జమ్మి జయపాల్, మందడి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు: అంబేద్కర్ జయంతి వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కొణిజర్ల : కొణిజర్ల, సీంగరాయపాలెం, చిన్నగోపతి, తనికెళ్ళ తదితర గ్రామాల్లో రాజకీయాలకుతీతంగా అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ రాష్ట్ర నాయకులు షేక్ రంజాన్, సీపీఎం మండల కమిటీ సభ్యులు బోయినపల్లి శ్రీనివాస్, అన్నారాపు వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు,కాంగ్రెస్ మండల నాయకులు అనుమోలు ప్రసాద్ బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ రావు, డివైఎఫ్ఐ నాయకులు వేముల సాంబ, కెవిపిఎస్ నాయకులు బుర్రి కొండయ్య, గోపయ్య పాల్గొన్నారు.

బోనకల్ : రావినూతల గ్రామానికి చెందిన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారత అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుగులోతు పంతు, డాక్టర్ కొంగర గోపి, రైతు సంఘం నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, ఐద్వా మండల నాయకురాలు గుగులోతు శారద, టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గూగులోతు రామకృష్ణ, మాజీ డివైఎఫ్ఐ నాయకులు గుగులోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలను కలకోట గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలకోట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు దామల పుల్లయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో బండి ప్రసాద్, యంగల కనకయ్య, తోటపల్లి కోటయ్య, బందెల ముత్తయ్య, ఎంగల మోహన్ రావు, బండి సుధాకర్, తోటపల్లి జయరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు తెల్లాకుల శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్, బోనకల్ మాజీ సర్పంచ్ పోటు వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, బోనకల్ మాజీ సర్పంచ్ భూక్య జాలు, సిపిఎం బోనకల్ మాజీ శాఖ కార్యదర్శి చెన్నా లక్ష్మాద్రి మాజీ వార్డ్ నెంబర్ ఉప్పర శ్రీను, గోంగూర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి : మండలంలో కెవిపిఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, బీసీ సంఘాల ఐక్యవేదిక, భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి.రామరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, అంబేద్కర్ ఐడియాలజిస్ట్ పెదపాక వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు వంగూరి ఆనందరావు మాదిగ, పగిడికత్తుల నాగరాజు, తోళ్ల సురేష్, కాసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం: నగరంలోని రమణగుట్ట దళితవాడలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కెవిపిఎస్, ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



కెవిపిఎస్ టూ టౌన్ కార్యదర్శి బొట్ల సాగర్, ఐద్వా కార్యదర్శి నకిరికంటి కుమారి ప్రసంగించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ టూ టౌన్ అధ్యక్షులు నకిరేకల్ చిరంజీవి, ఐద్వా మండల కమిటీ సభ్యులు మొగిలి విజయ, కృష్ణవేణి, నాయకులు గుమ్మడి బిక్షం, బండారి వెంకటేశ్వర్లు, రాములు, చంటి, సుధా, జగన్ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : మండల కేంద్రంలోని రామిశెట్టి పుల్లయ్య భవనంలో సీపీఐ(ఎం), సీఐటీయుల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో నాగులవంచ వెంకట్రామయ్య, దూదిగం బసవయ్య, శ్రీను, కోటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు, కడియం శ్రీనివాసరావు, షేక్ ఇస్మాయిల్, మల్లెల లక్ష్మణరావు, రాజీవ్ గాంధీ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, నాయకులు సగ్గుర్తి కిషోర్ బాబు, గుర్రాల పుల్లారెడ్డిపాల్గొన్నారు.

నారాయణపురం దళితవాడ నందు రాజుపాలెం ఎంపీటీసీ సభ్యులు మందుల సామేలు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూసిపల్లి వెంకటరెడ్డి, కుంపటి శ్రీను, జమలయ్య, పుల్లయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

వైరాటౌన్ : సీపీఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు పూలమాలవేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, పట్టణ నాయకులు చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, మల్లెంపాటి రామారావు, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్‌రావు, కొంగర సుధాకర్, అనుమోలు రామారావు, సంక్రాంతి నరసయ్య, సంక్రాంతి పురుషోత్తమరావు, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె నాగుల్ పాషా, యనమద్ది రామకష్ణ, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల నాగరాజు, కొటా ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైరాటౌన్: వైరా స్టడీసర్కిల్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బోడేపూడి వెంకటేశ్వర రావు భవనంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. స్టడీ సర్కిల్ వ్యవస్థాపక సభ్యులు పారుపల్లి చంద్రశేఖర్‌బాబు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ వైరా నియోజకవర్గ అధ్యక్షులు పుప్పాల నాగరాజు, నారికొండ అమరేందర్, హైమంత్, యనమద్ది రామకృష్ణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చూపిన బాటలో నడవాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

భారత రత్న, రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు వాడవాడల, వివిధ రాజకీ, ప్రజా సంఘాలు, కుల సంఘాల ఆద్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో

భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక ఉద్యమాల ప్రదాత, సమ సమాజం కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి , అస్పృశ్యతను వ్యతిరేకంగా దేశాన్ని ఏకం చేసిన మహా మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా సమాజ నిర్మాణం కోసం కలిసికట్టుగా కుల మతాలకతీతంగా నడుం బిగించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ పిలుపు నిచ్చారు. కొత్తగూడెం పట్టణంలోని హనుమాన్ బస్తి సెంటర్లో జరిగిన అంబేద్కర్ జయంతి సభలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎన్.ఎస్ రాజు, సూరం ఐలయ్య, గుగులోత్ సక్రాం, భారతి, వాసు, హాఫీస్, నరసింహ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో....

అంబేద్కర్ జయంతి సందర్భంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, ఎస్పి ఇన్స్పెక్టర్ నాగరాజు, సీఐలు వెంకటేశ్వర్లు, రమేష్, కరుణాకర్, ఆర్‌ఐలు రవి, నరసింహారావు, సుధాకర్, కృష్ణారావు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సెంటర్‌లో....

అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి జిల్లా పరిషత్ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్ రావు పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి , సిపిఐ పార్టీ నాయకులు సాబీర్ పాషా, చలిగంటి శ్రీను, మద్దెల శివకుమార్ మాజీ జెడ్పిటిసి జిల్లా పరంజ్యోతి రావు, బీఆర్‌ఎస్ నాయకులు కోనేరు చిన్ని , నవతన్, కూశపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం కోర్టులో

అంబేద్కర్ 134 వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఎంఎస్ఆర్.రవిచంద్ర, అరకల కరుణాకర్, దూదిపాల రవికుమార్, సందుపట్ల ప్రవీణ్ కుమార్, నల్లమల ప్రతిభ , సీనియర్ న్యాయవాదులు రేపాక వెంకటరత్నం, గాజుల రామ్మూర్తి, సూరెడ్డి రమణారెడ్డి కోదుమూరు సత్యనారాయణ పట్టుపల్లి నిరంజన్ రావు, బాగం మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం : అంబేద్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్య అన్నారు. ఆదివారం మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో నిర్వహించిన అంబేద్కర్ 133వ జయంతి వేడుకలలో వారు పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా గౌతమి నగర్ కాలనీలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలలో హెవీ వాటర్ ప్లాంట్ జీఎం జగ్గారావు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం మార్గంలోని విగ్రహానికి దిశా కమిటీ మాజీ జిల్లా అధ్యక్షురాలు మద్దెల అన్నపూర్ణ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, దోసపాటి పిచ్చే శ్వరరావు, గద్దల నాగేశ్వరరావు, ఓరుగంటి బిక్షమయ్య, గొల్లపల్లి నరేష్, దేపంగి వెంకటరమణ, కొమరయ్య, పాడ్యా కేశవరావు, టీఎస్పీ రవికుమార్, నాగు, కే. నరసింహారావు, తంగేళ్ల భద్రయ్య, కాలవ సంసోన్, మేకల భాస్కర్ పాల్గొన్నారు.

అశ్వారావుపేట : సామాజిక న్యాయాన్ని చాటి చెప్పటమే కాకుండా రాజ్యాంగాన్ని రచించడం లో కీలక భూమిక పోషించిన మహనీయుడు అంబేద్కర్ అని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో ఆదివారం అంబేద్కర్ జయంతి ఉత్సవాలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని మూడు రోడ్ల ప్రధాన కూడలి,దొంతికుంట,పేట మాలపల్లి లో గల విగ్రహాల కు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు : అంబేద్కర్ 133వ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. నవోదయ కాంప్లెక్స్ నందు నిర్వహించిన జయంతి వేడుక సభ దళిత నాయకులు పోతురాజు నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, పిఎసిఎస్ చైర్మెన్ లేళ్ళ వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలో దళిత సంఘాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించి చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి బాపట్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంగీలాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదనరావు, ఉద్యమకారుడు, దళిత నాయకుడు వేల్పుల నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లంకి చిన్న నాగేశ్వరరావు, దుద్దుకూరి సుమంత్, కొదుమూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : రాజ్యాంగ విలువలను రక్షించడమే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు ఘన నివాళి అని సిపిఐ (ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య అన్నారు. ఆదివారం తూరుబాక గ్రామంలో బొల్లి సత్యనారాయణ అధ్యక్షతన అంబేద్కర్ 133 వ జయంతి సభ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, సాయిబాబు, కన్నె బోయిన వెంకటరమణ, బిల్లా ముత్యాలు, బూడిద పద్మ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : అంబేద్కర్ జయంతి వేడుకలును మండల ప్రధాన కేంద్రంలో ఆదివారం ఎంతో ఘనంగ నిర్వహించారు. ప్రధాన సేమ్యా దగ్గర వున్న అంబేద్కర్ విగ్రహానికి సబ్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చల్లా రాంబాబు, వెంకన్న పలువురు హమాలీ కూలీలు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్ : మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో అంబేద్కర్ 133వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి గ్రామస్తులందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బర్ల లక్ష్మణరావు, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం సోంపల్లి గ్రామంలో వందలాది మంది ప్రజల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు మాజీ జెడ్పిటిసి సభ్యులు భూపల్లి నరసింహారావు, చర్ల ఎంపిడిఓ ఈదయ్య, బోళ్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిధులకు హాజరై మాట్లాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాటి వీరాంజనేయులు, గాదె నర్సిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ తోకల అనిత, మాజీ వార్డ్ నెంబర్ కనుక సీతయ్య, ధనుగూరు నాగేశ్వరరావు, కేసుపాక రమణ ,కాకర్ల రమణయ్య, పసుపులేటి సత్యనారాయణ, నస్పూరు లక్ష్మీనారా యణ, గండూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి : భారత దేశంలో 21వ శతాబ్దంలో జన్మించిన గొప్ప సంఘసంస్కర్త, ఓ శక్తివంతమైన చైతన్య దీప్తిగా అంబేద్కర్ ను ఆళ్ళపల్లి కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి, సీనియర్ నాయకులు తులం ముత్తిలింగం, కరకపల్లి సుధాకర్ అభివర్ణించారు. ఈ మేరకు వారు మండల కేంద్రంలో ఆదివారం అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బూరుగడ్డ నాగేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నులకతాటి శ్రీను, గాడుదుల దాసు, బొబ్బిలి రామనర్సయ్య, షేక్ నాగూర్, కల్తి నరేందర్, వజ్జ చంటి, తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : మండల కేంద్రం దమ్మపేట సిపిఎం పార్టీ కార్యాలయంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జారె అంబేద్కర్ విగ్రహానికి మండల కార్యదర్శి మోరంపూడి శ్రీననివాసరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు దొడ్డ లక్ష్మినారాయణ, మండల కమిటి సభ్యులు భోగ్యం నర్సింహారావు, కొప్పుల శ్రీనివవాసరావు, శీలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట



కొత్తగూడెం



అశ్వాపురం



కొత్తగూడెం



ఆళ్ళపల్లి

బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే..

- హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం
- ప్రజలను మభ్యపెట్టి.. మోసం చేయడమే వారి నైజం: మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు



నవతెలంగాణ-జహీరాబాద్

హామీల అమలులో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని, దొందూ దొందే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం.. ఎన్నికల అనంతరం ప్రజలను నట్టేట ముంచడమే కాంగ్రెస్, బీజేపీ నైజమన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను విపరీతంగా పెంచి.. సామాన్యుల నడ్డి విరించిందన్నారు. యువతకు 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. జహీరాబాద్ ఎంపీ స్థానం ఓడినంత మాత్రాన ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం పోదని.. గల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం పోదని.. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే హామీల అమలుకు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. రాష్ట్రం నుంచి వేలకోట్లలో పన్నులు వసూలు చేసిన బీజేపీ ప్రభుత్వం.. ఇచ్చేటప్పుడు మాత్రం మూలుక్కుంటూ ఇవ్వడంతో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలుపరచాలన్నారు. కేంద్రంలో బీజేపీ పదేండ్ల పాలనపై, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 4 నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్ ఉన్నాయని.. వాటన్నింటినీ కూడా వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇటీవలే 8 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అయ్యాయని.. వారి స్థానంలో నూతన రిక్రూట్‌మెంట్ చేయాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు. అలాగే, హామీల అమలుపై ఎక్కడ చర్చ పెట్టినా తాను సిద్ధమని, స్థలాన్ని కూడా వారే ప్రకటించాలని, ఈ చర్చకు ముఖ్యమంత్రి వస్తారా.. ఎవరొస్తారు అంటూ ప్రశ్నలు సంధించారు. ఈ నెల 16న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే కేసీఆర్ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, మహమ్మద్ తంజీం, గుండప్ప యాదవ్, షేక్ ఫరీద్, నామ రవి కిరణ్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై డివైడర్‌ను ఢీ కొట్టిన కారు

- ఇద్దరు యువకులు మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు

అతివేగమే ప్రమాదానికి కారణం

నవతెలంగాణ-రాజేంద్రనగర్

హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై అతి వేగంగా వచ్చిన కారును డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వెళ్తున్న కారు హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్‌పై డివైడర్‌ను ఢీ కొట్టి నాలుగు పల్టీలు కొట్టింది. ఆ సమయంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్ర గాయాలపాలైన ముగ్గురిని సమీపంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో మృతి చెందిన గౌతం(26), ఆనంద్(28) మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కారు అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని, అలాగే, కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మజ్లిస్ ఆగడాలను అడ్డుకుందాం

- పాతబస్తీలో సమస్యలపై పోరాడేది బీజేపీయే :

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



హైదరాబాద్: పాతబస్తీలో మజ్లిస్ అగడాలకు వ్యతిరేకంగా పోరాడేది బీజేపీయేనని ఆపార్టీరాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కాచిగూడ మాజీ కార్పొరేటర్ఎక్కాల చైతన్య కన్నా తన అనుచరులతో బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగాబర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంట్ లో బీజేపీ గెలువబోతుందన్న భయం పట్టుకున్న మజ్లిస్ పార్టీ అధినేత అసుద్దీన్ ఓవైసీ ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారని అన్నారు.

మజ్లిస్ పార్టీకి సిద్ధాంతాలు, నియమాలు అంటూ ఏవీ ఉండవని, అధికారంలో ఉన్న పార్టీకి మద్దతు తెలుపుతూ తమ గుండాగిరిని, అవినీతి అక్రమాలను కొనసాగిస్తుందన్నారు.

కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లాఅధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు, పిఎల్ శ్రీనివాస్, ఎక్కాల కన్నాసి. నందకిషోర్ యాదవ్, ఎక్కాల నందు, ఎ. అజయ్ కుమార్, వనం రమేష్, రాజశేఖర్ రెడ్డి,ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఆరవింద్, కృష్ణ కుమార్, శీర్సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ వార్.....మిస్ ఫైర్!



వైరలవ్వాలి..బద్నాం చేయాలి

- గోరంతలు కొండతలుగా చిత్రీకరణ
- అభ్యర్థులు సైతం వార్ రూమ్‌లు తెరుస్తున్న వైనం
- పలుకుబడి ఉన్న యూట్యూబర్లు, గ్రూప్ అడ్మిన్ల కోసం వెతుకులాట

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో సోషల్ మీడియా వేదికగా పొలిటికల్ వార్ అదుపు తప్పుతోంది. ఎదుటి వారి మాటలు, ప్రచారాలు, తప్పొప్పులను పట్టేసి వాటికి మసాలాలు జోడించి కొందరు యూట్యూబర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. గొరంతల్ని కొండంతలుగా చిత్రీకరిస్తూ... ప్రత్యర్థి పార్టీలు, అభ్యర్థులపై ఏహ్యాభావం, తమ వారిపై సానుకూల దక్పథం కలిగేలా సినిమా దశ్యాలను, ఫొటోలను జోడించి ఊదర గొడుతున్నారు. ఇందు కోసం పార్టీలతో పాటు అభ్యర్థులు సైతం వార్ రూంలను తెరుస్తున్నారు. పలుకుబడి ఉన్న యూ ట్యూబర్లు, గ్రూప్ అడ్మిన్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారు.లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ స్థాయిలోనే కాకుండా, అభ్యర్థులు సైతం వార్ రూంలను తెరుస్తున్నారు. వార్తా పత్రికలు, టీవీ చానళ్లలో ప్రసారానికి వీలులేని బూతులు, వివాదాస్పద వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల్లో యథేచ్ఛగా పోస్ట్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఏర్పడ్డ కరువుపై ఆన్‌లైన్ సాక్షిగా రచ్చ జరుగుతోంది. కాలం తెచ్చిన కరువని కాంగ్రెస్ అంటుంటే, ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువని బీఆర్ఎస్ ఏకి పారేస్తోంది. పంటల సాగు, నీటి ఎద్దడి, కరవు, రైతు ఆత్మహత్యలు, తాగునీటి సమస్యలు, ఎండిపోయిన జలాశయాలు, వర్షాభావం తదితర సమాచారం, చిత్రాలు, వీడియోలను పోస్టు చేసి ప్రత్యర్థులకు ఊపిరిసలపకుండా చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య సోషల్ మీడియా వేదికగా ప్రచారం పీక్ స్టేజికి చేరుకుంది. మాటల తూటాలు, విమర్శల బాణాలు, బూతుపురాణాలు జోరందుకుం టున్నాయి. గతేడాది చివర్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రచారం తీరు తారస్థాయికి చేరినా.. వ్యాఖ్యల తీవ్రత ఇప్పటిలా లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కోర్టు కేసులు, అరెస్ట్‌లకు సంబంధించి పలు చిత్రాలు, వ్యాఖ్యలను కొన్ని పార్టీల నాయకులు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ఉన్న అభ్యర్థులు అంది వచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని వదులు కోవడం లేదు. ఫలితంగా తెలంగాణలో ఎన్నికల ప్రచారం క్షేత్రస్థాయిలో కంటే సోషల్ మీడియా వేదికగానే ఎక్కువగా యుద్ధ రంగాన్ని తలపిస్తోంది.

యూట్యూబ్ ఛానళ్లకు పెరిగిన గిరాకీ

సోషల్ మీడియా వేదికగా యూట్యూబ్, వాట్సాప్,ఎక్స్(ట్విట్టర్),ఇన్‌స్టాగ్రామ్,టెలిగ్రామ్ తదిత ర



సామాజిక మాధ్యమాల్లో ప్రచారానికి స్పందన ఎక్కు వగా ఉండటంతో పార్టీలు, అభ్యర్థులు వాటిపై ఆధార పడుతున్నారు.ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉన్న గ్రూపులు,యూట్యూబ్ వార్తా ఛానళ్లకు గిరాకీ పెరిగింది. గత ఎన్నికల్లో కేటీఆర్, రేవంత్‌రెడ్డి తదితర ముఖ్యనేతలు ప్రత్యేక ఇంటర్వ్యూలకు ప్రాధాన్యం ఇచ్చారు. బీజేపీ,కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సొంతంగా వార్‌రూంలు ఏర్పాటు చేసుకొని ప్రచారం చేస్తుండటం తో పాటు ఎంటర్‌టైన్‌మెంట్, పొలిటికల్ కార్యక్రమాల ను ప్రసారం చేసే యూట్యూబ్ ఛానళ్లకు పెద్ద మొత్తాలు ఇచ్చి ఒప్పందాలు చేసుకుం టున్నాయి. వాట్సప్, ఇన్‌స్టా, సిగ్నల్ వంటి సామాజిక యాప్‌లలో ఎక్కువ మంది సభ్యులు ఉన్న గ్రూపుల అడ్మిన్లను కూడా తికిపట్టుకుంటున్నారు.

శాసనసభ ఎన్నికల్లో సహకరించిన వారితోపాటు కొత్తవారి కోసం అన్వేషి స్తున్నారు.ప్రసారం చేయాల్సిన కంటెంట్‌ను పార్టీలు, నాయకులే రూపొందించి ఇస్తున్నారు.తాము కోరుకు న్న సమయంలో వాటిని యూట్యూబర్లు,గ్రూప్‌ల అడ్మిన్లు వారి సామాజిక మాధ్యమాలలో పోస్టు చేయా లని సూచిస్తున్నారు. అవకాశం ఉన్న ప్రతి అంశాన్ని వదిలి పెట్టకుండా సోషల్ మీడియా వేదికగా అభ్యర్థు లు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

టెన్షన్..టెన్షన్

టెల్అవీవ్: సిరియాలోని తమ దౌత్య కార్యాలయంలో ఇద్దరు జనరల్స్‌తో సహా ఏడుగురు సైనిక అధికారులను హతమార్చిన యూదు రాజ్యం దాడికి ప్రతీకారంగా ఇరాన్ డజన్ల కొద్దీ క్షిపణులు, కమికేజ్ డ్రోన్లతో ఆదివారం తెల్లవారు జామున దాడులు చేసింది. టెల్ అవీవ్, పశ్చిమ జెరూసలెం సహా ఇజ్రాయిల్ అంతటా పేలుళ్ల శబ్దాలు, వైమానిక దాడుల సైరన్లు వినిపించాయని వార్తా సంస్థలు తెలిపాయి. ఇజ్రాయిల్ రక్షణ బలగాల ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియర్ హగారియా ఈ విషయాన్ని ఆదివారం నాడిక్కడ మీడియాకు వివరించారు.

ఇరాన్ ప్రయోగించిన 300కిపైగా క్షిపణులు, డ్రోన్లలో 99 శాతం వరకు లక్ష్యాన్ని చేరుకోక ముందే తాము కూల్చేశామని అన్నారు. డమాస్కస్‌లోని తమ కార్యాలయంపై ఈ నెల1న ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడికి వన్ టైమ్ పనిష్మెంట్ పూర్తి చేశామని ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖొమేనీ వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ మరోసారి ఇటువంటి తప్పు చేయకుండా ఉండేందుకు ఇదొక హెచ్చరిక అని ఆయన అన్నారు. ఈ దాడిపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ఎక్స్‌లో (పూర్వ ట్విట్టర్‌లో) స్పందిస్తూ ఇరాన్ దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టామని అన్నారు. ఇరాన్ చర్యకు ప్రతీకారం పేరుతో ఇజ్రాయిల్ దాడి చేసిన పక్షంలో దానికి తన మద్దతు ఉండబోదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నెతన్యాహుకు స్పష్టంగా తెలియజేసినట్లు పేరు తెలపడానికి ఇష్టపడని వైట్ హౌస్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. దెబ్బకు దెబ్బ అనే రీతిలో వ్యవహరిస్తే, అది ప్రాంతీయ యుద్ధానికి దారితీసే ప్రమాదముందని, దాని పర్యవసానాలు చాలా భయంకరంగా ఉండే అవకాశముందని అమెరికా ఆందోళన చెందుతున్నది. దీనికి సమ్మయంతో దౌత్యపరమైన గట్టి రియాక్షన్ ఇద్దామని బైడెన్ నెతన్యాహుతో అన్నట్లు వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం దీనిపై జి-7 అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బైడెన్ తెలిపారు.

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిపి ఇరాన్ చర్యను ఖండించాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేసింది. సిరియాలోని ఇరాన్ కాన్సులేట్‌పై కార్యాలయంపై ఇజ్రాయిల్ దాడిని ఖండించడానికి ఇష్టపడని అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఇతర పశ్చిమ దేశాలు ఇరాన్ ప్రతీకార దాడిని మాత్రం వెంటనే ఖండించాయి. చైనా, రష్యా ఆచితూచి స్పందించాయి. ఇరు పక్షాలు సంయమనం పాటించాలని చైనా కోరింది. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెరస్ ఇరాన్ దాడిని ఖండించారు. మరో యుద్ధాన్ని భరించగలిగే స్థితిలో ప్రపంచం ఇప్పుడు లేదని, ఘర్షణలకు వెంటనే స్వస్తి పలకాలని ఆయన కోరారు.

ప్రశ్నార్థకంగా మారిన భారతీయుల భద్రత?

ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఘర్షణ మరింత విస్తరించిన పక్షంలో అది ప్రాంతీయ యుద్ధానికి దారి తీసే ప్రమాదముండడంతో ఇజ్రాయిల్‌లోని భారతీయుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. శనివారం ఇరాన్ రివల్యూషనరీ గార్డులు ఇజ్రాయిలీ సరుకుల రవాణా నౌకను హర్మూజ్ జలసంధిలో స్వాధీనం చేసుకున్న ఘటనలో 17 మంది భారతీయులు బందీలుగా ఉన్నారు. వారి విడుదలకు భారత విదేశాంగ శాఖ దౌత్య పరమైన మార్గాల గుండా చేస్తున్న యత్నాలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. తాజా పరిణామం తరువాత పెరుగుతున్న యుద్ధ భయం నేపథ్యంలో ఇజ్రాయిల్‌లో భారతీయుల భద్రతపై ఽఅనుమానాలు తలెత్తుతున్నాయి. ఇజ్రాయిల్ రాయబార కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని విదేశాంగ శాఖ సూచించింది.

సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేద్కర్

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమసమాజ స్థాపన కోసం చేసిన కృషి మరువలేనిదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. అణగారిన వర్గాలకు రిజర్వేషన్లను కల్పించి సమసమాజ స్థాపనకు కృషి చేశారని కొనియాడారు. హైదరాబాద్‌లోని తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ అనుసరించిన మార్గం నేటికీ ఆదర్శనీయంగా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషి అన్నారు. ప్రపంచంలో పలు దేశాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకున్నప్పుడు అంబేద్కర్ ఏర్పాటు చేసిన ఆర్‌బీఐ, ఫైనాన్స్ కమిషన్ లాంటివి మార్గదర్శకమయ్యాయన్నారు.

జస్టిస్ గిరిజా ప్రియదర్శిని, జస్టిస్ నగేశ్ భీమపాక ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మెన్ ఏ.నరసింహారెడ్డి, హెచ్‌సీఏఏ అధ్యక్షులు అయ్యాడపు రవీందర్‌రెడ్డి, ఏఎస్‌జీ నరసింహ శర్మ, డీఎస్‌జీ గాడి ప్రవీణ్‌కుమార్, పీపీ నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు సునీల్‌గౌడ్, మాజీ ఏజీ బీఎస్ ప్రసాద్, హెచ్‌సీఏఏ ఉపాధ్యక్షురాలు ఏ.దీప్తి, కార్యదర్శులు ఉప్పల శాంతిభూషణ్‌రావు, సంజీవ్ జిల్లెల, జాయింట్ సెక్రటరీ వాసిరెడ్డి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రాముడి పేర బీజేపీ ఓట్ల రాజకీయం

- పదేండ్లలో ప్రజలకు బీజేపీ చేసిందేమీ లేదు: బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పార్లమెంట్ ఎన్నికలపై నోవాటెల్ హోటల్‌లో సమీక్ష
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హాజరు



నవతెలంగాణ-శంషాబాద్

ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ పదేండ్ల పాలనలో దేశంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని, రాముడి పేరుతో బీజేపీ ఓట్ల రాజకీయం చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్‌లో కాంగ్రెస్ కీలక నేతలతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఇంకా ఖరారు చేయని ఎంపీ సీట్లు, బీజేపీ, బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో ఎదుర్కొనే అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో బీజేపీ పుల్వామా ఘటనను ఆధారం చేసుకుని అధికారంలోకి వచ్చినట్టు స్వయంగా ఆ పార్టీ నేతలు ప్రకటించారని గుర్తుచేశారు. ప్రస్తుత ఎన్నికల్లో రాముని పేరుతో ఓట్ల రాజకీయాలకు తెరలేపిందని, అయోధ్య రామాలయం నిర్మాణం పూర్తి కాకముందే బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన చేశారని తెలిపారు. అక్కడ సౌకర్యాలు కల్పించకుండా మూడు కిలోమీటర్ల మేర ప్రజలను నడిపించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. మోడీకి తాను చేసిన అభివృద్ధి గురించి చెప్పుకునే పరిస్థితి లేదని, అందుకే ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు రాముడిని రాజకీయాల్లోకి లాగుతున్నారని అన్నారు. రాముడి పట్ల ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి విభేదాలు లేవని, కానీ ప్రజలకు కావాల్సిన విద్యా వైద్యానికి వాళ్ల చేసిన మేలు ఏందో చెప్పాలని అన్నారు. రైతు నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మతతత్వ రాజకీయాలను పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా దేశంలో ఐదు గ్యారంటీలు అమలు చేయడానికి కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకునే చర్యల గురించి సమగ్రంగా చర్చిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కీలక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రాజకీయ సమర్థుడు

- బీజేపీలోకి వస్తే ఫ్రెండ్‌గా స్వాగతిస్తా
- కాంగ్రెస్‌లోనే ఉంటే అసమర్థుడైపోతాడు
- పార్టీలో ఫస్ట్‌ప్లేస్ ఇస్తారా? లేదా? అనేది పెద్దల ఇష్టం : చిట్‌చాట్‌లో బీజేపీ ఎంపీ డి.అర్వింద్‌కుమార్ హాట్ కామెంట్స్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలు మారినా ఒక్కో మెట్టు ఎక్కుతూ రాజకీయంగా ఎదిగిన సమర్థుడని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదనీ, ఇంకా 15 ఏండ్ల రాజకీయ జీవితమున్న ఆయన ఆ పార్టీలో ఉంటే అసమర్థుడైపోతాడని అన్నారు. ఆయన బీజేపీలోకి వస్తే ఒక ఫ్రెండ్‌గా స్వాగతిస్తానని చెప్పారు. తమ పార్టీలోకొస్తే ఫస్ట్ ప్లేస్ ఇస్తారా? లేదా? అనేది పార్టీ పెద్దల చేతుల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈసారి కవిత బరిలో లేకపోవడంతో నిజామాబాద్‌లో లిక్కర్ ఫ్రీ ఎన్నికలు జరుగుతాయంటూ వ్యాఖ్యానించారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ పెద్దలు రైతు బంధు డబ్బులను తమ కోసం తరలించుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలపై క్లారిటీ లేదనీ, రేవంత్‌రెడ్డి చేద్దామన్నా అక్కడ బడ్జెట్ లేదని చెప్పారు. బీఆర్ఎస్ లాగానే.. కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను పచ్చిగా మోసం చేసిందని విమర్శించారు. వడ్లను రైతులెవ్వరూ అమ్ముకోవద్దనీ, తాను వచ్చాక రూ.500 బోనస్ ఇస్తానని రేవంత్‌రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రైతులకు బోనస్ ఇవ్వడానికి ఇంకా డిసెంబర్ 9 రాలేదా? అని ప్రశ్నించారు. వరి ధాన్యాన్ని కూడా సరిగా కొనడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలతో ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదనీ, పనికిమాలినోళ్లకు టికెట్లు ఇచ్చారని దెప్పిపొడిచారు. దేశంలో కాంగ్రెస్‌కు 30 సీట్లు కూడా దాటవన్నారు. ట్యాపింగ్ విషయంలో తప్పు చేస్తే జైళ్లో వేయాలిగానీ రోజుకోఅంశంపై మాట్లాడటమేంటని ప్రశ్నించారు. ఆప్‌కీ అదాలత్‌ను రెండు దశాబ్దాలుగా చూస్తున్నాననీ, రేవంత్‌రెడ్డి షో బాలీవుడ్ కమెడీయన్ రాజ్‌పాల్ యాదవ్ షోలాగా అనిపించిందని ఎద్దేవా చేశారు. సుపారీ గురించి అడగ్గా...పొద్దున ఒక ల్యాండ్ గురించి మాట్లాడి సాయంత్రం సెటిల్‌మెంట్ చేసుకోవడమే సుపారీనా? అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అలాంటి సెటిల్‌మెంట్లు రేవంత్‌రెడ్డికి బాగా తెలుసునని చెప్పారు. భవిష్యత్తు లేని కాంగ్రెస్‌లోకి తాను పోతానని కేటీఆర్‌కు ఎలా అనిపించిందోనన్నారు. ఏం చెప్పాలో అర్థంకాక నిజామాబాద్‌లో జీవన్‌రెడ్డి ఆజాదీ అంటూ తిరుగుతున్నాడని విమర్శించారు.

బీజేపీకి రెండు సీట్లు మాత్రమే వస్తాయని రేవంత్‌రెడ్డి చెప్పకుంటే ఆయన జాబ్ పోతుందనీ, అందుకే అలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ బిడ్డ దగ్గరకు ఈడీ వచ్చిందని.. ప్రతి దగ్గరికీ ఈడి పోదని అన్నారు. తాను పసుపు మార్కెట్ పెంచితే.. పదేండ్లలో మీరు డ్రగ్స్ మార్కెట్ పెంచారా? అంటూ కేటీఆర్‌కు చురకలు అంటించారు. దేశవ్యాప్తంగా మూతపడిన 66 షుగర్ ఫ్యాక్టరీలను బీజేపీ తెరిపించిందనీ, అవన్నీ లాభాల్లో ఉన్నాయని చెప్పారు. కేసీఆర్‌కు బిడ్డమీద ఉన్న ప్రేమ నిజాం షుగర్ ఫ్యాక్టరీపై ఉంటే అది ఎప్పుడో తెరుచుకునేదన్నారు.

ఎక్స్ యూజర్లకు ఎలాన్ మస్క్ షాక్..

- భారత్‌లో 2 లక్షలకుపైగా ఖాతాలు బ్యాన్



న్యూఢిల్లీ: దేశంలో ఎక్స్ యూజర్లకు ఎలాన్ మస్క్ షాకిచ్చారు. భారత్‌లోని 2 లక్షల మందికిపైగా ఖాతాదారుల అకౌంట్లను 'ఎక్స్ కార్ప్' బ్లాక్ చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, అశ్లీలత, ఉద్రిక్తతలను ప్రోత్సహించే కంటెంట్ కట్టడిలో భాగంగా మార్చి నెలలో ఏకంగా 2,12,627 ఖాతాలపై నిషేధం విధించినట్టు ప్రకటించింది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 25 వరకు భారతీయ సైబర్‌స్పేస్‌లో ఉగ్రవాదాన్ని ప్రచారం చేసినందుకుగాను 1,235 ఖాతాలను తొలగించినట్టు తెలిపింది. కొత్త ఐటీ నిబంధనల మేరకు చర్యలు తీసుకున్నట్టు తన నెలవారీ నివేదికలో పేర్కొంది.మొత్తంగా ఈ రిపోర్టింగ్ సైకిల్‌లో దేశవ్యాప్తంగా 2,13,862 ఖాతాలపై నిషేధం విధించినట్లు తెలిపింది. భారతీయ వినియోగదారుల నుంచి 5,158 ఫిర్యాదులు అందాయని, తమ గ్రీవెన్స్ రెడ్రెసల్ మెకానిజం ద్వారా వాటిని పరిష్కరించామని వెల్లడించింది. వాటిలో ఎక్కువగా నిషేధాన్ని తప్పించుకోవడం (3,074), అడల్ట్ కంటెంట్ (953), విద్వేషాన్ని రెచ్చగొట్టడం (412), వేధింపులకు (359) సంబంధించినవి ఉన్నాయని తెలిపింది. కాగా, జనవరి 26 నుంచి ఫిబ్రవరి 25 వరకు ముగిసిన నెలలో 5,06,173 మంది ఖాతాలను ఎక్స్ నిషేధించిన విషయం తెలిసిందే.

అన్నదాతల గోస ?

(మొదటిపేజీ తరువాయి)

మద్దతు (ఎంఐఎస్-పీఎస్ఎస్)పై కేంద్రం మౌనం వహిస్తోందని నివేదిక చెప్పింది. ఎంఎస్‌పీ ఆధారిత సేకరణకు ఈ పథకమే కీలకం అవుతుంది. అయితే గత రెండు సంవత్సరాలుగా ఈ పథకంలో కోత పెడుతున్నారు. బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ పథకానికి 2022-23లో రూ.1,500 కోట్లు కేటాయించగా అది 2023-24, 2024-25లో దారుణంగా రూ.0.01 కోట్లకు తగ్గిపోయింది.

ప్రతి రోజూ 30 ఆత్మహత్యలు

2023-24 ఖరీఫ్ సీజన్‌కు ప్రకటించిన కనీస మద్దతు ధర సహేతుకంగా కానీ, గిట్టుబాటు అయ్యేలా కానీ లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం మాట అటుంచి పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులు, సహేతుకంగా లేని ఎంఎస్‌పీ...వెరసి చిన్న, సన్నకారు రైతులను, మధ్య తరగతి రైతులను, కౌలుదారులను రుణాల ఊబిలోకి నెట్టేశాయి. ఇక మోడీ ప్రభుత్వం చేస్తున్న మరో వాదన ఏమిటంటే 2013లో అప్పుల భారంతో అల్లాడుతున్న రైతులు 52%గా ఉండగా 2019 నాటికి 60.2%కి తగ్గిపోయారట. ఇందులో వాస్తవం ఎంతుందో చూద్దాం. 2014 నుండి 2022 వరకూ నరేంద్ర మోడీ పాలనలో దేశంలో 1,00,474 మంది అన్నదాతలు బలవన్మరణానికి పాల్పడ్డారని ఇటీవల విడుదలైన జాతీయ నేర రికార్డుల బ్యూరో నివేదిక తెలియజేసింది. అంటే ఈ తొమ్మిదేండ్లలో రోజుకు సగటున 30 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

శుష్క వాగ్దానాలు, విఫలమైన పథకాలు, అరకొర కేటాయింపుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఓ పథకం ప్రకారం అన్నదాతలను నిర్లక్ష్యం చేయడమే ఆత్మహత్యలు పెరగడానికి కారణమని రిపోర్ట్ కార్డ్ స్పష్టం చేసింది. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-24 మధ్యకాలంలో రైతుల ఆత్మహత్యలు 10,281 నుండి 11,290కి పెరిగాయి. ఇది గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాచారమే. ఇక బలవన్మరణానికి పాల్పడుతున్న వ్యవసాయ కార్మికుల సంఖ్య మరింత అధికంగా ఉంటోంది. ఈ సంఖ్య 4,324 నుండి 6,083కి...అంటే 41% పెరిగింది. మహారాష్ట్రలోని విదర్భ, మరట్వాడా ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

ఈ హామీల మాటేమిటి?

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కి జవసత్వాలు కల్పిస్తామని కూడా నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. 2022-23 నాటికి వ్యవసాయ ఎగుమతులను వంద బిలియన్ డాలర్లకు పెంచుతామని చెప్పారు. పాడైపోయిన వ్యవసాయ ఉత్పత్తుల కోసం అగ్రి-రైల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఆ మాటేమో కానీ గత ఐదేండ్లలో ఆయన అనేక వందేభారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. చిన్న, సన్నకారు రైతులకు నెలకు రూ.3,000 పెన్షన్ ఇస్తామని కూడా ఊరించారు. అది నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ఉపాధి హామీ బడ్జెట్ కుదింపు

వ్యవసాయం, రైతుల సంక్షేమంపై ప్రభుత్వ ఖర్చు, అలాగే బడ్జెట్ కేటాయింపులు నానాటికీ తగ్గిపోతున్నాయి. 2014-15, 2021-22 మధ్యకాలంలో వ్యవసాయ కార్మికులు సహా రైతన్నల వేతనాల వృద్ధి రేటు 1 శాతం కంటే తక్కువగానే ఉంది. ఇక గ్రామీణ ఉపాధి హామీ పథకం విషయానికి వస్తే ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని ప్రవేశపెట్టడంతో 57 శాతం మంది కార్మికులపై ప్రభావం పడింది. పైగా ఈ పథకానికి గత కొన్ని సంవత్సరాలుగా కేటాయింపులు తగ్గిపోతున్నాయి. 2014-15 బడ్జెట్‌లో ఈ పథకానికి 1.85 శాతం నిధులు కేటాయించగా 2023-24లో 1.33 శాతం మాత్రమే కేటాయించారు. ఉపాధి పథకానికి ఇంత తక్కువ బడ్జెట్ కేటాయించడం అదే మొదటిసారి. గత సంవత్సరం బడ్జెట్‌లో రూ.60,000 కోట్లు కేటాయించారు. అంతకుముందు సంవత్సరపు జీడీపీలో చూసుకుంటే ఇది 33 శాతం తక్కువ. సవరించిన అంచనాలను రూ.86,000గా చూపారు. అయితే 2024-25 అంచనాలలో ఆ పెరుగుదలను చూపలేదు. వీటన్నింటికీ తోడు ఆదేశాలు పాటించనందుకు పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం రూ.7,000 కోట్లు బకాయి పడింది. ఇందులో రూ.2,800 కోట్ల వేతన బకాయిలు కూడా ఉన్నాయి. పేద కార్మికులను శిక్షించాల్సిన అవసరం ఏమొచ్చింది? వారి వేతనాలు లాక్కోవాల్సిన అగత్యం ఏం ఏర్పడింది?


గ్రామీణ రుణాలు తక్కువే

ఎంతో ప్రాచుర్యం కల్పించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు రూ.14,600 కోట్లు కేటాయించారు. అయితే ఇందులో చాలా భాగం బీమా కంపెనీల జేబుల్లోకే వెళ్లాయి. ఉదాహరణకు 2022-23 రబీ సీజన్‌లో 7.8 లక్షల మంది రైతుల క్లెయిములకు సంబంధించి చెల్లించింది కేవలం రూ.3,878 కోట్లు మాత్రమే. ఇక రైతు రుణాల విషయానికి వస్తే బ్యాంకుల పట్టణ, మెట్రోపాలిటన్ బ్రాంచీల ద్వారా అనేక రుణాలు మంజూరు చేశారు. ఇవి మొత్తం రుణాలలో మూడో వంతు ఉన్నాయి. గ్రామీణ బ్రాంచీల ద్వారా ఇచ్చిన రుణాలు తక్కువే. 2019 ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల వరకూ వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదు.

విధానాలు మారాలి

ఓ వైపు వాతావరణ మార్పులు, మరోవైపు వాతావరణ పరిస్థితుల కారణంగా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. ఆర్థిక భారాలు, ఉత్పాదక ఖర్చులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా అన్నదాతలు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకుంటేనే గ్రామీణ ప్రాంతాల్లో అన్నదాతల మరణ మృదంగాన్ని ఆపేయగలమని రిపోర్ట్ కార్డ్ తెలిపింది. ఏదేమైనా సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రైతన్నల ఆగ్రహ జ్వాలలు మిన్నుముట్టే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ద్రాక్షతో జర జాగ్రత్త..?



ద్రాక్ష పండ్లను అందరూ ఇష్టంగా తింటారు. నీటి శాతం ఎక్కువగా ఉండే ద్రాక్షని తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సలహా ఇస్తున్నారు. కానీ, ద్రాక్షను మామూలు నీటితో కడిగిన తర్వాత తిన్నా ప్రమాదమేనని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. సాధారణ నీటితో వీటిని కడిగితే వాటిపై ఉండే బ్యాక్టీరియా, కెమికల్స్ పోవని వైద్యులు చెబుతున్నారు. వెనిగర్, బేకింగ్ సోడా కలిపిన నీటిలో పావు గంట సేపు ద్రాక్షని నానబెట్టాలి. ఆ తర్వాత మళ్లీ నాలుగైదుసార్లు నీటితో కడగాలి. ఆపై వీటిని టిష్యూ పేపర్స్‌పై కానీ లేదా.. మెత్తటి వస్త్రంపై వేసి బాగా ఆరనివ్వాలి. అవసరాలకు తగ్గట్టుగా ఎయిర్‌టైట్ కంటైనర్‌లో పెట్టి ఫ్రిజ్‌లో అయినా పెట్టుకుంటే కొద్దిరోజులు తాజాగా ఉంటాయి. వీటి రుచిలో కూడా ఎటువంటి తేడా ఉండదు. ఇలా శుభ్రం చేసిన ద్రాక్షను తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

అమ్మలు ఉద్యోగాలకు అర్హులే..



అమ్మైన తర్వాత ఉద్యోగాలు చేయడం మహిళలకు ఓ సవాల్ లాంటిదే. ఒత్తిడితో కూడిన జీవితాన్ని సమతుల్యం చేసుకోలేక తమ కెరీర్‌కు దూరం కావడమో లేదా కొంత కాలం విరామమివ్వడమో చేస్తుంటారు. తిరిగి ఉద్యోగంలో చేరడం అంత సులభం కాదు. అలాంటి అర్హత కలిగిన గృహిణులకు ఉద్యోగాలు, ఆర్థిక స్వేచ్ఛను ఇస్తున్న మహిళా పారిశ్రామికవేత్త శంకరి సుధార్. చెన్నైకి చెందిన ఆమెకు 'స్టార్టప్ ఓవర్‌క్వాలిఫైడ్ హైజ్‌వైవ్స్' స్థాపించాలనే ఆలోచన ఎందుకు, ఎలా వచ్చిందో తెలుసుకుందాం...

సాఫ్ట్‌వేర్ ఇంజనీరైనా శంకరి సుధార్ ఐటి మేజర్‌తో కలిసి పనిచేస్తున్నప్పుడు ఆమె జీవితం మలుపు తిరిగింది. మహమ్మారి సమయంలో ఆమెకు బిడ్డ పుట్టింది. సంస్థ ఆమెకు మద్దతు ఇచ్చినప్పటికీ అప్పుడే తల్లి అయిన ఆమె పని ఒత్తిడి వల్ల చాలా నీరసించేది. ఆ అలసటను భరించలేక పోయింది. దీని వల్ల సిజేరియన్ బాధ నుండి కోలుకోలేకపోయింది. దానికి తోడు ప్రసవానంతర డిప్రెషన్ ఆమెను నిరుత్సాహపరిచింది.



దీంతో ఎనిమిదేండ్లు తన ఉద్యోగాన్ని వదిలేసి సొంతగడ్డపై దృష్టి పెట్టింది. అయితే పరిస్థితి మరింత దిగజారింది. 'నేను పని నుండి నిష్క్రమించాలని, విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు అంతా బాగానే ఉంటుందని అనుకున్నాను. అయితే నేను ఏమీ చేయకుండా నా సామర్థ్యాన్ని వృధా చేస్తున్నాననే భావన నన్ను ప్రతిరోజూ కుంగదీసేది. ఒక విచిత్రమైన శూన్యతను అనుభవించాను' అని మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి పట్టభద్రుడైన సుధార్ అంటుంది.

నేను ఒంటరిగా లేనని...

తనకు అనుకూలమైన పని వెతకడం ప్రారంభించింది. అయితే చాలా కంపెనీలు ఆమెను అంగీకరించలేదు. ఫ్రీలాన్సింగ్ వెబ్‌సైట్ల ద్వారా కూడా ప్రయత్నించింది. అయితే అక్కడ విపరీతమైన పోటీ ఉంది. 'నేను ఎప్పుడూ కోపంగా, భావోద్వేగంతో ఉండేదాన్ని. ఒక రోజు పత్రికలో ఒక వార్త చదివాను. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో గృహిణులు భారతదేశంలోనే ఉన్నారు. అప్పుడు నేను ఒంటరిగా లేనని అర్థం చేసుకున్నాను. స్త్రీలకు చాలా తక్కువ అవకాశాలు వస్తున్నాయి' ఆమె చెప్పింది. దీని గురించే తన తోటివారితో చర్చిస్తున్నప్పుడు, చాలా మంది స్త్రీలు ఇదే పరిస్థితిలో ఉన్నారని, వారి అర్హతలు ఎందుకు పనికిరావని బాధపడడం ఆమె గమనించింది.

తిరిగి ప్రవేశించడానికి

'చాలా మంది మహిళలు ఉద్యోగాలకు అర్హులు. కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా ఉన్న మహిళలను యాజమాన్యం తీసుకోవాలనుకుంటుంది. అయితే వారు కొంత వెసులుబాటు కలిగి ఉంటే మాత్రమే. కంపెనీలు సమయం, ప్రదేశ సౌలభ్యాన్ని అందించగలిగితే, అవకాశాల కోసం సిద్ధంగా ఉన్న నైపుణ్యం కలిగిన మహిళలతో వాటిని కనెక్ట్ చేయవచ్చు' అని ఆమె ఓవర్ క్వాలిఫైడ్ హౌస్‌వైవ్స్ పుట్టుకను వివరిస్తుంది. ఆగస్ట్ 2022లో ప్రారంభించబడిన ఈ ఓవర్‌క్వాలిఫైడ్ హౌస్‌వైవ్స్ ఇప్పటి వరకు 600 మంది మహిళలకు అవకాశాలను అందించింది. 2,500 మంది మహిళలు వర్క్‌ఫోర్స్‌లో తిరిగి ప్రవేశించడానికి నైపుణ్యాన్ని ఇచ్చింది. 26,000 మంది మహిళలు తమ పేర్లను ఈ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేసుకున్నారు. ఇది వారిని 600 కంపెనీలతో కలుపుతుంది. ఇందులో ఎక్కువగా స్టార్టప్‌లు, SMEలు ఉన్నారు.

వేతనం తక్కువ ఇస్తామంటారు

సుధార్ తన వ్యక్తిగత పరిచయాలతో కొన్ని కంపెనీలను కలిసింది. అన్ని కంపెనీలు మహిళల పట్ల ఒకే విధమైన నిబద్ధతను ప్రదర్శించలేదు. 'ఇది మహిళలకు మాత్రమే వేదిక అయినందున చాలా తక్కువ జీతం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. నన్ను సంప్రదించిన ఒక వ్యక్తి తనకు కంటెంట్ రైటర్ కావాలని, నెలకు రూ. 5,000 చెల్లిస్తానన్నాడు. ఇలాంటి వారి చాలా మంది ఉన్నారు' ఆమె



చెప్పింది. అయితే మొదటి నుంచీ ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. సుధార్ తన ప్లాట్‌ఫారమ్‌లో డేటా ప్రాసెసింగ్, రీసెల్లింగ్ లేదా ఇన్సూరెన్స్ కొనుగోలు వంటి ఉద్యోగాలను చూడదు. మహిళల అర్హత కంటే చాలా తక్కువ చెల్లించడానికి ముందుకు వచ్చిన క్లయింట్‌లను ఆమె అంగీకరించదు. కంటెంట్ రైటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్, కస్టమర్ సర్వీస్ రోల్స్, అడ్మిన్ కార్యకలాపాల వంటి వాటితో ప్రారంభమైన ఈ ప్లాట్‌ఫామ్ ఇప్పుడు వ్యాపార అభివృద్ధి, టెస్టింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ వంటి వాటిల్లో మహిళలకు ఉద్యోగాలు కల్పిస్తుంది.

ఉద్యోగాలు, ఆర్థిక స్వేచ్ఛ

ఓవర్‌క్వాలిఫైడ్ హైజ్‌వైవ్స్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు మహిళలకు ఉద్యోగాలను కనుగొనడమే కాకుండా వారి ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందడంలో సహాయపడతాయి. కాలేజీ తర్వాత ఐటీ మేజర్‌లో చేరిన భాగ్యశ్రీ పెండ్లి చేసుకోవాలని కుటుంబ ఒత్తిడి కారణంగా నిష్క్రమించాల్సి వచ్చింది. ఏడేండ్ల తర్వాత ఆమె ఉద్యోగం పొందేందుకు కష్టపడుతోంది. 'ఓవర్ క్వాలిఫైడ్ గృహిణుల గురించి తెలుసుకుని పేరు నమోదు చేసుకున్నాను. నేను దేని కోసం వెతుకుతున్నానో నాకు కచ్చితంగా తెలియదు. కానీ నా అర్హతలు, అంచనాలకు సరిపోయే ఉద్యోగాన్ని కనుగొనడంలో నాకు సహాయం చేస్తున్నారు. వారు ఒక క్లయింట్‌తో ఇంటర్వ్యూని ఏర్పాటు చేశారు. నా కెరీర్‌ను మొదటి నుండి ప్రారంభించే అవకాశం నాకు లభించింది' ఆమె చెప్పింది.

మహిళలను ఆహ్వానిస్తున్నాం

చెన్నైకి చెందిన మార్టెక్ కంపెనీ 7 ఈగిల్స్ వ్యవస్థాపకులు అష్కర్ గోమెజ్ ప్లాట్‌ఫారమ్‌లోని ముగ్గురు మహిళలను నియమించుకున్నారు. 'మహిళలు ఎల్లప్పుడూ కష్టపడి, నేర్చుకోవాలనే ఆసక్తిని కలిగి ఉంటారు. అలాంటి వారికి ఒక నెలపాటు వివిధ విధులపై శిక్షణ ఇచ్చారు. వర్క్‌ఫోర్స్‌లో మళ్లీ చేరేందుకు మక్కువ చూపుతున్న మహిళల కోసం మేము వెతుకుతున్నాం. ఇప్పటికే సోషల్ మీడియాలో వారి నైపుణ్యాలు, ఉద్దేశాలు, సామర్థ్యాల గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్లాట్‌ఫామ్ నుండి ఎక్కువ మంది మహిళలను నియమించుకోవడానికి మేము సిద్ధంగా ఉన్నాము' అని ఆయన చెప్పారు. సుధార్ ప్లాట్‌ఫామ్‌లోకి మరింత మంది మహిళలను ఆహ్వానించాలనుకుంటుంది. నైపుణ్యం, రీస్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లపై దృష్టి సారించింది. అలాగే మహిళలు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించేలా మార్గనిర్దేశం చేయాలనుకుంటున్నారు. 'ఇది మరింత మంది మహిళలకు ఆర్థిక స్వేచ్ఛను అందించేందుకు సహాయపడుతుంది' అంటూ ఆమె ముగించారు.

నైపుణ్యం ముఖ్యం

స్త్రీలు 'పోషకులు, సంరక్షకులు, దాతలు' అనే నానుడి వల్ల ఆమె పిల్లలను చూసుకోవడం తన ప్రాథమిక కర్తవ్యంగా భావిస్తుంది. అధిక అర్హతలు ఉన్న తర్వాత కూడా మహిళలు తమకు తగ్గ పనిని పొందలేకపోతున్నారు. కంపెనీలు ప్రసూతి ప్రయోజనాలను అందజేసినా, పిల్లలు పుట్టిన తర్వాత మహిళల్లో పనికి సంబంధించిన నిబద్ధత తక్కువగా ఉంటుందని కొందరు నమ్ముతారు. కొన్ని కంపెనీలు పిల్లలున్న స్త్రీల ప్రొఫైల్‌లను తిరస్కరిస్తాయి. అలాంటి వారికి ఓవర్ క్వాలిఫైడ్ హైజ్‌వైఫ్స్ సహకరిస్తుంది. వివిధ రంగాలకు చెందిన నిపుణులతో రెగ్యులర్ సెషన్‌లను నిర్వహిస్తారు. మహిళలు విరామం తర్వాత కొత్త జ్ఞానం, నైపుణ్యాలను పొందడంలో సహాయపడతారు.

ఆమె ఆసక్తిపై ఆధారపడి

'మేము ఫ్రీలాన్సింగ్‌తో పాటు ఫుల్‌టైం ఉద్యోగాలు కల్పిస్తాం. అయితే ఇది ఉద్యోగం చేసే స్త్రీ ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. ఆమె తన సమయాన్ని 8-9 గంటలు ఇవ్వగలిగితే ఆమె దరఖాస్తు వేరే విధంగా ప్రాసెస్ చేయబడుతుంది. మా వద్ద ప్రక్రియ కూడా సులభం. ఆసక్తి ఉన్న మహిళలు తమ రెజ్యూమ్‌తో పాటు మా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు, వారి అనుభవాలు, ఇతర వివరాలు, కెరీర్ బ్రేక్‌కు గల కారణాలను జాబితా చేయవచ్చు. డేటా ఆధారంగా, అవసరమైనప్పుడు మేము వారిని పిలుస్తాము' అని ఆమె వివరిస్తుంది. ప్లాట్‌ఫామ్‌లో ఉద్యోగాల కోసం పీహెచ్‌డీలు చేసిన మహిళలు కూడా ఉన్నారని ఆమె అంటుంది. ఇది ఆమె హృదయం ద్రవించేలా చేసింది.

తగ్గిన అప్పులు.. పెరిగిన రీపేమెంట్లు..



(మొదటిపేజీ తరువాయి)

అప్పులు (రూ.17,618 కోట్లు) గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలు చెల్లించేందుకు కూడా సరిపోకపోవటం గమనార్హం. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన అప్పులకు వడ్డీలు కలిపి తిరిగి చెల్లించేందుకు గత 125 రోజుల్లో కాంగ్రెస్ సర్కార్ సగటున రోజుకు రూ.207 కోట్లు ఖర్చు పెట్టింది. దీన్నిబట్టే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ రకంగా గత ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా చేసిన అప్పులకు సంబంధించిన వడ్డీలు, కిస్తీలను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందని ఆర్థికశాఖ అధికారులు తెలిపారు. తద్వారా పదేండ్లలో రాష్ట్ర ఖజానాపై మోయలేనంతగా పెరిగిన రుణభారాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. వీటికి తోడుగా ప్రభుత్వం ప్రజోపయోగమైన నిర్మాణాలకు, పనులకు మరో రూ.5,816 కోట్లను మూలధన వ్యయంగా ఖర్చు చేసింది. గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా చేసినట్టుగా ఇప్పుడు అప్పుల జోలికి వెళ్లకుండా నియంత్రణ పాటిస్తున్నామని ఓ అధికారి వ్యాఖ్యానించారు. బడ్జెట్ పరిమితులకు లోబడి మార్కెట్ రుణాలు తీసుకోవటం ద్వారా ప్రణాళిక, ప్రణాళికేతర ఖర్చులకు సరిపడేలా సర్దుబాటు విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. మరోవైపు 2023 డిసెంబరు నుంచి ఇప్పటిదాకా నాలుగు నెలల వ్యవధిలో రేవంత్ సర్కార్ రూ.15,968 కోట్ల మేర అప్పులను తీసుకుంటే, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి (డిసెంబరు నుంచి ఏప్రిల్ నాటికి) బీఆర్ఎస్ సర్కార్ 19,569 కోట్లను, 2021-22లో రూ.26,995 కోట్ల మేర అప్పులను తీసుకోవటం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ (2024-25)లో రుణాలకు సంబంధించి రూ.59,625 కోట్లను అంచనా వేసుకోగా, ఇప్పటి వరకూ రూ.2,500 కోట్ల వరకూ రుణాలను తీసుకున్నామని ఆర్థిక శాఖ వర్గాలు వివరించాయి.

పెరిగిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి...

గతంతో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) పెరిగినందున ప్రభుత్వం రుణాలు తీసుకునే పరిధి పెరిగింది. జీఎస్డీపీ ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసుకుంటూ పరిమితంగానే అప్పులు చేస్తోంది. సాధారణంగా ప్రభుత్వాలు తాము చేసే రీపేమెంట్ల కంటే ఎక్కువ రుణాలు తీసుకుంటూ ఉంటాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం... తీసుకున్న రుణం కంటే ఎక్కువ కిస్తీలు చెల్లించిందని గణాంకాలు చెబుతున్నాయి. తెచ్చిన అప్పుల కంటే తిరిగి చేసిన చెల్లింపులు ఎక్కువగా ఉండటం ఆర్థిక క్రమశిక్షణకు అద్దం పడుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.

కేరళలో అత్యధికం.. గుజరాత్‌లో అత్యల్పం

(మొదటిపేజీ తరువాయి)

బాహాటంగా కాలరాస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గుజరాత్‌లో 68.39 లక్షల మంది భూమి లేని వ్యవసాయ కార్మికులున్నారు. ఈ దశాబ్దన్నర కాలంలో వీరి సంఖ్య మరింత పెరిగింది. వీరు కాక అయిదు లక్షల మంది వలసకార్మికులు, 15 లక్షల మంది నిర్మాణ కార్మికులు, వ్యవసాయేతర పనులు చేసే కూలీలు ఉన్నారు. వీరిలో చాలా మందికి కనీస వేతనం కూడా లభించడం లేదు. గుజరాత్ మోడల్‌ను దేశమంతటికీ విస్తరిస్తామని చెబుతున్న బీజేపీ నేతలు కార్మికులు, వ్యవసాయకూలీలు ఎదుర్కొంటున్న ఈ దయనీయ స్థితి గురించి ఎందుకు మాట్లాడరని ఏఐకేఎస్ నాయకుడు ప్రశ్నించారు.

జాడలేని రైతు 'మద్దతు'

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

రైతులకు బీజేపీ గతంలో వాగ్దానం చేసిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ను మ్యానిఫెస్టో నుంచి తొలగించింది. అలాగే నిరుద్యోగ యువత ఆకాంక్షలను సైతం మ్యానిఫెస్టోలో పొందుపరచలేదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 'సంకల్ప్ పత్ర్' పేరుతో 14 అంశాలతో కూడిన మ్యానిఫెస్టోను ఆదివారం నాడిక్కడ బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో కలిసి ప్రధాని మోడీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ బీజేపీ ఆలోచన ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమేనని అన్నారు. బీజేపీ పాలనలో అభివృద్ధి, సంస్కృతి రెండింటికీ ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడించారు. మానవ కల్యాణం, ప్రపంచ హితం కోసం ఎప్పుడూ ముందుంటామన్నారు. దేశాభివృద్ధికి అవినీతి ఆటంకంగా మారిందన్నారు. నాలుగు స్తంభాలతో 'సంకల్ప్ పత్ర'కు పునాదులు వేశామని తెలిపారు. యువశక్తి, నారీశక్తి, గరీబ్, కిసాన్‌ను దృష్టిలో ఉంచుకుని దీనిని తయారు చేశామని వెల్లడించారు. దేశ యువత ఆకాంక్షలను తమ సంకల్ప్ పత్ర్ ప్రతిబింబిస్తున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు.



సంకల్ప్ పత్రంలోని 14 అంశాలు..

1. విశ్వబంధు
2. సురక్షిత భారత్
3. సమృద్ధ భారత్
4. గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్
5. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు
6. ఈజ్ ఆఫ్ లివింగ్
7. సాంస్కృతిక వికాసం
8. గుడ్ గవర్నెన్స్
9. స్వస్థ భారత్
10. అత్యుత్తమ శిక్షణ
11. క్రీడా వికాసం
12. సంతులిత అభివృద్ధి
13. సాంకేతిక వికాసం
14. సుస్థిర భారత్

మ్యానిఫెస్టోలో ప్రధాన అంశాలు

వన్ నేషన్ వన్ ఎలక్షన్, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేస్తామని పేర్కొంది. పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, పెట్రోలు వినియోగాన్ని అవకాశం ఉన్నంత మేరకు తగ్గిస్తామంది. 2036లో ఒలింపిక్స్ దేశంలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామంది. ఉచిత రేషన్‌ను వచ్చే ఐదేండ్లు కూడా అందిస్తామంది. 70 ఏండ్లు పైబడిన వృద్ధులను ఆయుష్మాన్ భారత్‌లో చేరుస్తామని తెలిపింది. రూ.5 లక్షల ఉచిత వైద్యం అందిస్తామని, పేదలకు మూడు కోట్ల ఇండ్లు కట్టించి ఇస్తామని, వికలాంగుల ప్రత్యేక అవసరాలకనుగుణంగా ఇండ్ల నిర్మాణం చేపడతామని, సీనియర్ సిటిజన్లతో పాటు ట్రాన్స్‌జెండర్లకూ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వర్తింపజేస్తామని, భవిష్యత్తులో పైపులైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ అందిస్తామంది. సూర్య ఘర్ పథకం ద్వారా లబ్దిదారులు తమ ఇంట్లో తయారైన కరెంటును అమ్ముకోవచ్చని, ముద్ర పథకం కింద ఇచ్చే రుణాన్ని రూ.20 లక్షలు చేస్తామని, చిరు వ్యాపారులకు వడ్డీల బాధ తొలగిస్తామని పేర్కొన్నారు.

వచ్చే ఐదేండ్లలో 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేస్తాం. పెద్ద సంఖ్యలో డెయిరీ సహకార సంఘాల సంఖ్య పెంపు, కూరగాయల సాగు, వాటి నిల్వ కోసం కొత్త క్లస్టర్లు, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగం, భారత్‌ను గ్లోబల్ న్యూట్రిషన్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. "శ్రీ అన్న రకం పండించడం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. సముద్ర నాచు, ముత్యాల సాగు దిశగా మత్స్యకారులను ప్రోత్సహిస్తాం. భారత్‌ను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్ వల్ల గ్రామాల ఆదాయం పెరుగుతుంది. నానో యూరియా వినియోగం మరింత పెంచుతాం" అని అన్నారు.

"భారత్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారుస్తాం. ఏజెన్సీల్లో పర్యాటకం ప్రోత్సహించి గిరిజనులకు మేలు చేస్తాం. 'సోషల్, డిజిటల్, ఫిజికల్ రంగాల్లో మౌలిక వసతులు పెంచుతాం. దేశంలో అనేక చోట్ల శాటిలైట్ పట్టణాలు నిర్మిస్తున్నాం. విమానయాన రంగాన్ని ప్రోత్సహించి లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాం. త్వరలో వందే భారత్ స్లీపర్, వందే భారత్ మెట్రో రైళ్లు అందుబాటులోకి వస్తాయి. దేశం నలుమూలల బుల్లెట్ రైళ్లు తెస్తాం. దక్షిణ, ఉత్తర, తూర్పు వైపు కూడా బుల్లెట్ రైలు మార్గాలు వేస్తాం. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్ హబ్‌గా మారుస్తాం" అని పేర్కొన్నారు.

బీజేపీది మతాల మధ్య చిచ్చురేపే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేయించి అక్రమంగా కేసులు బనాయించి జైల్లోకి నెట్టేస్తుందన్నారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలుగా ఉండాల్సిన లౌకికతత్వం, ఫెడరలిజంపై విపరీతంగా దాడులు చేస్తుందన్నారు. ఈసారి మళ్లీ అధికారం ఇస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామని బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. విద్య, వైద్యం, రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానయానాలు, బ్యాంకింగ్ రంగం ఒక్కటేమిటి అన్ని రంగాలు.. ప్రయివేటుపరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్షాల పోరాటాల వల్ల రూపొందిన జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో కోతలు విధిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి బీజేపీకి బుద్ధి చెప్పాలని, ప్రజలందరూ వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ.. కుల, మతాల పేరిట రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ మనువాదాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నటువంటి బీజేపీని ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, కొరబోయిన కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, అనంతగిరి రవి, పట్టణ కమిటీ సభ్యులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, ఎండీ ఫరిదా, రుద్రారపు లక్ష్మి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యాంటీ ట్యాంక్ మిస్సైల్ సిస్టమ్ ప్రయోగం సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) డిజైన్ చేసి, అభివృద్ధి చేసినట్టుర్మీ ఓ ప్రకటనలో తెలిపింది.ఇందులో ఎంపీఏటీజీఎం లాంచర్, టార్గెట్ అక్విజిషన్ ఎక్విప్మెంట్, ఫైర్ కంట్రోల్ యూనిట్ ఉన్నాయని, ఈ క్షిపణి వ్యవస్థను తేలికగా తీసుకువెళ్లే అవకాశం ఉందని వెల్లడించింది. ఎంపీఏటీజీఎం ఆయుధ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మదింపు చేసినట్టు రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ ఆయుధ వ్యవస్థను శనివారం పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించినట్టు పేర్కొంది. మిస్సైల్ సిస్టమ్ అద్భుతమైన పనితీరును కనబరిచిందని, ఈ యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థను పగలు, రాత్రి సమయాల్లోనూ వినియోగించవచ్చని తెలిపింది.

యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థను విజయవంతంగా పరీక్షించినందుకు డీఆర్‌డీఓ, భారత సైన్యాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రశంసించారు. ఆధునిక సాంకేతిక ఆధారిత రక్షణ వ్యవస్థల అభివృద్ధిలో స్వావలంబన సాధించే దిశగా ఇది ఓ కీలకమైన ముందడుగు అని ఆయన పేర్కొన్నారు.

కులగణన అంశం కీలకమే

(మొదటిపేజీ తరువాయి)

ఇంకా చాలా కృషి జరగాలన్నారు.

భారత్‌లో విపక్షాలు బలహీనపడడానికి కారణాలు, ఎన్డీయే సర్కార్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అమర్త్య సేన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు.

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ ఆర్థిక విధానాలపై అమర్త్య సేన్ విమర్శలు గుప్పించారు. భారత్ అభివద్ధికి నిరక్షరాస్యత, లింగ అసమానత్వం అడ్డంకులుగా మారాయని తెలిపారు. భారత పాలకవర్గం పూర్తిగా ధనవంతుల పక్షానే నిలుస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలో మార్పులపై ప్రస్తావించగా.. దాని వల్ల సామాన్య ప్రజలకు ఒరిగేదేమీ ఉండదన్నారు.

ఐకమత్యం లేకపోవడం వల్లే భారత్‌లో విపక్షాలు బలహీనపడ్డాయని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి అనేక సంస్థాగత సమస్యలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉంటే బీజేపీని ఓడించడానికి కావాల్సిన బలం లభించి ఉండేదన్నారు. వ్యవస్థాగత సమస్యలతో సతమతమవుతున్న కాంగ్రెస్.. తన ఘనమైన గతం నుంచి స్ఫూర్తి పొందాలని హితవు పలికారు.

గొంతులో గరగర

(మొదటిపేజీ తరువాయి)

నేరుర్కర్ చెప్పారు. 'సంవత్సరం పొడవునా రాజకీయ నాయకులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇది దురదృష్టకరం. లక్షణాలు కన్పించిన మూడు నుండి ఆరు నెలల తర్వాతే చాలా మంది నాయకులు నా వద్దకు వచ్చి సంప్రదిస్తుంటారు' అని ఆయన తెలిపారు. రాజకీయ నేతలే కాదు... గాయకులు, ఉపాధ్యాయులు, ఆర్‌జేలు, నటీనటులు, బిల్డర్లు, గృహిణులు, కాల్ సెంటర్ ఉద్యోగులు ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించా రు. రాజకీయ నాయకులు బిగ్గరగా, నిరంతరం మాట్లాడడమే కాదు...వారి ప్రసంగాలు తరచూ భావోద్వేగాలతో కూడి ఉంటాయి. ఒక్కోసారి వారు మైక్రోఫోన్ లేకుండానే చిన్న చిన్న సమూహాలను, పార్టీ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించాల్సి వస్తుంది. దీనివల్ల వారి గొంతు మరింత ఒత్తిడికి లోనవుతోంది.

ఎలా ఉన్నావమ్మా..

(మొదటిపేజీ తరువాయి)

న్యాయవాది మోహిత్ రావులతో కలిసి కేటీఆర్ కవితను సాయంత్రం ఆరు గంటలకు కలిశారు. దాదాపు 40 నిమిషాలకు పైగా కవితో మాట్లాడారు. తమ విచారణలో సీబీఐ అడుగుతోన్న ప్రశ్నలపై ఆరా తీశారు. అలాగే ఎంటి పరిస్థితుల్లో మనోధైర్యం వీడొద్దని, తాము తోడుగా ఉంటామని ధైర్యం చెప్పారు. సోమవారం ట్రయల్ కోర్టు ముందు హాజరుపరిచే సందర్భంలో కోర్టు దృష్టికి తెచ్చే అంశాలపై చర్చించారు. అనంతరం భర్త అనిల్ తో కవిత కాసేపు మాట్లాడారు.

సుదీర్ఘంగా విచారణ..

కవితను ఆదివారం సీబీఐ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు దఫాలుగా ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. లిక్కర్ స్కాంలో సంబంధమే లేకపోతే... అరబిందో కంపెనీ డైరెక్టర్ శరత్ చంద్రా రెడ్డితో జరిగిన లావా దేవీల సంగతి ఏంటనీ ప్రశ్నించారు. మహబూబ్ నగర్ లోని రూ.14 కోట్ల వ్యవసాయ భూమిని శరత్ చంద్రారెడ్డి కొనుగోలు చేసేలా ఎందుకు ఒత్తిడి చేశారని ఆరా తీశారు. అది కూడా నిజం కాకపోతే.. శరత్ చంద్రా రెడ్డికి చెందిన అరబిందో గ్రూప్స్ ఆఫ్ కంపెనీ మహిర వెంచర్స్ ప్రయివేట్ లిమిటెడ్ నుంచి ఈ కొనుగోలు జరిగింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఈ అంశాలను పక్కన పెడితే... తెలంగాణ జాగృతి కి సీఎస్ఆర్ రూంలో శరత్ చంద్రా రెడ్డి ఇచ్చిన రూ. 80 లక్షలపై పలు ప్రశ్నలు సంధించారు. 2021 మార్చిలోనే అరబిందో రియాలిటీ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా జరిగిన బ్యాంక్ ట్రాంజక్షన్స్ ను కవిత ముందు పెట్టారు. మరోవైపు రౌస్ ఎవెన్యూ కోర్టు ఇచ్చిన కస్టడీ సమయం ఆదివారంతో ముగియడంతో... కవితను సోమవారం ఉదయం 10 గంటలకు సీబీఐ అధికారులు కోర్టులో హాజరుపరుచనున్నారు.

బీజేపీ ఓటమి ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడే తమ కష్టాలు తీరుతాయంటూ, అంబేద్కర్ కలలు నిజమవుతాయంటూ.. దేశ ప్రజలు ఎంతో ఆశగా చూస్తున్నారని తెలిపారు. ఈసారి బీజేపీ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని హామీలన్ని చెల్లని బ్యాంకు చెక్కులా ఉన్నాయని ఎద్దేవా చేశారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

దాన్ని కూడా అర్థం చేసుకోలేకపోతున్నారని నేను నమ్ముతున్నాను" అని ప్రియాంక గాంధీ రాజస్థాన్‌లోని జలోర్‌లో జరిగిన బహిరంగ సభలో వ్యాఖ్యానించారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్ గెహ్లాట్ కాంగ్రెస్ అభ్యర్థిగా జలోర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆమె మాట్లాడుతూ "భారతదేశంలో జీ 20 సమ్మిట్ వంటి సంఘటనలు జరిగినప్పుడు మేము కూడా గర్వపడుతున్నాము. అయితే మరొక వాస్తవం ఏమిటంటే పేద ప్రజలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం కారణంగా యువకులు బాధపడుతున్నారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికార బీజేపీ అవినీతికి వ్యతిరేకంగా పోరాడడం లేదని విమర్శించారు. "ఆ పార్టీ వాదనలు బూటకమైనవి. కేవలం ప్రతిపక్షాలను మాత్రం బద్నాం చేయాలనుకుంటోంది" అని ప్రియాంక దుయ్యబట్టారు. ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జాలోర్‌కు ఏప్రిల్ 26న ఎన్నికలు జరగనున్నాయి.



సాల్ట్ చితక్కొట్టాడు

- కోల్‌కత చేతిలో లక్నో చిత్తు
- ఫిల్ సాల్ట్ అజేయ అర్థ సెంచరీ
- రాణించిన మిచెల్ స్టార్క్, నరైన్
- లక్నో 161/7, కోల్‌కత 162/2

ఈడెన్‌గార్డెన్స్‌లో నైట్‌రైడర్స్ ఈల వేసింది. లక్నో సూపర్‌జెయింట్స్‌ను చిత్తు చేసి ఐపీఎల్ 17వ సీజన్లో నాల్గో విజయం నమోదు చేసింది. ఫిల్ సాల్ట్ (89 నాటౌట్) అజేయ అర్థ సెంచరీతో 162 పరుగుల ఊరించే లక్ష్యాన్ని కోల్‌కత ఊదేసింది. 15.4 ఓవర్లలోనే లాంఛనం ముగించింది. మిచెల్ స్టార్క్ (3/28), సునీల్ నరైన్ (1/17) మ్యాజిక్‌తో తొలుత లక్నో సూపర్‌జెయింట్స్ 161 పరుగులకే పరిమితమైంది. బ్యాట్‌తో, బంతితో లక్నో సూపర్‌జెయింట్స్‌పై ఎదురులేని ప్రదర్శన చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ 8 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. ఫిల్ సాల్ట్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

నవతెలంగాణ-కోల్‌కత

ఫిల్ సాల్ట్ (89 నాటౌట్, 47 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (38 నాటౌట్, 38 బంతుల్లో 6 ఫోర్లు) సమయోచిత ఇన్నింగ్స్‌తో రాణించగా.. 162 పరుగుల లక్ష్యాన్ని కోల్‌కత నైట్‌రైడర్స్ మరో 26 బంతులు మిగిలి ఉండగానే ముగించింది. ఐపీఎల్ 17వ సీజన్‌లో ఐదు మ్యాచుల్లో కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఇది నాల్గో విజయం కావటం విశేషం. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 161 పరుగులే చేసింది. పేసర్ మిచెల్ స్టార్క్ (3/28), స్పిన్నర్ సునీల్ నరైన్ (1/17) సూపర్‌జెయింట్స్ బ్యాటర్లను కట్టడి చేశారు. నికోలస్ పూరన్ (45, 32 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) సూపర్‌జెయింట్స్‌కు గౌరవప్రద స్కోరు అందించాడు. లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఆరు మ్యాచుల్లో ఇది మూడో పరాజయం కావటం గమనార్హం.

చెలరేగిన సాల్ట్ : ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న జట్లలో కోల్‌కత నైట్‌రైడర్స్ ఒకటి. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో నైట్‌రైడర్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నారు. 200 పైచిలుకు లక్ష్యాలు సైతం కోల్‌కత ముందు నిలువటం లేదు!. ఆదివారం ఈడెన్‌గార్డెన్స్‌లో కోల్‌కత ముందు లక్నో 162 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉంచింది. నైట్‌రైడర్స్ సహజంగానే 15.4 ఓవర్లలోనే లాంఛనం ముగించింది. పించ్ హిట్టింగ్



టాప్ ఆర్డర్ బ్యాటర్లు సునీల్ నరైన్ (6), రఘువంశీ (7) నిరాశపరిచారు. ఫిల్ సాల్ట్‌తో కలిసి నరైన్ తొలి వికెట్‌కు 22 పరుగులు జోడించగా.. రఘువంశీ రెండో వికెట్‌కు 20 పరుగులు జత చేశాడు. లక్నో పేసర్ మోషిన్ ఖాన్ వరుస ఓవర్లలో రెండు వికెట్లతో మెరిసినా.. ఫిల్ సాల్ట్ ముందు లక్నో వ్యూహం ఫలించలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (38 నాటౌట్)తో జతకలిసిన సాల్ట్ మూడో వికెట్‌కు అజేయంగా 76 బంతుల్లోనే 120 పరుగులు జోడించాడు. ఎనిమిది ఫోర్లు, రెండు సిక్సర్లతో 26 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన సాల్ట్ ఆ తర్వాత వేగం మరింత పెంచాడు. ఓ ఎండ్‌లో శ్రేయస్ అయ్యర్ ఇబ్బంది పడ్డాడు. భారీ షాట్లు ఆడలేకపోయాడు. కానీ సాధించాల్సిన రన్‌రేట్ తక్కువగా ఉండటంతో పెద్దగా రిస్క్ సైతం తీసుకోలేదు. జోరుమీదున్న సాల్ట్‌కు సహకారం అందిస్తూ స్ట్రయిక్ రొటేషన్ చేశాడు. పవర్‌ప్లేలో విశ్వరూపం చూపించిన సాల్ట్.. ఆ తర్వాత సైతం క్రమం తప్పకుండా బౌండరీలు బాదాడు. 160 పైచిలుకు లక్ష్యాలను కాపాడుకోవటంలో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ప్రత్యేక రికార్డు ఉంది. గత రెండు మ్యాచుల్లో ఆ జట్టు ఆ రికార్డును కాపాడుకోలేదు. గతి తప్పిన బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించారు. ఎక్స్‌ట్రాల రూపంలోనే లక్నో ఏకంగా 22 పరుగులు కోల్పోయింది. మోషిన్ ఖాన్ (2/29) మినహా సూపర్‌జెయింట్స్ బౌలర్లలో ఎవరూ రాణించలేదు.

ఆదుకున్న పూరన్ : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఓపెనర్లు ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. క్వింటన్ డికాక్ (10), దీపక్ హుడా (8) పవర్‌ప్లేలోనే నిష్క్రమించారు. కెప్టెన్ కెఎల్ రాహుల్ (39, 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుశ్ బదాని (29, 27 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) లక్నో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. కానీ పేసర్ మిచెల్ స్టార్క్, స్పిన్నర్ సునీల్ నరైన్ మ్యాజిక్ ముందు తేలిపోయారు. పరుగుల వేటలో వెనుకంజ వేసిన సూపర్‌జెయింట్స్ ఏ దశలోనూ ప్రమాదకరంగా కనిపించలేదు. మార్కస్ స్టోయినిస్ (10) సైతం నిరాశపరచగా.. డెత్ ఓవర్లలో నికోలస్ పూరన్ (45) ఆదుకున్నాడు. నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లతో మెరిసిన పూరన్ లక్నో సూపర్‌జెయింట్స్‌కు గౌరవప్రద స్కోరు అందించాడు. క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టిన నైట్‌రైడర్స్.. లక్నో సూపర్‌జెయింట్స్‌ను 161 పరుగులకే పరిమితం చేసింది.

స్కోరు వివరాలు :

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్ : డికాక్ (సి) నరైన్ (బి) అరోర 10, రాహుల్ (సి) రమన్‌దీప్ (బి) రసెల్ 39, దీపక్ హుడా (సి) రమన్‌దీప్ (బి) స్టార్క్ 8, ఆయుశ్ బదాని (సి) రఘువంశీ (బి) నరైన్ 29, స్టోయినిస్ (సి) సాల్ట్ (బి) స్టార్క్ 10, నికోలస్ పూరన్ (సి) సాల్ట్ (బి) స్టార్క్ 45, కృనాల్ పాండ్య నాటౌట్ 7, అర్షద్ ఖాన్ (బి) స్టార్క్ 5, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం : (20 ఓవర్లలో 7 వికెట్లకు) 161.**

వికెట్ల పతనం : 1-19, 2-39, 3-78, 4-95, 5-111, 6-155, 7-161.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 4-0-28-3, వైభవ్ అరోర 3-0-34-1, హర్షిత్ రానా 4-0-35-0, సునీల్ నరైన్ 4-0-17-1, వరుణ్ చక్రవర్తి 4-0-30-1, ఆండ్రీ రసెల్ 1-0-16-1.

కోల్‌కత నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్ : ఫిల్ సాల్ట్ నాటౌట్ 89, సునీల్ నరైన్ (సి) స్టోయినిస్ (బి) మోషిన్ ఖాన్ 6, రఘువంశీ (సి) రాహుల్ (బి) మోషిన్ ఖాన్ 7, శ్రేయస్ అయ్యర్ నాటౌట్ 38, ఎక్స్‌ట్రాలు : 22, **మొత్తం : (15.4 ఓవర్లలో 2 వికెట్లకు) 162.**

వికెట్ల పతనం : 1-22, 2-42.

బౌలింగ్ : షమర్ జోసెఫ్ 4-0-47-0, మోషిన్ ఖాన్ 4-0-29-2, కృనాల్ పాండ్య 1-0-14-0, యశ్ ఠాకూర్ 2-0-25-0, అర్షద్ ఖాన్ 2-0-24-0, రవి బిష్ణోయ్ 2.4-0-17-0.

సూపర్‌కింగ్స్ 206/4

దూబె, రుతురాజ్, ధోని ధనాధన్

నవతెలంగాణ-ముంబయి



చెన్నై సూపర్‌కింగ్స్ దంచికొట్టింది. రుతురాజ్ గైక్వాడ్ (69, 40 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), శివం దూబె (66 నాటౌట్, 38 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో చెలరేగగా.. ఎం.ఎస్ ధోని (20 నాటౌట్, 4 బంతుల్లో 3 సిక్స్‌లు) ధనాధన్‌తో కదంతొక్కాడు. ముంబయి ఇండియన్స్‌పై వాంఖడేలో తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. అజింక్య రహానె (5) ఓపెనర్‌గా నిరాశపరచగా.. రచిన్ రవీంద్ర (21, 16 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువసేపు క్రీజులో నిలువలేదు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, శివం దూబె మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 33 బంతుల్లో రుతురాజ్ అర్థ సెంచరీ సాధించగా.. శివం దూబె ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 28 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. డార్లీ మిచెల్ (17) ఫర్వాలేదనిపించాడు. ఆఖరు ఓవర్లో క్రీజులోకి వచ్చిన ఎం.ఎస్ ధోని (20 నాటౌట్) హార్దిక్ పాండ్యపై హ్యాట్రిక్ సిక్సర్లు కొట్టి వాంఖడేను ఉర్రూతలూగించాడు. ధోని మెరుపు హిట్టింగ్‌తో చెన్నై సూపర్‌కింగ్స్ 206 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో హార్దిక్ పాండ్య (2/43) రెండు వికెట్లు తీయగా.. బుమ్రా (0/27) పొదుపుగా బౌలింగ్ చేశాడు.

అగ్రస్థానంలో గుకేశ్

ఫిడె క్యాండిడేట్స్ టెస్



టోరంటో (యుఎస్‌ఏ) : భారత గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ ఫిడె క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. గత రౌండ్ల నైరాశ్యం నుంచి వేగంగా బయటపడిన గుకేశ్.. ఆదివారం జరిగిన ఎనిమిదో రౌండ్ మ్యాచ్‌లో సహచర గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతిపై గెలుపొందాడు. టూ నైట్స్ డిఫెన్స్‌లో 38 ఎత్తుల్లోనే విదిత్‌పై గుకేశ్ గెలుపొందాడు. మరో కీలక మ్యాచ్‌లో ఆర్. ప్రజ్ఞానంద 40 ఎత్తుల్లో అలిరెజా (ఫ్రాన్స్)తో డ్రా చేసుకున్నాడు. ఫాబియానో (యుఎస్‌ఏ)పై హికరు నకమురు (యుఎస్‌ఏ) గెలుపొందగా.. ఐయాన్, నిజత్ మ్యాచ్ డ్రా గా ముగిసింది. ఎనిమిది రౌండ్ల అనంతరం ఐయాన్ (రష్యా)తో కలిసి గుకేశ్ (5.0) అగ్రస్థానంలో నిలువగా.. ప్రజ్ఞానంద (4.5) నాల్గో స్థానంలో నిలిచాడు. విదిత్ గుజరాతి (3.5) ఆరో స్థానంలో ఉన్నాడు. మహిళల విభాగంలో కోనేరు హంపీ (3.5), ఆర్. వైశాలి (2.5) వరుసగా ఆరు, ఎనిమిదో స్థానాల్లో కొనసాగుతున్నారు.

సమరానికి సై

నేడు హైదరాబాద్‌తో బెంగళూర్ ఢీ



బెంగళూర్ : చిన్నస్వామి స్టేడియం ఊరించే సమరానికి సిద్ధమైంది. భీకర ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ తో పేలవ ప్రదర్శనతో డీలా పడిన ఆతిథ్య రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ నేడు తలపడనుంది.చిన్న బౌండరీల చిన్నస్వామి స్టేడియంలో నేడు సన్‌రైజర్స్ బ్యాటర్లు వర్సెస్ రాయల్ చాలెంజర్స్‌బౌలర్లుగా పోరు జరుగనుంది. వరుస విజయాల జోరుకొనసాగించాలని ఆరెంజ్ ఆర్మీ ఎదురు చూస్తుండగా.. వరుస ఓటముల నుంచి ఉపశమనం పొందేందుకు ఆర్సీబీ ప్రయత్నించనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్ నేడు రాత్రి 7.30 గంటలకు ఆరంభం.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తుంది. విదేశీ, స్వదేశీ ఆటగాళ్లు సమిష్టిగా రాణిస్తున్నారు. బ్యాటింగ్,బౌలింగ్ విభాగాల్లో ఎవరిపైనా ఒత్తిడికనిపించటం లేదు. కెప్టెన్ పాట్ కమిన్స్ ఆరెంజ్ ఆర్మీని సరికొత్తగా నడిపిస్తున్నాడు. బ్యాట్‌తో, బంతితో సన్‌రైజర్స్ ప్రమాద కరంగా కనిపిస్తుంది. అభిషేక్ శర్మ, ట్రావిశ్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, మార్‌క్రామ్ లకు ఇప్పుడు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి జతకలిశాడు. పాట్ కమిన్స్, భువనేశ్వర్ కుమార్,నటరాజన్‌లు గొప్పగా రాణిస్తున్నారు. నేడు చిన్న స్వామిలో హైదరాబాద్‌ను ఎదుర్కొవటం బెంగళూర్‌కు శక్తికి మించిన పనే అవుతుంది!. మరోవైపు ఆర్సీబీ శిబిరంలో కల్లోలం కొనసాగు తుంది. విరాట్ కోహ్లి మినహా ఎవరూ రాణించటం లేదు. ప్రధానంగా విదేశీ క్రికెటర్ల వైఫల్యం బెంగళూర్‌ను మరింత కుంగదీస్తోంది. ఆరు మ్యాచుల్లో ఐదు ఓటములు చవిచూసిన ఆర్సీబీ నేడు ఆరో పరాజయం నుంచి తప్పించుకోవటం కష్టమే.

టీ20 విజేత సీఎఫ్‌సీ



హైదరాబాద్: నెక్ట్స్ జెన్ ఉమెన్స్ టీ20 ట్రోఫీని సెంటర్ ఫర్ క్రికెట్ (సీఎఫ్‌సీ) ఎక్సలెన్స్ అకాడమీ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో కోచింగ్ బియాండ్‌పై సీఎఫ్‌సీ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత కోచింగ్ బియాండ్ (సీబీ) 20 ఓవర్లలో 121కు ఆలౌటైంది. ఛేదనలో సీఎఫ్‌సీ టీమ్ 15.5 ఓవర్లలో 122/1 పరుగులు చేసింది. ఓపెనర్ రమ్య (72), ఆల్‌రౌండర్ జి.త్రిషా రెడ్డి (3/18, (44) రాణించారు. 310 పరుగులు, 11 వికెట్లు తీసిన త్రిష టోర్నీ అత్యంత విలువైన ప్లేయర్‌గా నిలిచింది. సీఎఫ్‌సీ జట్టును కోచ్‌లు జగదీశ్ రెడ్డి, షానవాజ్ అభినందించారు.



మంచి కంటెంట్‌తో సోలో బాయ్

బిగ్ బాస్ 7 కంటెస్టెంట్ గౌతమ్ కృష్ణ హీరోగా వస్తున్న చిత్రం 'సోలో బాయ్'. సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ పై సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ నిర్మాతగా పి. నవీన్ కుమార్ దర్శకత్వంలో వస్తున్న సినిమా ఇది. గౌతమ్ కృష్ణ పుట్టినరోజు సందర్భంగా మూవీ టీం పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా అనిత చౌదరి మాట్లాడుతూ, 'ఈ సినిమాలో గౌతమ్‌కి తల్లి పాత్రలో చేస్తున్నాను. సెవెన్ హిల్స్ సతీష్ ఈ సినిమాని ఎంతో ప్యాషన్‌తో నిర్మించారు. డిఓపి త్రిలోక్ పనితీరు చాలా బాగుంది. ప్రతి సినిమాకి ఒక ఫీల్ ఉంటుంది అదేవిధంగా ఈ సినిమాలో కూడా ఒక మంచి ఫీల్ ఉంది' అని అన్నారు.

'నాకు ఈ అవకాశాన్నిచ్చిన సెవెన్ హిల్స్ సతీష్‌కి రుణపడి ఉంటాను. చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు మంచి సినిమానే ఉంటుంది. ఇది కూడా ఒక మంచి సినిమా. ఈ సినిమాలో నటించిన పోసాని కృష్ణ మురళి, అనిత చౌదరి, భద్రం, సూర్య చాలా బాగా నటించారు. మా హీరో గౌతమ్ కృష్ణ చాలా బాగా నటించాడు. సాంగ్స్, ఫైట్స్, ఎమోషనల్ సీన్స్ అన్నింటిలోనూ తనదైన శైలితో నటించాడు. ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని డైరెక్టర్ పి.నవీన్ కుమార్ చెప్పారు.

ప్రొడ్యూసర్ సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమా మంచి సినిమా. ఈ సినిమా కోసం మాకు సపోర్ట్ చేసి, కష్టపడి పనిచేసిన ప్రతి ఆర్టిస్ట్‌కి, టెక్నీషియన్‌కి కృతజ్ఞతలు. గౌతమ్ కృష్ణ ఈ సినిమాతో నాకు సొంత తమ్ముడిలాగా సపోర్ట్ ఇచ్చాడు. గౌతమ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు. డైరెక్టర్ నవీన్ చెప్పిన కథ చాలా బాగా అనిపించింది. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులందరికీ నచ్చుతుంది' అని అన్నారు.

హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ, 'సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ బడ్జెట్ విషయంలో కూడా ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా మంచి కంటెంట్‌ని తీసుకొస్తున్నారు. నా ఫస్ట్ సినిమా నుంచి బిగ్ బాస్ జర్నీ అలాగే ఇప్పటివరకు నన్ను సపోర్ట్ చేస్తున్న అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అతి త్వరలో టీజర్, ట్రైలర్, సాంగ్స్‌తో మీ ముందుకు వస్తాం. ప్రేక్షకులు అందరూ ఈ సినిమాని ఆదరించి, మంచి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

నవచిత్రం

ప్రతినిధి 2 రిలీజ్‌కి రెడీ



నారా రోహిత్

హీరో నారా రోహిత్ నటించిన 'ప్రతినిధి 2' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తపు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వానరా ఎంటర్‌టైన్‌మెంట్స్, రానా ఆర్ట్స్ బ్యానర్‌లపై కుమార్ రజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. నారా రోహిత్ తన ఇంటెన్స్ నటనతో ఆశ్చర్యపరిచారు. మూర్తి రచన, దర్శకత్వంకు మంచి ప్రశంసలు వచ్చాయి.

తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ రైట్స్‌ను డిస్ట్రిబ్యూషన్, ప్రొడక్షన్ సంస్థ అమోఘా ఎంటర్‌టైన్‌మెంట్స్ సొంతం చేసుకుంది. ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్న ఈ చిత్రం ఈనెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. 10 సంవత్సరాల క్రితం 2014లో ఇదే తేదీన 'ప్రతినిధి' విడుదలై సంచలన విజయం సాధించింది.

'ప్రతినిధి 2' ... ప్రతినిధి సిరీస్ నుండి వస్తున్న రెండవ ఫ్రాంచైజీ. ఈ సినిమాలో నారా రోహిత్ నిజాయితీ గల న్యూస్ రిపోర్టర్ పాత్రలో కనిపించనున్నారు. సిరీ లెల్లా కథానాయికగా నటిస్తుండగా, దినేష్ తేజ్, సప్తగిరి, జిషు సేన్‌గుప్తా, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, ఎడిటర్: రవితేజ గిరిజాల, డీఓపీ: నాని చమిడిశెట్టి, ఆర్ట్: కిరణ్ కుమార్ మన్నె, స్టంట్స్: శివరాజు, పృథ్వీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తీక్ పుప్పాల.

సరికొత్త గ్రామీణ నేపథ్య కథ

యువ చంద్ర కృష్ణ హీరోగా సాహిత్ మోత్ఖూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. గ్రామీణ నేపథ్యంలో కొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న చిత్రమిది. ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన లభించగా, పాటలు చార్ట్‌బస్టర్‌గా నిలిచాయి. తాజాగా మేకర్స్ టీజర్ అప్డేట్‌తో వచ్చారు. ఈ చిత్రానికి సంబంధించి పవర్‌ఫుల్ టీజర్ ఈనెల 18న విడుదల చేస్తున్నారు.

నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రజ్ఞా సన్నిధి క్రియేషన్స్‌పై సురేష్ కుమార్ సడిగే నిర్మిస్తున్న ఈ చిత్రంలో అనన్య నాగళ్ల కథానాయిక.

అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు - నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె, సంగీతం- శేఖర్ చంద్ర, సినిమాటోగ్రాఫర్ - మోనిష్ భూపతి రాజు, ఎడిటర్ - కార్తీక శ్రీనివాస్, లిరిక్స్ - కాసర్ల శ్యామ్, ఆర్ట్ డైరెక్టర్ - నార్ని శ్రీనివాస్, ఫైట్స్ - పృథ్వీ, రబిన్ సుబ్బు.



అనన్య నాగళ్ల, యువ చంద్ర కృష్ణ



- 2000 నుంచి కోల్పోయిన మొత్తం 2.33 మిలియన్ హెక్టార్లు
- గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ డేటా
- పర్యావరణవేత్తల ఆందోళన

అసోం గరిష్టంగా 324,000 హెక్టార్ల నష్టాన్ని నమోదు చేసింది. తర్వాతి స్థానాల్లో ఉన్న మిజోరం (312,000 హెక్టార్లు), అరుణాచల్ ప్రదేశ్ (262,000 హెక్టార్లు), నాగాలాండ్ (259,000 హెక్టార్లు), మణిపూర్ (240,000 హెక్టార్లు)లు లక్షలాది హెక్టార్ల అటవీ విస్తీర్ణాన్ని కోల్పోయాయి.


తగ్గిన అటవీ భూమి

న్యూఢిల్లీ : భారత్‌లో అడవుల విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతున్నది. లాభార్జనే ధ్యేయంగా కార్పొరేట్లు, బడా పారిశ్రామికవేత్తలు అటవీ భూముల విషయంలో వారి ఇష్టారాజ్యంగా వ్యవహరించటం, నియంత్రించాల్సిన ప్రభుత్వాలే వారికి అనుకూలంగా చట్టాలు తీసుకొస్తుండటంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పారిశ్రామికవేత్తలు అటవీ భూములను చెరబట్టంతో అక్కడి ఆదివాసీలు తమ జీవనోపాధితో పాటు హక్కులను కూడా కోల్పోతున్నారు. ఇది క్రమంగా దేశంలో అటవీ భూమి తగ్గుదలకు కారణమవుతున్నది. భారత్‌లో అటవీ విస్తీర్ణం తగ్గిందని గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ మానిటరింగ్ ప్రాజెక్ట్ తన నివేదికలో వెల్లడించింది.

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. 2000 నుంచి 2.33 మిలియన్ హెక్టార్ల అటవీ విస్తీర్ణాన్ని భారత్ కోల్పోయింది. ఈ తగ్గుదల ఆరు శాతానికి సమానం. 2002 నుంచి 2023 వరకు భారత్ 4,14,000 హెక్టార్ల తేమతో కూడిన ప్రాథమిక అడవులను (4.1 శాతం) కోల్పోయింది. 2001 నుంచి 2022 మధ్య భారత్‌లోని అడవులు సంవత్సరానికి 51 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేశాయనీ, ఏడాదికి 141 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించటం గమనార్హం.

భారతదేశంలో చెట్లను కవర్ చేసే (అటవీ విస్తీర్ణ) నష్టం ఫలితంగా సగటున సంవత్సరానికి 51.0 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ సమానమైన వాతావరణంలోకి విడుదలైంది. మొత్తంగా, ఈ కాలంలో 1.12 గిగా టన్నులకు సమానమైన కార్బన్ డయాక్సైడ్ ఉత్పన్నమైంది. భారత్‌లో 2013 నుంచి 2023 వరకు 95 శాతం చెట్ల కవర్ నష్టం సహజ అడవుల్లోనే సంభవించింది. 2017లో గరిష్టంగా 189,000 హెక్టార్ల అటవీ విస్తీర్ణ నష్టం జరిగింది. 2016లో 175,000 హెక్టార్లు, 2023లో 144,000 హెక్టార్ల చెట్లను కోల్పోయింది. ఇది గత ఆరేండ్లలో అత్యధికం. 2001 నుంచి 2023 మధ్య మొత్తం చెట్ల కవర్ నష్టంలో 60 శాతం.. ఐదు రాష్ట్రాల నుంచే ఉన్నాయి.

అయితే, భారత్‌లో అటవీ విస్తీర్ణం తగ్గిన పరిస్థితులపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలకు ముందు చూపు లోపించటం, పర్యవేక్షణ లేకపోవటం కారణంగానే ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని వారు అంటున్నారు. అటవీ సంరక్షణ విషయంలో ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలనీ, చట్టాలను తప్పకుండా అమలు చేయాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.



ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా...

ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ప్రకారం.. భారత్‌లో అటవీ నిర్మూలన రేటు 2015 నుంచి 2020 మధ్య సంవత్సరానికి 668,000 హెక్టార్లుగా ఉన్నది. ఇది ప్రపంచవ్యాప్తంగా రెండో అత్యధిక నిర్మూలన రేటు కావటం గమనార్హం. 2002 నుంచి 2022 వరకు అగ్నిప్రమాదాల కారణంగా భారత్ 35,900 హెక్టార్ల చెట్లను కోల్పోయిందనీ, 2008లో అగ్నిప్రమాదాల (3,000 హెక్టార్లు) కారణంగా అత్యధికంగా నష్టం నమోదైందని డేటా వివరించింది. 2001 నుంచి 2022 వరకు, ఒడిశాలో అగ్నిప్రమాదాల కారణంగా అత్యధికంగా చెట్లు క్షీణించాయి. సగటున సంవత్సరానికి 238 హెక్టార్ల నష్టం వాటిల్లింది. అరుణాచల్ ప్రదేశ్ 198 హెక్టార్లు, నాగాలాండ్ 195 హెక్టార్లు, అసోం 116 హెక్టార్లు, మేఘాలయ 97 హెక్టార్లు నష్టపోయాయి.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886